PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 258 | విజయవాడ, శుక్రవారం 28 జులై 2023 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 28 July 2023 | Rs

సాధారణ స్థితికి రాష్ట్రం

- ఇంకా 5 జిల్లాలు, 208 మండలాల్లో తక్కువ వర్షం
- ఖరీఫ్ సాగు అంతంతే
- జులై నాటికి కావాల్సిన సాగులో 16.7 లక్షల ఎకరాలు మైనస్

2



స్పిన్నర్ల దెబ్బకు విండీస్ కుదేల్..

తొలి వన్డేలో ఐదు వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు

పేజీ 9

గోదావరి ఉగ్రరూపం

ధవళేశ్వరం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక

- లంకల్లోకి చేరిన వరద నీరు
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- అనేక గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సహా ఎపిలో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పోటెత్తింది. కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి దగ్గరలో వరద ప్రవాహం కొనసాగుతుంది. ఇదే సమయంలో భద్రాచలం వద్ద 47.10 అడుగుల నీటి మట్టం నమోదైంది అక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. దిగువకు 12 లక్షల క్యూసెక్కుల వరకూ వరదనీటి ప్రవాహం ఉండటంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ వద్ద 14.10 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఇక్కడ రెండవ ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకి లేపి 13,30,274 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. రాత్రికి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద నీరు చేరవచ్చని ఇరిగేషన్ అధికారుల అంచనా వేస్తున్నారు. దిగువకు పెద్దమొత్తంలో నీటిని విడుదల చేయడంతో లంకల్లోకి వరద ప్రవేశించింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలో పెదపట్నం లంక, బి.దొడ్డవరం, అప్పనపల్లికి వెళ్లే రహదారిలోకి వరదనీరు చేరింది. కోటిపల్లి రేవును పూర్తిగా మూసేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో గోష్పాదక్షేత్రంలో ఆలయాల వద్దకు వరద నీరు చేరింది. పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 34 మీటర్లు దాటింది. దీంతో దిగువకు 11.78 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుక్కునూరు ఎ-బ్లాక్‌కు చెందిన దాదాపు 200 కుటుంబాలు కివ్వాక పునరావాస కాలనీకి తరలివెళ్లాయి. దాచారం, కుక్కునూరు, ముత్యాలంపాడు, వింజరం, సీతారాంనగరం, శ్రీధర్ గ్రామాల మధ్య కాజ్‌వేలు నీట మునగడంతో 20 గ్రామాలకుపైగా రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరు, బూర్గంపాడు మధ్యలో ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో భద్రాచలం మిగతా 9లో



సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్న విఆర్.పురం మండలం ఒడ్డుగూడెం వాసులు

హైదరాబాద్-విజయవాడకు స్తంభించిన రాకపోకలు



ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిపైకి వచ్చిన మునేరు వరద నీరు, నిలిచిపోయిన వాహనాలు

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం ఐతవరం గ్రామ సమీపంలో మునేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి (ఎన్‌హెచ్ 65)పైకి వరద నీరు చేరింది. రహదారిపై రెండు అడుగులకుపైగా వరద ప్రవహిస్తోంది. దీంతో ఎపి-తెలంగాణ మధ్య రాకపోకలు స్తంభించాయి. దాదాపు రెండు కిలోమీటర్ల మేర వందలాది వాహనాలు నిలిచిపోయాయి. విజయవాడ వైపు వచ్చే వాహనాలను ఐతవరం వద్ద, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను కీసర టోల్ గేట్ వద్ద నిలిపివేశారు. కంచికచర్ల మండలం కీసర వద్ద మునేరు, వైరా ఏరు, కట్టలేరు వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. నందిగామ మండలం కంచెల వద్ద మునేరు వరదల్లో పది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు చిక్కుకున్నారు. ఉదయం పొలానికి వెళ్లిన వీరు తిరిగి వచ్చే క్రమంలో వరద పెరగడంతో చిక్కుకుపోయారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు వీరిని రక్షించాయి.

అవిశ్వాస తీర్మానాన్ని

వ్యతిరేకించడం సిగ్గుచేటు

- రాష్ట్ర ప్రజలకు వైసిపి, టిడిపి సమాధానం చెప్పాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- మణిపూర్ ఘటనపై రెండు పార్టీల వైఖరి స్పష్టం చేయాలి
- పోలవరం ముంపు బాధితులను ఆదుకోవాలి
- మహిళల అదృశ్యంపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరపాలి
- 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమచేయాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


మణిపూర్ ఘటన నేపథ్యంలో కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఇండియా కూటమి పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించిన వైసిపి, టిడిపిలు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యాలయం దగ్గర్లోని బాలోత్సవ భవన్లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. దేశంతో పాటు యావత్ ప్రపంచం వేలెత్తి చూపించిన మణిపూర్ ఘటనను సమర్థించే విధంగా వ్యవహరిస్తున్న అనాగరికమైన ప్రధానికి మద్దతిచ్చే విధంగా ఈ పార్టీలు వ్యవహరించడం అన్యాయం, ఘోరం, అవమానమని ఆయన అన్నారు.

పార్లమెంటులోరాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వైసిపి, టిడిపి ఎంపిలు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించాయని, ఇంతకంటే సిగ్గుచేటైన విషయం మరొకటి లేదని చెప్పారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎక్కువ అన్యాయం చేసింది ఆంధ్రప్రదేశ్‌కేనని అన్నారు. రాష్ట్ర ప్రజలు బిజెపికి దిక్కులేని పరిస్థితిని తీసుకొచ్చా రని, అయినా, వైసిపి, టిడిపి పూర్తి మద్దతు ఇస్తూ వెనకేసుకు రావడం గర్హనీయ మన్నారు. వైసిపి పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ఏకంగా మణిపూర్ విషయంలో ఏం జరిగిందని అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాలో చెప్పాలని ప్రశ్నించారని ఇంతకంటే సిగ్గుపడాల్సిన విషయం ఇంకొకటి లేదని పేర్కొన్నారు. మణిపూర్ ఘటనలను ఆయనకు కనిపించకపోవడం దారుణమన్నారు. ఏమీ జరగలేదని చెప్పి వెనకేసుకొస్తున్న విజయసాయిరెడ్డి సిగ్గు పడాలన్నారు. అలాగే టిడిపి ఎంపీలు కూడా బడి పిల్లల మాదిరి నోరెత్తకుండా కూర్చుని అవిశ్వాసాన్ని వ్యతిరేకిస్తున్నారని ఈ రెండు పార్టీలను బిజెపికి బి టీమ్, శాటిలైట్ టీములన్నా తప్పులేదని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, వైవి

అవిశ్వాస తీర్మానానికి ముందు పార్లమెంటులో విభజన హామీలపై కేంద్రమంత్రి సమాధానం ఇచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. విభజన హామీలలో ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చినట్లు ఆయన చెప్పలేకపోయారని, అయినా విజయసాయి రెడ్డి, టిడిపి ఎంపిలు ప్రభువును మించిన ప్రభుభక్తి ప్రదర్శిస్తున్నారని అన్నారు. కడప స్టీలు ఫ్యాక్టరీని జిందాల్ ఆధ్వర్యాన నిర్మిస్తామని సిఎం శంకుస్థాపన చేస్తే కేంద్రం సాధ్యం కాదని మిగతా 2లో



విదేశీ విద్యకు 'భరోసా'

- విద్యాదీవెనలో సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్థిక స్థోమత లేని రాష్ట్రవిద్యార్థులకు విదేశాల్లో చదువుకునేందుకు విదేశీ విద్యాదీవెన పథకం ఒక వరం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఈ పథకం అన్ని విధాలుగా విద్యార్థులకు భరోసా ఇస్తుందన్నారు. అత్యంత పారదర్శకంగా ఎక్కడా వివక్ష, లంచాలు లేకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. క్యూఎస్ లేదా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలిచిన టాప్-50 విద్యాసంస్థల్లో సీటు వచ్చిన ఎవరైనా ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. సామాన్యుడికి ప్రఖ్యాత యూనివర్సిటీల్లో చదవడం సాధ్యం కాదన్నారు. ఇలాంటి కళాశాలల్లో చదివి బయటకు వస్తే ప్రపంచాన్ని శాసించే విధంగా పెద్ద కంపెనీల్లో సిఇవోలుగా ఉద్యోగాలు చేసే స్థాయి వస్తుందన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీలకు రూ.10లక్షలు, ఎస్‌టిలకు రూ.15లక్షలు నిధులు అరకొరగా ఇచ్చారని విమర్శించారు. ఇప్పుడు రూ.1.32కోట్లు వరకు ఫీజులు ఇస్తున్నామని వివరించారు. ఇదో విప్లవాత్మకమైన అడుగు అని, రాబోయే రోజుల్లో, రాబోయే తరాలు ఆంధ్రరాష్ట్ర ఖ్యాతిని గుర్తుంచుకునే విధంగా విద్యార్థులకు సపోర్టు చేస్తున్నామని అన్నారు. ఈ పథకాన్ని నాలుగు విడతలుగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, సాంఘిక సంక్షేమ శాఖమంత్రి మేగుగు నాగార్జున, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి, బిసి, సాంఘిక సంక్షేమ, ఉన్నత విద్య, ముఖ్యకార్యదర్శులు జి అనంతరాము, బి జయలక్ష్మి, జె శ్యామలరావు, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శులు కాంతిలాల్ దండే, ఎండి ఇంతియాజ్, గిరిజన శాఖ డైరెక్టర్ జె వెంకట మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె హేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో

ముగ్గురు మృతి

ప్రజాశక్తి-గుంతకల్లు, రాయదుర్గం

అనంతపురం జిల్లాలో గురువారం విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై ముగ్గురు మరణించారు. గుంతకల్లులో తండ్రీకుమారుడు, రాయదుర్గంలో నిర్మాణ కార్మికుడు మృతిచెందారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్లు పట్టణం పాత గుంతకల్లు ఆర్‌డిటి కార్యాలయం ఎదుట నివశిస్తున్న రైతు బోయ పుల్లన్న (50) తన ఇంటి వద్ద ఉన్న కొమ్మలు నరికే క్రమంలో అవి హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. తండ్రిని కాపాడే క్రమంలో కుమారుడు శివ (22) అతన్ని పట్టుకున్నాడు. దీంతో ఇద్దరూ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రాయదుర్గం పట్టణంలోని కణేకల్ రోడ్‌లో ఉన్న శని మహాత్మా గుడిమిట్ట వద్ద నిర్మిస్తున్న నూతన ఇంటి పనులకు నిర్మాణ కార్మికుడు సునీల్(25) వెళ్లారు. పైన ఉన్న విద్యుత్ వైర్లను గమనించకుండా ఇనుప కడ్డీనిపైకి ఎత్తడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నల్ల దుస్తులతో ప్రతిపక్షాల నిరసన

- మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో కొనసాగిన ఆందోళన
- "ఇండియా వర్సెస్ మోడీ" నినాదాల వార్
- ఉభయ సభలు నేటికి వాయిదా



పార్లమెంటు ఆవరణలో నల్లదుస్తులతో ప్రతిపక్ష నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంట్‌ను మణిపూర్ అంశం కుదిపేస్తోంది. మోడీ సర్కార్ మొండి వైఖరిని నిరసిస్తూ గురువారం ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపిలు నిరసన తెలిపారు. బిఆర్‌ఎస్ ఎంపిలు కూడా నల్ల దుస్తులతో పార్లమెంట్‌కు హాజరై తమ నిరసన తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ సమస్యపై మాట్లాడాలని పట్టుబట్టారు. మణిపూర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాల చేపట్టిన ఆందోళన గురువారం కూడా ఉభయ సభల్లో కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే ఉభయ సభల్లో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ ప్రధాని మోడీ విదేశీ పర్యటనపై ప్రకటన చేశారు.

లోక్‌సభలో...

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. అయితే మణిపూర్ అంశంపై ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డుల ప్రదర్శనతో పాటు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. మోడి నోరు విప్పాలని, మౌనాన్ని వీడాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండగా, 'మోడీ, మోడీ' అంటూ బిజెపి సభ్యులు నినాదాలు చేశారు. దీంతో ప్రారంభమైన ఆరు నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. వాయిదా తరువాత సమావేశంలోనూ ప్రతిపక్షాలు తమ ఆందోళన కొనసాగించాయి. ఆందోళన మధ్యే బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఖనిజ చట్ట సవరణ బిల్లును, కేంద్ర వినియోగదారు వ్యవహారాల మంత్రి పియూష్ గోయల్ జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సభ మళ్లీ మూడు గంటల వరకూ వాయిదా పడింది. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపిలు 'మాకు న్యాయం కావాలి' వంటి నినాదాలు హోరెత్తించారు. జన్ విశ్వాస్ బిల్లుపై బిజెపి ఎంపిలు రాజేంద్ర అగర్వాల్, వైసిపి ఎంపి భీశెట్టి సత్యవతి, బిఎస్‌పి ఎంపి మలూక్ నగర్ మాట్లాడిన తరువాత, బిల్లును మూజువాణితో ఆమోదించారు. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్ 9



మహిళా పోరుయాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న ఐద్వా నాయకులు

నేటి నుంచి 'మహిళల పోరుయాత్ర' : ఐద్వా

2

కంపెనీలకు ఓకే.... రాష్ట్రాలకు నో !

- ఇథనాల్ తయారీ కోసం ఎఫ్‌సిఐ బియ్యం
- రాష్ట్రాలకు బియ్యం అమ్మకాలపై నిషేధం

9

ప్రభుత్వ ఖాళీలు భర్తీ చేయాలి

- గవర్నర్‌కు టిడిపి ఎమ్మెల్సీల వినతిపత్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను రూపుమా పేందుకు తక్షణమే ప్రభుత్వ ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని టిడిపి ఎంఎల్‌సిలు కోరారు. ఆ పార్టీకి చెందిన పట్టభద్ర ఎంఎల్‌సిలు భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాటి చిరంజీవి రావు కోరారు. ఈ మేరకు గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను గురువారం రాజ్‌భవన్‌లో కలిసి వినతి పత్రం అందించారు. ఈ మేరకు వివిధ ప్రభుత్వం శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాగ్దానం చేసిన జాబ్‌క్యాలెండర్ అమలు కావడం లేదని గవర్నర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నిరుద్యోగ సమస్య పెరుగుతోందన్నారు. నాలుగేళ్లుగా డిఎస్‌సి, గ్రూప్, జూనియర్ కళాశాల లెక్చరర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ), ఏఇఇ ఉద్యోగాల భర్తీకి ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదని తెలిపారు. యూనివర్సిటీల్లో 70శాతం వరకు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. చాలా విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్, కామర్స్, సైన్స్, ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లలోని అనేక విభాగాలకు రెగ్యులర్ అధ్యాపకులు లేకుండా నడుస్తున్నాయని వివరించారు. దీంతో విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యాప్రమాణాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ఈ ఖాళీలను వీలైనంత త్వరగా పారదర్శకంగా భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాటి చిరంజీవి రావు

సెప్టెంబరు వరకూ సరే

- మిశ్రా పదవీ కాలం పొడిగింపునకు సుప్రీంకోర్టు సమ్మతి

న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని సెప్టెంబరు 15 వరకూ పొడిగించడానికి సుప్రీంకోర్టు గురువారం అనుమతించింది. ప్రజా, దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని అనుమతిస్తున్నట్లు జస్టిస్ బిఆర్ గవై నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించాలని కేంద్రం చేసే తదుపరి విజ్ఞప్తులను అనుమతించమని, సెప్టెంబరు 15న అర్ధరాత్రితో ఇడి డైరెక్టర్‌గా మిశ్రా పదవీ కాలం ఖచ్చితంగా ముగించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.మిశ్రా పదవీ కాలాన్ని ఎన్నిసార్లు పొడిగిస్తారని, మిశ్రా పదవీకాలం పొడిగింపు చెల్లదని, చట్ట విరుద్ధమని ఈ నెల 11న సుప్రీంకోర్టు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నెల 31లోగా మిశ్రా బాధ్యతల నుంచి తప్పుకోవాలని, అతని స్థానంలో మరొకరి నియమించాలని కూడా కేంద్రాన్ని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

చిన్న తప్పు చేసినా శిక్షే

- నిరసనలపై నిషేధం
- ఎపి సర్వీస్ రూల్స్‌లోకి ఆర్టీసీ ఉద్యోగులు
- అమలులోకి 54 కఠిన నిబంధనలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్‌టిసి ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ఎపి సివిల్ సర్వీస్ (కాండక్ట్) రూల్స్ పరిధిలోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. 1964నాటి ఎపి సర్వీస్ రూల్స్‌లో సవరణలు చేయడం ద్వారా, ఆర్‌టిసి ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు రూల్స్‌లోకి తీసుకువచ్చినట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిలో భాగంగానే అనేక కొత్త నిబంధనలను కూడా చేర్చారు. వీటిని పరిశీలిస్తే చిన్న పొరపాటు చేసినా చర్యలు తప్పవని స్పష్టమవుతోంది. ఆదేశాలను ఉల్లంఘించడం, ఇతరులవిధులను అడ్డుకోవడం, ఉద్దేశ్యపూర్వకంగానీ, సంస్థ ఆస్తులకు నష్టం కలిగించడం, అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించలేకపోవడం వంటివి ఈ నిబంధనల్లో ఉన్నాయి. ఆర్‌టిసి ఉద్యోగులు రాజకీయ కార్యకలాపాల్లో పాలుపంచుకోకూడదని పేర్కొన్నారు. కీలక సమయాల్లో వీటిలో అనేకం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటితో పాటు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి తదితర అంశాలను కూడా పేర్కొన్నారు.

నిరసనలపై కఠినం

సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు చేసే నిరసన కార్యక్రమాలను ఉత్తర్వుల్లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. నిరసన బాడ్జీలు ధరించడం, సంస్థను కించపరిచేలా స్లోగన్లు ఇవ్వడం, నిరసన కార్యక్రమాలతో కూడిన ప్రదర్శనలు, ధర్నాలు, ఘెరావ్‌లు, వర్క్ టు రూల్ పాటించడం, ఆకస్మికంగా విధులను బహిష్కరించడం, మెరుపు సమ్మెలకు చేయడం నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రిందివారిని నియంత్రించలేకపోయినా...

తమ కింది ఉద్యోగులను సక్రమంగా నియంత్రించలేకపోవడాన్ని కూడా తప్పిదంగానే భావించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనివల్ల ఆ విభాగానికి, సంస్థకు నష్టం వాటిల్లుతుందన్న భావాన్ని ఉత్తర్వుల్లో వ్యక్తం చేశారు. ముందుగా చెప్పకుండా గైర్హాజరు కారాదని, ఇచ్చిన సెలవు కన్నా అధికంగా ఉపయోగించకూడదని స్పష్టం పేర్కొన్నారు. వారు పనిచేసేప్రధాన కార్యాలయాలను విడిచి అనుమతి లేకుండా బయటకు వెళ్లరాదని నిర్దేశించారు. అధికారిక లైసెన్స్ లేకుండా వాహనాలను నడపడం, అనుమతి లేకుండా తమ స్థానంలో వేరొకరికి బాధ్యతలు మిగతా 2లో

సాధారణ స్థితికి రాష్ట్రం

- ఇంకా 5 జిల్లాలు, 208 మండలాల్లో తక్కువ వర్షం
- ఖరీఫ్ సాగు అంతంతే
- జులై నాటికి కావాల్సిన సాగులో 16.7 లక్షల ఎకరాలు మైనస్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఎట్టకేలకు ఈ ఖరీఫ్‌లో ఇప్పటికి రాష్ట్రం సగటు సాధారణ వర్షపాత స్థితికొచ్చింది. ఇంకా నాలుగు జిల్లాల్లో, 208 మండలాల్లో తక్కువ వర్షమే ఉంది. జులై మూడవ వారం వరకు 16 జిల్లాల్లో, 379 మండలాల్లో తక్కువ వర్షం నమోదుకాగా, జులై నాల్గవ వారంలో కురుస్తున్న వర్షాలతో రాష్ట్రం వర్షాభావం నుంచి తెప్పరిల్లింది. జూన్ 1 నుంచి జులై 27 వరకు ఎపి సగటు సాధారణ వర్షపాతం 239.4 మిల్లీమీటర్లు కాగా 239 మిమీ నమోదైంది. తిరుపతి, అన్నమయ్య, వైఎస్ఆర్, నెల్లూరు, కోనసీమ జిల్లాల్లో ఇంకా వర్షపు లోటు కొనసాగుతోంది. ఇదిలా ఉండగా ఎడతెరిపిలేని భారీ వర్షాలకు అక్కడక్కడ పంటలు దెబ్బతిన్నప్పటికీ, వ్యవసాయ పనులకు ఆటంకం కలిగినప్పటికీ మొత్తంగా సేద్యానికి ఊతమిచ్చాయి. కాగా రాయలసీమ, ఇతర మెట్ట ప్రాంతాల్లో అదను తప్పాక పదును అన్నట్లుంది పరిస్థితి. ప్రధానంగా వేరుశనగ పంట తొలకరి వానలకు జూన్, జులైలో ముమ్మరంగా సాగవుతుంది. ఈ మారు ఆలస్యంగా వర్షాలు పడటంతో ఇప్పుడు వేరుశనగ సాగుకు పదునొచ్చినా అదను తప్పిందని రైతులు చెపుతున్నారు. కొన్నేళ్లుగా వాణిజ్య పంట పత్తి జులై చివరాఖరికి బాగా సాగవుతోంది. జులై మూడవ వారం వరకు సరైన వానల్లేక ఆ పంట సాగు సైతం గణనీయంగా తగ్గింది. కృష్ణా, గోదావరి డెల్టా కాల్వలకు జూన్ మొదటి వారంలోనే నీరు విడుదల చేసినప్పటికీ ఆయా ప్రాంతాల్లో వరి నాట్లు ఊపుగా సాగలేదు. సాధారణంగా ముందస్తుగా ఖరీఫ్ పంటలు సాగు చేసే ఉత్తరాంధ్రలో కూడా అదే పరిస్థితి. పెన్నా డెల్టా కింద నెల్లూరు, తిరుపతిలో వరి కాస్తంత పర్వాలేదనిపిస్తోంది.



ఖరీఫ్ సాగు (లక్షల ఎకరాలు)

పంట	సీజన్ నార్మల్	ఈపాటికి కావాల్సిన సాగు	సాగైంది
వరి	38,80	13.70	9.62
తృణధాన్యాలు	4.70	2.32	1.92
పప్పుధాన్యాలు	7.87	2.70	1.35
ఆహారధాన్యాలు	51.4	18.72	12.90
వేరుశనగ	16.10	9.65	4.00
నూనెగింజలు	17.40	10.42	4.60
పత్తి	15.45	9.22	5.12
మొత్తం	85.97	39.77	23.07

సాగు 27 శాతం

ఖరీఫ్ నార్మల్ సాగులో ఇప్పటికి 27 శాతమే సాగైంది. జులై 26 వరకు కావాల్సిన సాధారణ సాగులో 58 శాతం సాగు నమోదైంది. ఈపాటికి కావాల్సిన సాగులో 16.7 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. సీజన్ నార్మల్‌లో ఆహారధాన్యాలు 25 శాతం సాగయ్యాయి. వరి 25 శాతం, తృణధాన్యాలు 41 శాతం, పప్పుధాన్యాలు 17 శాతం, వేరుశనగ 25 శాతం, మొత్తం నూనెగింజలు 27 శాతం, పత్తి 33 శాతం సాగైంది.

14 జిల్లాల్లో నాల్గవ వంతు

ఎపిలోని 14 జిల్లాల్లో సాధారణ సాగులో 25 శాతం లోపు సాగు నమోదైంది. తొమ్మిది జిల్లాల్లో 26-50 శాతం సేద్యం జరిగింది. తూర్పుగోదావరిలో 51-75 శాతం, తిరుపతిలో 76-100 శాతం పంటలు సాగయ్యాయి.

'ఉక్కు' ప్రయివేటీకరణపై సిఎం స్పందించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే దీక్షలు గురువారానికి 896వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌బిఎం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు, గంధం వెంకటరావు, దాసరి శ్రీనివాస్, ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నాయకులు ఏడిద భార్గవ్ మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారంపై విషం చిమ్ముతున్న అదానీ గంగవరం పోర్టు ఎత్తుగడలను కూకటి వేళ్లతో సహా పెకిలించేందుకు ఉక్కు కార్మికులు సన్నద్ధమవుతున్నారని తెలిపారు. ప్లాంట్‌కు రావాల్సిన కొకింగ్ కోల్‌ను పోర్టు యజమాన్యం అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించకుంటే గంగవరం పోర్టుకు వెళ్లే రోడ్డు, రైలు మార్గాలు సహా నీరు, విద్యుత్‌ను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఉద్దేశ పూర్వకంగానే పోర్టు యాజమాన్యం విశాఖ ఉక్కు కర్మాగారానికి అవరోధాలు కలిగిస్తోందని మండిపడ్డారు. దీక్షల్లో నాయకులు జివి.రమణ, దేవుడు, మహమ్మద్, కొయిలాడ శ్రీను. శనిబాబు, రమేష్ నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు నుంచి అదానీని గెంటేయాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీలు ప్లాంటును కేంద్రం ఇప్పటి వరకూ ప్రైవేటీకరించలేకపోయిందని ఇప్పుడు అదానీని, గంగవరం పోర్టును అడ్డుపెట్టుకుని ముడి సరుకు రాకుండా అడ్డుకుంటూ నష్టాలబాట పట్టిస్తోందని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. గంగవరం పోర్టు నుంచి అదానీని గెంటేయాలని కోరింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. మూడు రోజుల నుంచి వెయ్యి కోట్ల విలువగల కోకింగ్ కోల్‌ను గంగవరం పోర్టులోకి రాకుండా అదానీ కంపెనీ ఆపేసిందని, రూ.71 లక్షలు విశాఖ ప్లాంటు డేమరేజ్ కట్టిందని తెలిపారు. పోర్టులో ఉన్న కోల్‌ను కూడా కన్వేయర్ బెల్టు రిపేరు పేరుతో సరఫరా నిలిపేసిందని, పోర్టును అదానీ స్వాధీనం చేసుకున్న తరువాత రవాణా ఛార్జీలు విపరీతంగా పెంచిందని వివరించారు. రూ.51 కోట్ల బకాయి ఉన్నారనే నెపంతో ప్లాంటు ఉత్పత్తిని దెబ్బతీయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం, అదానీ కలిసి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. స్టీలు ప్లాంటు భూములు 1,100 ఎకరాలు అదానీ పోర్టుకు ప్రభుత్వం అప్పగించిందని, విశాఖకు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటపాడు మండలంలో పనికిరాని ప్రభుత్వ భూములు స్టీలుప్లాంటుకు ఇచ్చినట్లు రికార్డుల్లో చూపించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి గంగవరం పోర్టులో ఉన్న 10.54 శాతం వాటాను మోడీ ఒత్తిడితో కారుచౌకగా పోర్టు యాజమాన్యానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బదిలీ చేశారని అన్నారు. ఇప్పటికీ పోర్టుకు స్టీలు ప్లాంటే నీటిని సరఫరా చేస్తోందని, అయినా ప్లాంటును దెబ్బతీసే విధంగా అదానీ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉత్పత్తిని దెబ్బతీసి కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని, రెండున్నరేళ్ల నుంచి ఉత్పత్తిని 40 శాతం తగ్గించారని, ఫలితంగా ఏడాదికి రూ.3,900 కోట్లు ప్లాంటుకు నష్టాలు వచ్చాయని అన్నారు. ఇప్పుడు పోర్టును అడ్డుపెట్టుకుని ముడి సరుకు రాకుండా అడ్డుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004లో సుదీర్ఘ పోరాటం తరువాత 590 మంది గంగవరం, దిమ్మపాలెం గ్రామాల నుండి నిర్వాసితులను యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులుగా తీసుకుందని, వారికి ఇప్పటికీ రూ.14 వేల జీతం ఇస్తున్నారని తెలిపారు. పర్మినెంటు చేయాలని 22 రోజుల నుండి పోరాడుతున్నా పోర్టు యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదని అన్నారు. గత వారం నుండి స్టీలు ప్లాంటులో తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయని, రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమ దెబ్బతింటున్నా ప్రభుత్వం చోద్యం చూస్తున్నట్లు నటిస్తోందని విమర్శించారు.

అదానీ కంపెనీతో మాట్లాడే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. దీనిపై వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో గంగవరం పోర్టును ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

బలహీనపడ్డ అల్పపీడనం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశాలో కొనసాగుతున్న అల్పపీడనం బలహీనపడింది. వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పులతో అల్పపీడనం బలహీనపడినట్లు వాతావరణ శాఖ పేర్కొంది. రాగల 24 గంటల్లో రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, అల్పపీడన ప్రభావంతో గంటకు 30 - 40 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతాల్లో గాలులు వీచే అవకాశాలున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. మహానందిలో 96.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ఉయ్యాలవాడలో 14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు జలుమూరు మండలం కొమనాపల్లి వద్ద వంశధార నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కూర్మనాథపురం సమీపంలోని 3 ఆర్ కాలువ కుడి గట్టుకు గండిపడటంతో కూర్మనాథపురంతో పాటు రామయ్యవలస, తాళ్లవలస, గుగ్గిలి, గుండువలస, పాగోడు, కరవంజ తదితర గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలు ముంపునకు గురయ్యాయి. పాగోడు గ్రామ సమీపంలోని 11 ఆర్ కాలువపై నిర్మించిన వంతెన ఎత్తుగా లేకపోవడంతో కొమనాపల్లి, శ్రీముఖలింగం, మర్రివలస, అచ్యుతాపురం, నగరికటకం, కత్తిరివానిపేట, సురవరం, దంపాకు, తిమడాం, సైరిగాం, అల్లాడ, అందవరం, పర్లాం, మాకివలస తదితర గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలు నీటి మునిగాయి. ఆమదాలవలస మండలంలోని దూసి, కొత్తవలస వద్ద పంట పొలాలు నీట మునిగాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మహిళల అదృశ్యం దేశవ్యాప్త సమస్య

- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ
- బిజెపి పాలిత రాష్ట్రాలదే అగ్రస్థానం


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళల అదృశ్యం అనేది దేశవ్యాప్త సమస్య అని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాదని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అదృశ్యమైన బాలికలు, మహిళల్లో 78 శాతం మందిని గుర్తించామని, ఈ విషయంలో ఎపి రెండోస్థానంలో ఉందని పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో మూడువేల కేసులకు సంబంధించి ఏడు రోజుల్లో చార్జిషీటు దాఖలు చేశామని వివరించారు. మహిళలు, బాలికలు అదృశ్యంలో బిజెపి పాలిత మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ముందున్నాయని, తెలంగాణ తదితర రాష్ట్రాలు తొలి పదిస్థానాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎపి 11వ స్థానంలో ఉందని, దీన్ని రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థకు అంటగట్టడం సరికాదని వివరించారు. రాష్ట్రంలో మహిళల అభివృద్ధి ఫరిడవిల్లుతోందని, అన్ని రంగాల్లో వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించామని తెలిపారు. సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతోనే ఇస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకూ మూడుకోట్ల మంది మహిళలకు ప్రత్యక్ష ప్రయోజనాలు, మరో కోటిన్నర మందికి పరోక్ష ప్రయోజనాలను బదిలీ చేశామని తెలిపారు. వారి సంరక్షణ కోసం దిశ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినులకు స్వచ్ఛ శానిటరీ న్యాప్కిన్స్ ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పద్మ వివరించారు. మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై బహిరంగంగా చర్చించేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధంగా ఉన్నాయా? అని ఆమె ప్రశ్నించారు.

పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

- కాలువల నిర్వహణ కూడా చేయలేని ప్రభుత్వం
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



సాగునీటి రంగానికి సిఎం జగన్ తీరని ద్రోహం చేశారని, రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ అటకెక్కించారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. సాగునీటి రంగం, ప్రాజెక్టుల నిర్మాణంపై సమాధానం చెప్పాలని, లేదంటే అధికారంలో కొనసాగే అర్హత లేదని అన్నారు. కోస్తాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టుల వారీ టిడిపి, వైసిపి ప్రభుత్వాలు చేసిన ఖర్చులు, వాటి స్థితిగతుల గురించి వివరించారు. కోస్తాంధ్ర ప్రాజెక్టుల కోసం టిడిపి ప్రభుత్వం రూ.21,442 కోట్లు ఖర్చు చేసిందని, వైసిపి నాలుగేళ్లలో కేవలం రూ.4,375 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అన్నారు. తాము 23 ప్రాజెక్టులు పూర్తిచేసి 32 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించామన్నారు. వైసిపి నాలుగేళ్లలో ఒక్క ప్రాజెక్టూ పూర్తిచేయలేదని విమర్శించారు. వంశధార ఫేజ్-2 నిర్మాణంపై గడువు పెంచడం, తేదీలు మార్చి ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిపాటి మిగిలిన తోటపల్లి బ్యారేజీ నిర్మాణ పనులను ప్రభుత్వం పూర్తిచేయలేపోయిందని, రూ.56 కోట్ల ప్రజల సొమ్మును నీళ్లపాలు చేసిందని విమర్శించారు. బిల్లులు నిలిపేయడంతో మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కాంట్రాక్టరు పనులు ఆపేసి వెళ్లిపోయారని తెలిపారు. తారకరామ తీర్థ సాగర్ రిజర్వాయరులో పెరిగిన పిచ్చిచెట్లను తొలగించలేకపోయారని, హిరమండల పనులను ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పలేని దుస్థితి నెలకొందని అన్నారు. పురుషోత్తమ పట్నం ప్రాజెక్టులో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ట్రిబ్యునళ్ల ముందు నిలిపి ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. తాటిపూడి ఆయకట్టు పనులను నిలిపేసి తూర్పుగోదావరి జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర లిఫ్ట్ బిల్లులు ఇవ్వకుండా పనులు ఆపారని, చింతలపూడి లిఫ్ట్‌కు నిధులు లేవని భూసేకరణ నిలిపేశారని వివరించారు. పులిచింతల ప్రాజెక్టు గేట్లకు గ్రీజు కూడా రాయలేక గేట్లు కొట్టుకుపోయేలా ప్రభుత్వం చేసిందన్నారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో ఒక టన్నెల్ తాము పూర్తిచేశామని, నీళ్లిచ్చే సమయానికి ఈ ప్రభుత్వం పనులన్నీ ఆపేసిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టులో తవ్విన మట్టిని శ్రీశైలం కొండల్లో పోస్తున్నారని, దీనివల్ల ప్రాజెక్టులో సిల్ట్ పెరిగి నష్టం ఎక్కువ జరుగుతుందని వివరించారు. గుండ్లకమ్మ రిజర్వాయరు నిర్వహణను పట్టించుకోకపోవడంతో గేట్లు కొట్టుకుపోయాయని, అడ్డగోలుగా ఇసుక తవ్వేయడంతో మొత్తం ప్రాజెక్టు ప్రమాదంలో పడే పరిస్థితి ఉందన్నారు. కృష్ణా డెల్టా ఆధునీకరణ ఆపేయడంతో ఇప్పటికీ లక్షల ఎకరాల్లో నీటి ఎద్దడి ఉందని, ప్రాజెక్టుల్లో గుర్రపుడెక్క తీయడం లేదని విమర్శించారు. ఇరిగేషన్ మంత్రి సొంత నియోజకవర్గం సత్తెనపల్లిలో రైతులే చందాలు వేసుకుని కాలువలు బాగుచేసుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. గోదావరి డెల్టాలో గేట్లు సరిగ్గా లేవని, అన్నీ లీకవుతున్నాయని, కొన్ని గేట్లు తుప్పుపట్టాయని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా, పెన్నా ఫ్లడ్ నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో పంటపొలాలు నీళ్లపాలవుతున్నాయని అన్నారు. రాయలసీమకు 300 టిఎంసిలు తరలించే గొప్ప ప్రాజెక్టు గోదావరి-పెన్నా నదుల అనుసంధానాన్ని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పినట్లు ఐదు నెలల్లో ప్రాజెక్టులు పూర్తిచేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షలో కట్టుకథలు చెప్పారని విమర్శించారు. విశాఖపట్నం కేంద్రంగా నాలుగేళ్లలో రూ.40 వేలకోట్లు దోచుకున్నారని, వీటితో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులూ పూర్తిచేసి మొత్తం భూములకు నీళ్లు ఇవ్వొచ్చని అన్నారు. తాము అధికారంలోకి వస్తే రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాజెక్టులకు నిర్దిష్ట గడువు విధించి పూర్తిచేస్తామని చెప్పారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చెప్పేవన్నీ అబద్ధాలు, కోతలేనని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. రాష్ట్రంలో 54 ప్రాజెక్టులు వుంటే 198 ప్రాజెక్టులంటూ వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నారన్నారు. విజయవాడలోని జలవనరులశాఖ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాయలసీమ ద్రోహిగా ముద్ర వేసేలా వైసిపి ప్రభుత్వంపై బురదజల్లి రాజకీయంగా లబ్ధి పొందాలని చంద్రబాబు కట్టుకథలు చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయం, ఇరిగేషన్, రాయలసీమ గురించి మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు లేదన్నారు. టిడిపి హయాంలో ఏటా 300 కరువు మండలాలుగా ప్రకటించేవారని, జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క మండలం కూడా కరువు మండలంగా లేదంటే ఎవరి హయాంలో వ్యవసాయం సుభిక్షంగా వుందో అర్థమవుతుందన్నారు. 2014 నుంచి 2019 వరకు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసినదంతా కమీషన్‌ల కోసమేనని, ఎక్కడా కొత్త ఆయకట్టును అభివృద్ధి చేయలేదని అన్నారు. దశాబ్దాలుగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రానందునే ప్రీక్లోస్ జిఓ ఇచ్చామన్నారు. ప్రాధాన్యత వుంటే మళ్లీ మొదలుపెట్టవచ్చని జిఓలో వుంది తప్ప శాశ్వతంగా ప్రాజెక్టుల పనులు ఆపమని కాదని అన్నారు. చంద్రబాబు హయాంలో నీరు-చెట్టు పేరుతో రూ.13 వేలకోట్లను దోచుకున్నారని ఆరోపించారు. పట్టిసీమలో రూ.257 కోట్లను కాంట్రాక్టరుకు బహుమతి పేరుతో నొక్కేశారని విమర్శించారు.

అభద్రతా భావంలో బిసిలు

- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో బిసి రక్షణ చట్టం
- జయహో బిసి సదస్సులో లోకేష్

ప్రజాశక్తి - ఒంగోలు బ్యూరో

వైసిపి ప్రభుత్వ హయాంలో బిసిలందరూ భయాందోళనలతో బతుకుతున్నారని, టిడిపి అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో బిసి రక్షణ చట్టాన్ని అమల్లోకి తెస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకష్ హామీనిచ్చారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్రలో భాగంగా గురువారం ఒంగోలు శివారు, రవిప్రియ ఫంక్షన్ హాలు ఎదుట జయహెూ బిసి సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున బిసిలు తరలివచ్చారు. లోకేష్ మాట్లాడుతూ.. బిసిలకు దామాషా పద్ధతిన నిధులు కేటాయించి, కార్పొరేషన్లను బలోపేతం చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం రద్దుచేసిన ఆదరణ పథకాన్ని తిరిగి పునరుద్ధరించి, బిసిలకు పనిముట్లు అందజేస్తామని, విదేశీవిద్య పథకంతో బిసి బిడ్డలకు ఉన్నత విద్యాభ్యాసానికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కుల ధృవీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సెల్‌ఫోన్‌లో ఒక్క బటన్‌తో శాశ్వత కుల ధృవీకరణ పత్రం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేదరికం లేని రాష్ట్రం కోసం కుల వృత్తులను ప్రోత్సహించి, వారి ఆర్థిక స్వావలంబనకు చేయూతనిస్తామని భరోసానిచ్చారు. బహిరంగ సభలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు, అద్దంకి, కొండపి, పర్చూరు ఎమ్మెల్యేలు అద్దంకి రవికుమార్, డాక్టర్ డిబివి స్వామి, ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు.




బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

మహిళల మిస్సింగ్ అవాస్తవం

- గంజాయి మూలాలపై దృష్టి పెట్టాం
- ప్రతి జిల్లాలోనూ సైబర్‌క్రైమ్ కౌంటర్లు : డిజిపి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి



రాష్ట్రంలో 26 వేల మంది మహిళల మిస్సింగ్ అవాస్తమని డిజిపి రాజేంద్రనాథరెడ్డి తెలిపారు. 2019 నుంచి 2021 వరకు చోటుచేసుకున్న మిస్సింగ్ కేసులతో పాటు తాజా కేసులను ఎన్‌సిఆర్‌బి నివేదికలో కలపడంతో పెరుగుదల కనిపిస్తోందని వివరించారు. కేసుల గణాంకాల ఆధారంగా విమర్శలు చేస్తే బాగుంటుందన్నారు. వైఎస్ఆర్ జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న అల్లర్లు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించామని చెప్పారు. మహిళా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. లోక్ అదాలత్‌ల్లో 1.07 లక్షల కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ మూలాలపై దృష్టి పెట్టామనీ, ఒరిస్సా నుంచి స్మగ్లింగ్ రవాణా నిరోధానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సైబర్‌క్రైమ్ నివారణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చోరీలు, మహిళల వేధింపులు, హత్యలు, హత్యాయత్నం కేసులు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు శాతం మేరకు తగ్గాయన్నాఉ. ఎస్ఐ, సిఐ ప్రమోషన్లు చేపడతామని తెలిపారు. కానిస్టేబుల్ పోస్టుల నియమకం కోర్టు పరిధిలో ఉండడంతో చేపట్టలేకపోతున్నామని వివరించారు. కడప జిల్లాలో 2.1 శాతం నుంచి 1.7 శాతానికి, అన్నమయ్య జిల్లాలో 15 శాతానికి క్రైమ్ రేటు తగ్గిందని చెప్పారు. విలేకరుల సమావేశంలో కడప, అన్నమయ్య జిల్లాల ఎస్‌పి అన్బురాజన్, గంగాధర్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి 'మహిళల పోరుయాత్ర' : ఐద్వా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

హింసపై మహిళల పోరుయాత్రను శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. హిందూపురం నుంచి ఒక యాత్ర, విశాఖ ఉక్కు నగరం నుంచి మరొక పోరుయాత్ర ప్రారంభంకానుందని చెప్పారు. ఈ రెండు యాత్రలు ఆగష్టు 8న విజయవాడకు చేరుకుంటాయని, ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోరుయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అనేక రకాల హింసలు, దాడులు పెరిగాయన్నారు. మణిపూర్ ఘటనపై ప్రధాని స్పందించడం దారుణమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళల రక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని కోరారు. అందులో భాగంగానే ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు మహిళల పోరుయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దేశం, రాష్ట్రంలో మహిళలపై హింస, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని, ఇలాంటి దుర్ఘటనలను నిర్మూలించి మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ పాల్గొన్నారు.

చేతబడి నెపంతో గిరిజన మహిళ హత్య

ప్రజాశక్తి - మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

చేతబడి నెపంతో ఓ గిరిజన మహిళను దారుణంగా హత్య చేసిన సంఘటన అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ రమేష్ గురువారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చేపబడి నెపంతో చావడికోట పంచాయతీ పరిధిలోని బంద గ్రామానికి చెందిన పల్లాల బున్నమ్మ (52)ను అదే గ్రామానికి చెందిన సాదల రామిరెడ్డి, సాదల నీలపురెడ్డి, సాదల బోర్రంరెడ్డి హత్య చేశారు. సాదల రామిరెడ్డి భార్య అమ్మయ్యమ్మ రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడటానికి బున్నమ్మే కారణమని అనుమానం వ్యక్తం చేస్తూ నిందితులు ఈ నెల 23న ఈ దారుణానికి ఒడిగట్టారు. అనంతరం పల్లాల పెంటారెడ్డి తోటలో మృతదేహాన్ని పాతిపెట్టారు. ఈ విషయమై గ్రామ పెద్దలకు పెంటారెడ్డి ఫిర్యాదు చేయగా బున్నమ్మ మతదేహాన్ని వెలుపలికి తీసి అటవీ ప్రాంతంలో తిరిగి పాతిపెట్టారు. ఈ నెల 24న గ్రామపెద్దలు సమావేశం ఏర్పాటు చేసి సాదల అమ్మయ్యమ్మ అనారోగ్యానికి బున్నమ్మే కారణమని పేర్కొంటూ అమ్మయ్యమ్మ ఆరోగ్యం కుదుటపడే వరకూ బున్నమ్మ కుటుంబమే వైద్యం, మందుల ఖర్చులు భరించాలని తీర్పునిచ్చారు. ఈ విషయమై బున్నమ్మ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మారేడుమిల్లి తహశీల్దార్ టి.శ్రీనివాసరావు సమక్షంలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సృజన, డాక్టర్ గంగా సురేష్ శవ పంచనామా నిర్వహించారు. బున్నమ్మను ఉద్దేశపూర్వకంగానే మెడకు తాడు చుట్టి హత్య చేసినట్లు నిర్ధారించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

చిన్న తప్పు చేసినా శిక్షే

మొదటి పేజీ తరువాయి

అప్పగించకూడదని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన ప్రింట్ టికెట్లు, టికెట్ ఇష్యూయింగ్ మిషను, ఇతర డాక్యుమెంట్లకు వారే వారే పూర్తి జవాబుదారీగా ఉండాలని, వాటిని పోగొట్టుకుంటే వారే బాధ్యులని స్పష్టం చేశారు. తనిఖీ అధికారులపైనా నిర్దిష్ట బాధ్యతలు ఉంచారు. బస్సుల్లో ప్రయాణించే సమయంలో నిషేధిత వస్తువులైన అగ్ని రాజేసే పరికరాలు, పేలుడు పదార్థాలు, ఆయుదాలు, అటవీ ఉత్పత్తులు, డ్రగ్స్, మద్యం సీసాలు, జంతువుల రవాణాపై నిఘా పెంచాలని, వాటి వివరాలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్దేశించారు. ముందుగా నిర్ణయించిన రూట్లను మార్చివేసి ఇతర రూట్లలో వెళ్లడం, రాజకీయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం కూడా సరికాదని స్పష్టం చేశారు.

అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించడం సిగ్గుచేటు

మొదటి పేజీ తరువాయి

పార్లమెంటులో ప్రకటించిందని, దీనిపై నోరెత్తని వైసిపిని ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. ప్రత్యేక హెూదా, రాజధానికి నిధులు ఇవ్వలేదని, రామాయపట్నం పోర్టును నాన్ మేజర్ కేటగిరీలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని పేర్కొన్నారు. రైల్వేజోన్‌కు రూ.106 కోట్లు అవసరమని అంచనా వేసి గత బడ్జెట్లో రూ.10 కోట్లు ఇస్తామన్నారని, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు. అయినా నోరెత్తని వైసిపి, టిడిపి పార్లమెంటు ప్రతినిధులు అసలు తెలుగు ప్రజలకు ప్రతినిధులేనా అని ప్రశ్నించారు. కేంద్రీయ విద్యాలయాలను కేంద్రం పట్టించుకోవడం మానేసిందని పేర్కొన్నారు. గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.420 కోట్లు అవసరమని అంచనా వేస్తే రూ.125 కోట్లు ఇస్తామని చెప్పి రూపాయి ఇవ్వలేదని పేర్కొన్నారు.

అనంతపురం విశ్వవిద్యాలయానికి రూ.470 కోట్లు అంచనా వేసి రూ.125 కోట్లు శాంక్షన్ చేశారని, ఒక్క రూపాయి ఇవ్వలేదని తెలిపారు. అక్కడ కనీస సదుపాయాలు లేక ఆడపిల్లలకు భద్రత లేక ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి వచ్చినా వైసిపి, టిడిపి ఎంపిలకు చీమకుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. 25 మంది పార్లమెంటు సభ్యులను ఇస్తే కేంద్రం మెడలు వంచుతామని, తోలుతీస్తామని ఉత్తర కుమార ప్రగల్బాలు పలికిన వైసిపి నాయకులు ఇప్పుడు నోరుమూసుకుని మోడీ ముందు మొకరిల్లారని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కుకింగ్‌కోల్ రాకుండా అదానీ ఆపేశారని, దీనివల్ల స్టీలు ప్యాక్టరీలో ఉత్పత్తి ఆగిపోతోందన్నారు. రోజుకు 11 వేల టన్నుల కోల్ కావాల్సి ఉంటే ప్రస్తుతం రెండువేల టన్నులు మాత్రమే అందుబాటులో ఉందని ఇంత నష్టం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. విశాఖ స్టీలు ప్లాంటును ఏమి చేయాలనుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. విశాఖ ఉక్కుకోసం పెట్టిన గంగవరం పోర్టును అదానీ స్వాధీనం చేసుకుని నష్టం చేస్తుంటే వైసిపి ప్రభుత్వం ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. ఇన్ని ఇబ్బందులు పెడుతున్న గంగవరం పోర్టును జాతీయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

కేంద్రం విషయంలో రాష్ట్రంలోని వైసిపి, టిడిపి అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యాన 31వతేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 30 వేలమంది మహిళలు అదృశ్యం అయ్యారని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా లెక్కలు చెప్పిందని, వీరిలో సుమారు 8000 మంది బాలికలు అదృశ్యం అయ్యారని పేర్కొనడం

ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ ప్రకటన ల్యాండ్‌మైన్ పేల్చినట్లు ఉందని, దీనిపై మహిళా కమిషన్ ఏమి చేస్తోందని ప్రశ్నించారు. ఈ విషయమై సిట్టింగ్ జడ్జితో వెంటనే విచారణ చేయించాలని కోరారు. సచివాలయ మహిళా సెక్రటరీలను మహిళల సంరక్షణ, వారి భద్రత కోసం ఉపయోగించాలన్నారు. గోదావరి ముంపు ప్రకృతి సిద్ధమైనది కాదని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే అక్కడ 32 మీటర్ల ఎత్తున వరద ఉందని, 36 మీటర్లకు చేరితే నాలుగు మండలాల పరిధిలో గ్రామాలన్నీ ముంపునకు గురవుతాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని తరలించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులన్నీ యథావిధిగా పంచాయతీలకు ఇవ్వాలని, మైనర్ పంచాయతీల బకాయిలు రద్దు చేయాలని డిమాండు చేశారు.



ఆత్మహత్య చేసుకున్న రైతు మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

చీనీ రైతు ఆత్మహత్య

- రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-అనంతపురం

అప్పుల బాధతో చీనీ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు... పెనకచెర్ల గ్రామానికి చెందిన నాగభూషణం(68) తనకున్న 4.22 ఎకరాల భూమిలో చీనీపంట సాగు చేస్తున్నారు. దీని కోసం వేసిన బోర్లలో నీరు ఇంకిపోతుండటంతో వరుసగా 18 బోర్లు వేశారు. పంట సాగు, బోర్లు వేసేందుకు దాదాపు రూ.30 లక్షల వరకు అప్పులు చేశారు. పంటలకు సరైన ధర రాకపోవడంతో అప్పుల బాధలు అధికమయ్యాయి. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

వినుకొండలో ఉద్రిక్తత

- వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ
- లాఠీచార్జీ, గాలిలోకి కాల్పులు
- 144 సెక్షన్ విధింపు

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా వినుకొండలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి శ్రేణులు ఎదురెదురుగా ఘర్షణకు దిగడం, పరిస్థితిని చక్కబెట్టేందుకు లాఠీఛార్జీ, ఆపై గాలిలోకి కాల్పులతో వినుకొండ పట్టణం అట్టుడికింది. టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులుతోపాటు మరికొందరిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి శ్రేణులు గురువారం వినుకొండ పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అదే సమయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన అనుచరులతో కలిసి ఆర్‌సిఎం చర్చి సమీపంలోకి రాగానే టిడిపి శ్రేణులు ఎదురుపడ్డాయి. ఎమ్మెల్యే తన కారులో నుండే టిడిపి శ్రేణులను దుర్భాషలాడడంతో వారు ఎమ్మెల్యే కారును చుట్టుముట్టారు. దీంతో ఎమ్మెల్యే వాగ్వాదానికి దిగడం, ఆక్కడికి వైసిపి శ్రేణులు భారీగా చేరుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. టిడిపి శ్రేణులపైకి వైసిపి శ్రేణులు రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. దీంతో టిడిపి కార్యకర్తలు ప్రతిదాడి చేశారు. పోలీసులు తొలుత లాఠీచార్జ్ చేసి ఇరు పక్షాలను చెదరగొట్టినా వైసిపి శ్రేణులు ఏ మాత్రం వెనక్కు తగ్గకపోవడంతో వినుకొండ పట్టణ సిఐ సాంబశివరావు గాలిలోకి కాల్పులు జరిపారు. టిడిపి శ్రేణులంతా ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలోకి పరుగులు తీయగా వైసిపి కార్యకర్తలు మరోసారి దాడి చేశారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పట్టణ సిఐతోపాటు రూరల్ సిఐ ప్రసాద్, ఐదు మండలాల ఎస్‌లు, సిబ్బంది రంగంలోకి దిగారు. పట్టణంలో 144 సెక్షన్‌ను విధించారు. ఘర్షణలో టిడిపికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు.



ఎదురెదురుగా మోహరించిన వైసిపి-టిడిపి శ్రేణులు , తుపాకీతో హెచ్చరికలు చేస్తున్న సిఐ సాంబశివరావు

పోలీసుల సమక్షంలోనే ఎమ్మెల్యే పథకం ప్రకారమే మారణాయుధాలతో దాడి చేయించారని, దాడి చేసిన వారితోపాటు ఎమ్మెల్యేపైనా హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 1-6 తేదీల్లో లోకేష్ యువగళం పాదయాత్ర ఈ ప్రాంతంలో జరగనుండగా దాన్ని అడ్డుకోవడానికే ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు.

వైసిపి నాయకుల ప్రవర్తన సరికాదు
టిడిపి అధినేత చంద్రబాబు

వైసిపి నాయకుల తీరు సరికాదని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినుకొండలో అక్రమ కేసులకు వ్యతిరేకంగా శాంతియుత వాతావరణంలో నిరసన తెలియజేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలపై వీధి రౌడీల్లా దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రెచ్చగొట్టే తీరుతో శాంతి భద్రతల సమస్య వస్తుంటే, నివారించాల్సిన పోలీసులు తమ పార్టీ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. వైసిపి నేతల రౌడీయిజంపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. వినుకొండలో ప్రస్తుత పరిస్థితులు రాష్ట్రంలో శాంతి భద్రతల తీరుకు నిదర్శనమన్నారు.

బిజెపి ద్రోహంపై మాట్లాడరేం

- వైసిపి, టిడిపిల తీరుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేస్తున్నా వైసిపి, టిడిపిలు నోరుమెదపకపోవడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. విశాఖలోని జగదాంబ దరి ఎన్‌పిఆర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న బిజెపిని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిఘటించకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రా, తెలంగాణ పార్లమెంట్ సభ్యులు వేసిన ప్రశ్నలకు హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సమాధానమిస్తూ విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు రూ.106.89 కోట్లు గత నవంబరులో కేటాయించినట్లు తెలిపి, ఈ బడ్జెట్‌లో రూ.10 కోట్లు మాత్రమే కేటాయించినట్లు చెప్పారన్నారు. దీన్ని బట్టి విశాఖ రైల్వే జోన్ పట్ల బిజెపి చిత్తశుద్ధి ఏమిటో ఇట్టే అర్థమవుతోందని తెలిపారు. జాతీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.946 కోట్లు కేటాయించాల్సి ఉండగా మొదట ఏడాదిలో రూ.7.5 కోట్లు, ఇప్పుడు రూ.24.34 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. జాతీయ విద్యా సంస్థల ఏర్పాటు పట్ల కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించి గిరిజనులకు తీవ్ర ద్రోహం చేస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో స్టాటిజిక్ సేల్ పేరుతో అమ్మకానికి పూనుకుంటున్నట్లు మరోసారి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామ్ ప్రకటించారని, ఇది దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. అదానీ గంగవరం పోర్టు నుంచి స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన ముడిసరుకు ఇవ్వకుండా అనేక ఆంక్షలు పెడుతున్నారని తెలిపారు. గంగవరం పోర్టు నిర్మాణానికి 1100 ఎకరాల భూమిని స్టీల్‌ప్లాంట్ నుంచి తీసుకుని, ఇప్పుడు ఆ కర్మాగారాన్ని నష్టాల్లోకి నెట్టడం నమ్మకద్రోహం కాదా? అని ప్రశ్నించారు. ప్లాంట్ విషయమై కనీసం పార్లమెంట్‌లో చర్చించి నివారణా చర్యలకు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. విశాఖలో ఇఎస్‌ఐ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్‌ప్లాంట్, రామాయపట్నం పోర్టులకు కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు నోరుమెదకపోవడంపై మండిపడ్డారు. సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు పాల్గొన్నారు.

బిజెపి పాలనలో ప్రయివేటీకరణ జోరు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేటీకరణ విధానాలు వేగవంతమయ్యాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు అన్నారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర సమావేశం గురువారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో జరిగింది. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ న్యూస్ యూట్యూబ్ ఛానెల్‌ను నరసింగరావు ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ప్రైవేటీకరణ విధానాలు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని తెలిపారు. రైల్వే, బ్యాంకు, బిఎస్‌ఎన్‌ఎల్ రంగాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా ఆగస్టు 9న అన్ని కార్మిక సంఘాలు కలెక్టరు కార్యాలయాల ముందు నిరసన వ్యక్తం చేయనున్నాయని, అంగన్‌వాడీలు మద్దతు తెలిపాలని కోరారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల దశలవారీ పోరాటానికి మద్దతు ఇవ్వాలన్నారు. పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆధునిక సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రాలకు ఉన్న అద్దె బిల్లులు చెల్లించాలని, ఫేస్ రికగ్నైజేషన్ నిబంధనలు సడలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు నాగశేషు, చంద్రావతి, ఉమాదేవి, లక్ష్మీదేవి, షీభారాణి, అనసూయమ్మ, మల్లేశ్వరి, రేఖ, ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యిరోజులైనా పట్టదా?

- టిటిడి అటవీ కార్మికుల దీక్షలపై సర్కారుకు సిహెచ్ నర్సింగరావు ప్రశ్న
- తిరుపతిలో భారీ ప్రదర్శన,సభ
- రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల గిరుల పచ్చదనాన్ని నిరంతరం కాపాడుతున్న అటవీ కార్మికులకు టిటిడి యాజమాన్యం ద్రోహం చేస్తోందని అఖిలపక్షం మండిపడింది. కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి వెయ్యి రోజులకు చేరుకున్నాయి. వారికి సంఘీభావంగా ప్రజాసంఘాల పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు జరిగాయి. తిరుపతిలో భారీ ప్రదర్శన, సభ జరిగింది. టిటిడి అటవీ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఈసభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ అటవీ కార్మికుల పట్ల టిటిడి యాజమాన్యం ప్రవర్తిస్తున్న తీరును తప్పుబట్టారు. 200 మంది కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి వెయ్యి రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి నామమాత్రంగా కూడా పట్టదా అని ఆయన ప్రశ్నించారు. ఈ పరిస్థితిటిటిడి లాంటి సంస్థలకు గౌరవనీయం కాదన్నారు. జూనియర్లను పర్మినెంట్‌చేసి, సీనియర్లను కార్పొరేషన్‌లో కలపడం చరిత్రలో ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించారు. కందారపు మురళి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పర్మినెంట్ చేస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చి, నాలుగున్నరేళ్లయినా హామీని అమలు చేయలేదన్నారు. క్రూరమృగాలు వెంటాడుతున్నా టిటిడి కార్మికులు తిరుమల పచ్చదనం కోసం పాటు పడుతూనే ఉన్నారని తెలిపారు. టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ మాట్లాడుతూ అటవీ కార్మికులకు టైంస్కేలు ఇస్తామని తీర్మానించి నాలుగేళ్లయినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ టిటిడి అటవీ కార్మికులకు మద్దతుగా ఆగస్టు నెలలో జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌తో తిరుపతిలో బహిరంగసభ నిర్వహిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, సిపిఐ జిల్లా నేత రాధాకృష్ణ మాట్లాడుతూ వెయ్యి రోజుల పాటు రిలేదీక్షలు చేయడం చారిత్రాత్మకమని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు, నగర కార్యదర్శి టి సుబ్రమణ్యం మాట్లాడుతూ 25 ఏళ్లుగా టిటిడి అటవీ కార్మికుల శ్రమను దోపిడీ చేసి ఇప్పుడు వీధుల పాలు చేయడం దారుణమని విమర్శించారు. రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు లేబూరి రత్నకుమార్, టిటిడి అటవీ కార్మికుల యూనియన్ నేతలు ప్రసంగించారు. పోస్టల్ నాయకులు శ్రీధర్, ప్రముఖ న్యాయవాదులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.



టిటిడి ఫారెస్టు కార్మికుల దీక్షలో ప్రసంగిస్తున్న సిహెచ్ నర్సింగరావు

కడప ఉక్కు రాయలసీమ ప్రజల హక్కు

- కేంద్రం మోసాన్ని సీమ సహించదు : మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

కడపలో ఉక్కు పరిశ్రమ వీలు కాదని ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన ఏకపక్ష ప్రకటన దుర్మార్గమైందని, తక్షణమే దీనిని ఉపసంహరించుకోవాలని రాయలసీమ అభివృద్ధి వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమకు ఇచ్చిన హామీలకు కేంద్ర ప్రభుత్వం పదేపదే తూట్లు పొడుస్తోందన్నారు. చట్టబద్ధంగా ఇచ్చిన హామీలను ఉల్లంఘించడం రాయలసీమ ప్రజల పట్ల కేంద్రం చేస్తోన్న నేరం అన్నారు.

తెలుగు ప్రజలకు ఉమ్మడిగా ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చకపోవడం కేంద్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలకు అద్దం పడుతోందన్నారు. కడపలో ఉక్కు.. పరిశ్రమ రాయలసీమ ప్రజల హక్కు అని అన్నారు. రాయలసీమ భవిష్యత్ పారిశ్రామికీకరణకు అదొక అవసరమని పేర్కొన్నారు. దాన్ని కాదనే వారు ఎవరికైనా రాయలసీమ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సాంకేతిక అంశాల మాటున, రాయలసీమకు మోసం చేయాలని చూస్తే బిజెపికి ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు. విభజన చట్టంలో రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వానికి నిర్దేశించిన బాధ్యతలను, ఎటువంటి మినహాయింపులూ లేకుండా నిర్వర్తించాలని డిమాండ్ చేశారు.

తాడిపత్రిలో ప్రొటోకాల్ వివాదం

- కార్యాలయంలో దీక్ష చేపట్టిన మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపాలిటీలో గత రెండు రోజులుగా ప్రొటోకాల్ వివాదం నడుస్తోంది. ప్రొటోకాల్ సమస్యపై మున్సిపల్ కమిషనర్ గత రెండు రోజులుగా సమాధానం ఇవ్వకుండా, తన ఛాంబర్‌కు రాకుండా ఉండడాన్ని నిరసిస్తూ టిడిపి మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి దీక్ష చేపట్టారు. బుధవారం రాత్రి నుంచి ఆయన మున్సిపల్ కార్యాలయంలోనే ఉన్నారు. గురువారం ఉదయం జెసి ప్రభాకర్‌రెడ్డితో మున్సిపల్ కమిషనర్ గడ్డం రవి, అధికారులు చర్చలు జరిపారు. కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న చేపల మార్కెట్‌కు వేలం వేయాలని జెసి.ప్రభాకర్‌రెడ్డి వారికి సూచించారు. ఇందుకు ఆగస్టు 8వ తేదీన వేలానికి సిద్ధం చేస్తామని అధికారులు ఆయనకు చెప్పారు. అధికారుల హామీతో టిడిపి కౌన్సిలర్లు, జెసి.ప్రభాకర్ రెడ్డి దీక్ష విరమించారు.



మారుతి డ్రైవింగ్ స్కూల్‌లో 20 లక్షల మందికి శిక్షణ

న్యూఢిల్లీ : మారుతి సుజుకి తమ డ్రైవింగ్ స్కూల్స్‌లో ఇప్పటి వరకు 20 లక్షల మందికి డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి.. నూతన మైలురాయిని చేరినట్లు ఆ సంస్థ తెలిపింది. దేశంలోని 230 పైగా నగరాల్లోని 520 పైగా మారుతి సుజుకి డ్రైవింగ్ స్కూళ్లలో థియరీ, ప్రాక్టికల్ శిక్షణ ఇస్తుందని పేర్కొంది. 2005లో తొలిసారి డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. తొమ్మిది భాషల్లోనూ శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించింది.

సంపాదకీయం

నెతన్యాహు నియంతృత్వం

ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ముసుగు తొలగించి బాహాటంగా న్యాయవ్యవస్థపై దాడికి దిగారు. ఏడు మాసాలుగా దేశమంతటా పెద్దయెత్తున కొనసాగుతున్న నిరసనలు,ఆందోళనలను, అంతర్జాతీయ సమాజం చేసిన హెచ్చరికలను బేఖాతరు చేస్తూ న్యాయ వ్యవస్థను నిర్వీర్యం గావించే సంస్కరణల బిల్లును ప్రతిపక్షాల బాయ్‌కాట్ మధ్య నెసెట్ (పార్లమెంటు)లో ఆమోదింపజేసుకున్న తీరు ఈ యూదు దురహంకార నేత నియంతృత్వ పోకడలకు అద్దం పడుతోంది. దీనికి వ్యతిరేకంగా బిల్లు ఆమోదించిన రోజునే పార్లమెంటు వెలుపల పది వేల మందితో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. అంతకుముందు వరుసగా రెండు రోజుల పాటు దేశ వ్యాపితంగా వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి బిల్లును వెనక్కి తీసుకోవాలని నినదించారు. తాజాగా డాక్టర్లు, ఆర్మీ రిజర్విస్టులు సమ్మెకు దిగారు. పత్రికలు ఎడిటోరియల్ పేజీని నల్ల రంగుతో ప్రచురించాయి. ఈ నిరసనలు అంతర్యుద్ధానికి దారి తీసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. 75 ఏళ్లుగా పాలస్తీనాపై దురాక్రమణ సాగిస్తూ, పాలస్తీనీయులను తమ సొంతగడ్డపై శరణార్థులుగా మార్చిన నెతన్యాహు అవినీతి కుంభకోణాల్లోనూ పీకల్లోతున కూరుకుపోయాడు. పాలస్తీనీయులను ఊచకోత కోసినా, తన అవినీతి భాగోతాలను ఎవరు ప్రశ్నించినా సహించలేకపోతున్నాడు. పాపాల భైరవుడిగా పేరొందిన ఈ యూదు దురహంకార నేత పై కేసులన్నీ నిష్పాక్షికంగా విచారిస్తే వందేళ్లకుపైగానే జైలు శిక్ష పడుతుంది.కోర్టు అధికారాలను హరించడానికి ఇది కూడా ఒక ముఖ్య కారణం. వివాదాస్పద బిల్లు చట్టంగా మారినందున ఇకపై రాజ్యాంగపరమైన ఉన్నత పదవుల్లో క్రిమినల్స్‌ను యథేచ్ఛగా నియమించుకోవచ్చు, తన తాబేదారులను న్యాయమూర్తులుగా ప్రతిష్టించవచ్చు.. తనపై ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అవినీతి, అక్రమార్జన, మోసం వంటి క్రిమినల్ కేసుల నుంచి బయటపడి,అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండొచ్చు, నెతన్యాహు ఇంత బాహాటంగా ప్రజాస్వామ్యంపై దాడి చేస్తుంటే అమెరికా కిమ్మనడం లేదు. ఐరాసలో ఇజ్రాయిల్ దాష్టీకాలకు వ్యతిరేకంగా తీర్మానం వచ్చిన ప్రతి సందర్భంలోను దానికి మోకాలడ్డిన చరిత్ర అగ్రరాజ్యానిది. న్యాయవ్యవస్థపై దాడి చేసిన నెతన్యాహుకు ఇటీవల వైట్ హౌస్‌లో అధ్యక్షుడు బైడెన్ ఎర్ర తివాచీ పరచి స్వాగతం పలకడాన్ని ఏమనుకోవాలి? అసలు ఇజ్రాయిల్ పుట్టుకే విచిత్రమైనది. 1948లో అమెరికా, మరి కొన్ని యూరప్ దేశాలు ప్రపంచవ్యాపితంగా ఉన్న యూదులకు ఒక దేశం అంటూ లేదని, పాలస్తీనా భూ భాగంలోని ఒక చిన్న ప్రదేశంలో దీనిని నెలకొల్పారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఇజ్రాయిల్ పాలస్తీనా భూ భాగాలను ఒకదాని తరువాత ఒకటి ఆక్రమించుకుంటోంది. ప్రపంచంలో ప్రజాస్వామ్యం గురించి గొంతు చించుకుంటూ, ప్రత్యర్థి దేశాలపై ఆంక్షలు మీద ఆంక్షలు విధించే అమెరికా, ఇజ్రాయిల్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే మన్ను తిన్న పాములా మిన్నకుండిపోయింది. అగ్రరాజ్య ద్వంద్వ వైఖరికి ఇదొక నిదర్శనం.

ఆర్మీ రిజర్విస్టులు దీనిని వ్యతిరేకిస్తుండడంతో తమ ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదముందని గ్రహించిన ఇజ్రాయిలీ కార్పొరేట్ శక్తులు ప్రతిపక్షాలకు, ప్రభుత్వానికి మధ్య రాజీ కుదిర్చేందుకు యత్నించాయి. ఇజ్రాయిల్‌లో ఆర్మీ రిజర్విస్టుల సమ్మె నెతన్యాహును ఎక్కువగా కలవరపరుస్తున్నది. మోడీ ప్రభుత్వం ఇక్కడ ప్రవేశపెట్టిన అగ్ని వీర్ లాంటివారే ఈ ఆర్మీ రిజర్విస్టులు. ఆర్మీలో తర్ఫీదు పొందిన ఈ యూదు యువకులను సంవత్సరానికొకసారి కాంట్రాక్టు పద్ధతిలో ఆర్మీ వినియోగించు కుంటుంది. .న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వీరంతా ఇప్పుడు సమ్మెలో ఉన్నారు. వీరి సహకారం లేకుంటే పాలస్తీనాలోని వెస్ట్‌బ్యాంక్‌ను పూర్తిగా ఆక్రమించుకోవడానికి, అలాగే ఇరాన్, సిరియా భూ భాగాల ఆక్రమణకు నెతన్యాహు ప్రభుత్వం పన్నిన పన్నాగాలు పారవు.

ఇజ్రాయిల్ పరిణామాలు భారత్‌లో చాలా మందిని ఆందోళనకు గురి చేస్తున్నాయి. నెతన్యాహును రోల్ మోడల్‌గా తీసుకుని ఇక్కడ నరేంద్ర మోడీ న్యాయవ్యవస్థను అణగదొక్కే యత్నాలు చేస్తున్నారు. కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకు యూదు దురహంకారాన్ని రెచ్చగొడుతూ, అరబ్బులను ద్వితీయ శ్రేణి పౌరులుగా నెతన్యాహు పరిగణిస్తుంటే, ఇక్కడ మోడీ కూడా అదే మాదిరిగా మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ, మైనార్టీలపై దాడులకు దిగుతున్నారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘోరాలు దీనినే సూచిస్తున్నాయి. అవినీతి, కుంభ కోణాలు, మోసాల్లో ఇద్దరూ ఇద్దరే. ప్రతిపక్షాలపైన, తన రాజకీయ ప్రత్యర్థులపైన, అనుమానమున్న స్వపక్షీయులపైన నిఘా వేసేందుకు ఇజ్రాయిల్ నుంచి పెగాసస్ పరికరాలను, ఆయుధాలను మోడీ ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. వీరిరువురి మధ్య ఇలాంటివే అనేక సారూప్యతలున్నాయి. సుప్రీంకోర్టు కొలీజియం వ్యవస్థపై దాడికి ఇప్పటికే ఒకసారి మోడీ ప్రభుత్వం విఫల యత్నం చేసింది. సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరించి ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కుదిస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చిన విషయాన్ని మరచిపోలేం. ఇజ్రాయిల్‌లో నెతన్యాహు ప్రభుత్వానికి ఎదురవుతున్న ప్రతిఘటన లాంటిదే భారత్‌లోనూ రావాలి. భారత్‌ను మరో ఇజ్రాయిల్‌గా మార్చే మోడీ యత్నాల పట్ల సదా అప్రమత్తత అవసరం.

మహనీయుల మాట



చదువుకున్న పౌరులు లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందలేదు. కట్లు తెంపుకోవడానికి కత్తి లాంటి ఆయుధం చదువొక్కటే.

- నెల్సన్ మండేలా

విద్వేషాలలో సమిధలవుతున్న మహిళలు

ఉద్యమం



డి. రమాదేవి

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన భారతీయ ప్రజానీకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. వెన్నులో వణుకు పుట్టించింది. స్త్రీలను గౌరవిస్తాం. మన భారతీయ సంస్కృతి ఇది అని చెప్పుకునే చోట...ఇంతగా బరితెగించి బహిరంగంగా మహిళలను నగ్నంగా ఊరేగించే దుర్మార్గం ఏ రకంగా సాగింది? "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అంటూ కాలి కింద చెప్పు మాదిరి అణిచివేయాలనే దుర్మార్గపు సాంస్కృతిక నేపథ్యం దీనికి కారణం కాదా? ఈ దుర్మార్గపు సంస్కృతిని ముసుగులా వేసుకున్న పురుషాధిపత్య భావజాలాన్ని, భూస్వామ్య ప్రవృత్తిని మూలాలకంటా ఛేదించాల్సిన అవసరాన్ని మణిపూర్ ఘటనలు వెలుగులోకి తెచ్చాయి. ఆర్.ఎస్.ఎస్ సాంస్కృతిక సంస్థ అని చెప్పుకుంటూ కాలం చెల్లిపోయిన భూస్వామ్య పురుషాధిపత్యాన్ని పున:ప్రతిష్టించే ప్రయత్నం చేస్తున్నది.

బిజెపి అధికారంలోకి వచ్చేవరకు తన భావజాలాన్ని జనం మీద రుద్దడానికి ఆర్‌ఎస్‌ఎస్‌కు పెద్దగా అవకాశం దొరకలేదు. చాప కింద నీరు మాదిరి పని చేస్తున్నా కోరలు పెరగలేదు. కానీ నయవంచక బిజెపి కేంద్రంలో అధికారంలోకి రావడంతో వారి ఎజెండాను అత్యంత చురుగ్గా అమలు చేయడం ప్రారంభించారు. తమ మిత్రులైన క్రోనీ క్యాపిటలిస్టుల లాభాల కోసం భూస్వామ్య సంస్కృతిని జోడించి మరీ ఈ దేశంలో దళితులపై, ఆదివాసీలపై, వెనకబడిన శూద్ర తరగతులపై బుల్డోజర్ నడిపిస్తున్నది. ఈ బడుగు బలహీనులను అణిచివేసేందుకు, సమస్త వనరులను కబ్జా చేసేందుకు పూనుకున్నది. కాశ్మీర్ భూభాగాన్ని క్రోనీ క్యాపిటలిస్టులకు అప్పజెప్పేందుకు 370 ఆర్టికల్‌ని రద్దు చేయడం చూశాం. ఆర్టికల్ 370 రద్దుకు ముందు ఓ ముస్లిం బాలికపై గుడిలో అత్యాచారానికి తెగబడడం గుర్తుండే వుంటుంది. అక్కడ భూమిని కబ్జా చేసేందుకే మైనారిటీ తెగకు చెందిన ఆ చిట్టితల్లిని చిదిమివేశారు. నేడు మణిపూర్ కొండల్లో ఉన్న విలువైన ఖనిజ సంపద కోసం రావణ కాష్టం రగిలించారు.

ఆ జ్వాలల్లో ఆడపిల్లలు సమిధలవుతున్నారు. ఒకరా? ఇద్దరా? ముగ్గురా? ఎందరు? లెక్కలు తేలాల్సి ఉంది. అసలు తేలుతాయా? అన్నది ఈ రోజు అందరూ అడుగుతున్న ప్రశ్న. ఈ ఘటనలు చోటుచేసుకున్న రెండు నెలల వరకు, వీడియో వెలుగులోకి వచ్చేవరకు, సుప్రీంకోర్టు హెచ్చరిక చేసే వరకు ప్రధానికి తెలియదా? తెలుసని ఈ దేశ ప్రజలు ఈ రోజు నమ్ముతున్నారు. తెలియడం మాత్రమే కాదు, వాటికి ప్రధాని, ఆయనను నడిపించే ఆర్‌ఎస్‌ఎస్ ఆమోదం కూడా ఉందని. ఆమోదం లేదా? దీనికి వారు సమాధానం చెప్పగలిగే ఖలేజా ఉందా? బిల్కిస్ బానో మన ఆడపడుచు. పోరాడి గెలిచింది. ఏం చేశారు? ఆగస్టు 15 అమృతోత్సవాల సంబరాల్లో నిందితులకు స్వేచ్ఛనిచ్చారు. పైగా ఏమన్నారు? బ్రాహ్మణులు-సంస్కారవంతులు. అంటే ఏమిటి అర్థం. ఇతర కులాలకు చెందిన వారు సంస్కారవంతులు కారనా! అత్యాచారానికి పాల్పడిన వారు సంస్కారవంతులెలా అవుతారు? 'ఈ దేశంలో స్త్రీ బ్రాహ్మణులకు మొదటి హక్కు. స్త్రీకి స్వతంత్రత లేదు'-అని మనుధర్మం చెప్తుంది. దాన్నే వీరు తమ చేతల్లో చూపిస్తున్నారు. సంఘీయుల ప్రకారం కోర్టులు మను ధర్మాన్ని తప్ప ఐపిసిని అనుసరించకూడదు. హత్రాస్‌లో కోర్టు ఆ మనుధర్మాన్నే పాటించింది. ఎవరైనా చనిపోయినప్పుడు కొన్ని సాంప్రదాయాలు పాటిస్తుంటాం. అయితే అవి అందరికీ లేవు. దళితులకు అసలే లేవు. అందుకే మనీషా వాల్మీకిని అర్ధరాత్రి దహనం చేశారు. ప్రజాప్రతినిధి సింగార్ అత్యాచారం చేసిన కేసులో జైలుకు వెళ్ళాడు. కానీ బిజెపి నాయకత్వం పూలదండలతో స్వాగతించి భుజాన మోశారు. రెజ్లర్లు మన బిడ్డలు. కఠోర దీక్షతో విజయాలను ముద్దాడిన ప్రియపుత్రికలు. ఈ దేశ ప్రతిష్టను ప్రపంచ పటంలో నిలబెట్టిన ఆడపిల్లలు. భద్రంగా కాపాడుకోవాల్సిన బిడ్డలు. తమ మీద లైంగిక దాడి జరిగిందని, న్యాయం చేయమని వారు రోడ్డెక్కినా ప్రధాని మోడీ మాట్లాడలేదని మన దేశ ప్రజలు ఆశ్చర్యపోయారు. ఔరా! ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన తమ సొంత పార్టీ మనిషిని మోడీ వెనకేసుకొస్తున్నాడేమని ఆశ్చర్యపోయారు అమాయకపు ప్రజలు. స్త్రీలు నో అంటే నో అనే అర్థమని అమితాబ్ బచన్ సినిమాలో చెప్తే మాకేంటి? మేం కోరుకున్న మహిళ మా చెంత ఉండాల్సిందే! అనే ధోరణే దీనికి కారణం కాదా.

ఈ రోజు గుంటూరులో ఓ రమ్య, విశాఖలో ఓ వరలక్ష్మి, విజయవాడలో ఓ దీపిక...ఇలా ఎన్ని పేర్లని చెప్పుకోవాలి? ఆడపిల్లను కోరుకున్నప్పుడు కాదంటే చంపటం ఈ భావజాలం వల్లే కదా! మహిళలకు విలువ ఇవ్వని ఈ మనువాద పాలకులు అధికార పీఠాలు పొందారు. కడుపులో చేయిపెట్టి తిప్పినట్లు ప్రతి నిముషం ఎక్కడో ఒకచోట ఆడపిల్ల ఆర్తనాదం. దీనిని ఆపాలని మొత్తుకుంటున్నాం. ఆలకించడంలా? వదిలేద్దామా? వదిలేస్తే మనం బతగ్గలమా? రక్షణ ఉందా? మన బతుకుల కోసం మన బిడ్డల బతుకుల కోసం కదలాలి. బహు రూపాలలో. వంటరిగా కాదు. సమూహంగా పాలకులకు చెవికెక్కే వరకు. వారు చెవి నెక్కించుకోకపోతే గద్దె దించేందుకు. మహిళల రక్షణ కోసం ఆర్తితో, ఆవేదనతో, ఆగ్రహంతో మహిళా సంఘం ఓ బృహత్తర కార్యక్రమం చేపట్టింది. మహిళా సంఘాలు కలిసి రూపొందించిన కోర్కెల పత్రాన్ని ప్రజల ఎజెండాగా ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

మహిళల రక్షణ కోసం నేడు పోరాట గడ్డ ఉక్కు నగరం విశాఖ నుండి ఒక యాత్ర, హిందూపురం నుండి మరో యాత్ర ప్రారంభమైంది. హింస లేని సమాజం కోసం అన్ని జిల్లాల్లోనూ విస్తృతంగా ప్రచార సభలు జరగనున్నాయి. ఆగస్టు 8న విజయవాడలో జరగనున్న బహిరంగ సభ నుంచి మహిళా రక్షణ కోసం చేయి చేయి కలిపి నడుద్దాం. ఈ మహఉద్యమంలో భాగస్వాములమవుదాం. మనువాద రాచరిక సంస్కృతిని, దానిని కాపాడే వారిని నిలదీద్దాం. వెలివేద్దాం.



మహిళలకు విలువ ఇవ్వని ఈ మనువాద పాలకులు అధికార పీఠాలు పొందారు. కడుపులో చేయిపెట్టి తిప్పినట్లు ప్రతి నిముషం ఎక్కడో ఒకచోట ఆడపిల్ల ఆర్తనాదం. దీనిని ఆపాలని మొత్తుకుంటున్నాం. ఆలకించడంలా? వదిలేద్దామా? వదిలేస్తే మనం బతగ్గలమా? రక్షణ ఉందా? మన బతుకుల కోసం మన బిడ్డల బతుకుల కోసం కదలాలి. బహు రూపాలలో. వంటరిగా కాదు. సమూహంగా. పాలకులకు చెవికెక్కే వరకు. వారు చెవినెక్కించుకోకపోతే గద్దె దించేందుకు.

ఇవి డిమాండ్లు ...

- మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయటానికి, చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణులతో కమిషన్ ఏర్పాటు చేయాలి.
- మహిళలపై హింసను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని మహిళా సంఘాలు స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానించి కార్యాచరణను రూపొందించాలి.
- మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలి.
- నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారణ జరిపి కఠినమైన శిక్షలు విధించాలి. చెరుకుపల్లి మండలంలో అమర్నాథ్ హత్య కేసును ఫాస్ట్ ట్రాక్‌కు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేయాలి.
- ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి. హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలి.
- సోషల్ మీడియాలో ట్రోలింగ్ లపై చర్యలు ఉండాలి.
- కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపులను నిరోధించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలి, అమలు చేయాలి.
- అన్ని విద్యాలయాల్లో లింగ సమానత్వాన్ని పెంపొందించే సిలబస్ ను రూపొందించాలి. బాల బాలికల మధ్య స్నేహపూర్వక అవగాహనను కల్పించాలి.
- పాఠశాలల్లో శారీరక దారుఢ్యాన్ని పెంచే ఆటలు, ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాలు... అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి.
- వన్ స్టాప్ సెంటర్లు, హెల్ప్ లైన్లు ఉమ్మడిగా సమన్వయంతో పని చేసే ఏర్పాటు చేయాలి. తగిన సిబ్బందిని నియమించాలి. ఏ నెలకానెల జీతాలు చెల్లింపు చేయాలి.
- మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి. మండలానికి ఒక మద్యం షాపును మాత్రమే అనుమతించాలి.
- మద్యం, మత్తుమందులకు వ్యతిరేకంగా ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయాలి. మద్యం మీద వస్తున్న ఆదాయంలో కనీసం ఒక్క శాతమైనా మద్య నియంత్రణకు కేటాయించాలి.
- డి-అడిక్షన్ కేంద్రాలు ప్రతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు చేయాలి.
- బాల్య వివాహాల నిరోధానికిగాను బాలికలకు నిర్బంధ విద్య 19 సంవత్సరాల వరకు పెంచాలి.
- ఒంటరి మహిళలకు, వారి కుటుంబాల్లోని పిల్లలకు అదనపు రక్షణ సదుపాయాలు ఏర్పాటు చేయాలి.
- అనాథ బాలలు, ఆడపిల్లలు ఉన్న హాస్టళ్లలో, గెస్ట్ హౌస్‌లో పురుష సిబ్బంది ఉండరాదు.
- పోలీసులకు జండర్ సెన్సిటివిటీ పెంచడానికి క్రమబద్ధంగా శిక్షణ కార్యక్రమాలు ఉండాలి. సక్రమంగా లేని పోలీసు ఆఫీసర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.
- మహిళల సమానత సాధనకు చర్యలు ముమ్మరం చేయడం ద్వారానే హింసను కూడా అరికట్టడం సాధ్యమవుతుంది. కనుక అన్ని రంగాల్లో సమానత సాధనకు ప్రభుత్వం పూనుకోవాలి.
- బాధితుల పునరావాసం కోసం కంపెన్సేషన్ ఇవ్వవలసిన నిధులను నెలలోగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- ఉపాధి గ్యారంటీ పథకాలు రూపొందించి అమలు చేయాలి. పెద్ద సంఖ్యలో ఉన్న అసంఘటిత మహిళా కార్మికులకు కార్మిక చట్టాలు అమలు పరిచేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.
- ప్రతి వారం ఒక ప్రాంతంలో మండల అధికారులు మహిళల హక్కులను వివరిస్తూ అమలుకు పూనుకునే విధంగా ప్రచారం, కార్యాచరణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి.
- మహిళలకు విద్య, రక్షణ, ఉపాధి భద్రత కల్పించేందుకు రాజ్యాంగ విలువలను కాపాడే పద్ధతులను అమలు చేసేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అమలు చేయాలి.

/ వ్యాసకర్త ఐద్వా రాష్ట్ర కార్యదర్శి /

దేశాన్ని నగ్నంగా నడిపించిన వారు మన పాలకులా?

కామన్‌స్పేస్



డా॥ దేవరాజు మహారాజు

కుకీ మహిళల్ని నగ్నంగా ఊరేగించిన అమానుష సంఘటన 2023 మే 4న జరిగితే, జులై 20న 78 రోజుల తర్వాత ఒకరిని అరెస్టు చేశారు. దేశ పరిపాలనా వ్యవస్థ పని తీరును ఇది ప్రతిఫలిస్తుంది. నిజానికి సీన్‌లో కనిపించేవారు దోషులే అయినా, వారిని ఉసిగొల్పిన పెద్దదోషులు వేరే ఉన్నారు. నోర్లు విప్పకుండా, నిర్లిప్తంగా ఘోరాలు జరగడానికి సహకరించిన రాష్ట్ర - కేంద్ర నాయకులే అసలు దోషులు! స్వతంత్ర భారతదేశంలో తొలిసారి జరిగిన ఈ సంఘటన, కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని అంటే డబుల్ ఇంజన్ సర్కార్‌ని ప్రశ్నించింది.

బిజెపి పూర్తి మెజార్టీతో అధికారం చేపట్టినప్పటి నుండి దేశంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజాస్వామ్య సంస్కృతిని ధ్వంసం చేస్తూ, హిందుత్వ సంస్కృతిని ప్రాచుర్యంలోకి తేవడంతో - దేశంలో మైనార్టీలకు భద్రత లేకుండా పోయింది. అంతే కాదు, అధికారంలో ఉన్నవారే అల్లర్లకు ఆజ్యం పోస్తున్నప్పుడు, మెజార్టీగా ఉన్న హిందువులకు కూడా రక్షణ లేకుండా పోయింది. అల్లర్లు మొదలయ్యాయంటే, అవి ఎటునుండి ఏ మలుపు తీసుకుంటాయో తెలియదు. అల్లర్లలో చిక్కుకున్న వారు ఏ మతస్తులైనా కావొచ్చు కదా? కొన్ని నెలలుగా మణిపూర్ మండిపోతుంటే ఈ దేశ ప్రధాని ఒక చిన్న మాట మాట్లాడలేదు. ఈ విషయంపై ప్రముఖ జర్నలిస్ట్ కరణ్ థాపర్ ఏమన్నారో చూడండి... "టర్కీ భూకంపానికి మన ప్రధాని స్పందించి ట్వీట్ చేస్తారు. గుజరాత్ తుపాన్ గురించి 'మన్‌కి బాత్'లో ప్రస్తావిస్తారు. కాని, మణిపూర్‌లో కొన్ని నెలలుగా జరుగుతున్న మారణకాండ గురించి ఎక్కడా ఏమీ స్పందించరు. అంటే ఈ దేశం ఏమి అర్థం చేసుకోవాలి? 1. ఆయనకు ఈ విషయం తెలియకపోవచ్చు. 2. విషయమంతా తెలిసినా, దాన్ని గుర్తించడానికి, వాటిపై స్పందించడానికి బాహుశా ఆయనకు ఆసక్తి లేకపోవచ్చు" అని! మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న హింసకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మద్దతు ఇస్తున్నాయని ఆరోపిస్తూ మిజోరమ్ బిజెపి ఉపాధ్యక్షుడు ఆర్. వన్‌రామ్ ఛూ ఆంగా తన పదవితో పాటు బిజెపి పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇంఫాల్‌ను సందర్శించారు కానీ, రాష్ట్రంలో చర్చి భవనాలను తగులబెట్టడాన్ని ఆయన తప్పు పట్టలేదు. చర్చిలను తగలబెడుతూ ఉంటే కేంద్ర ప్రభుత్వం ఖండించకపోవడం - భరించలేని బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు రాజీనామా చేసి బయటికి వెళ్ళిపోయాడు. పార్టీ ముఖ్యం కాదు, మానవత్వానికి ప్రాధాన్యమివ్వడం ముఖ్యం! అనుకుని ఉంటారు, వన్‌రామ్ ఛూ ఆంగా.


ఉత్తర భారతదేశం వరదల్లో కొట్టుకుపోతూ ఉంటే, ఢిల్లీ ఎర్రకోట చుట్టూ నీళ్ళు నిలిస్తే, గాంధీ సమాధి సైతం నీట మునిగితే - దగ్గరుండి కాపలాదారు చూస్కోవాలి కదా? దేనికి ముందు ప్రాధాన్యత ఇవ్వాలి? దేనికి తరువాత ఇవ్వొచ్చు అనేది చూస్కోవాలి కదా? ఏదో అర్జంటు పని ఉన్నట్టు భారత ప్రధాని ఫ్రాన్స్‌కు వెళ్ళిపోతాడా? ఎక్కడికి వెళ్ళినా కొనుగోళ్ళకే కదా? అవి తరువాతైనా చేసుకోవచ్చు కదా? సరే ఇది అలా ఉండనిద్దాం! ఈ హిందుత్వ వాదులు ఏం కోరుకుంటున్నారూ? అంటే...భారత రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలవారు సమానమే కానీ, అధిక సంఖ్యాకులుగా ఉన్న హిందువులకు సమాజంలో అగ్రస్థానం దక్కాలి. వారే మొదటి స్థాయి పౌరులు. ఇక మిగతా వారంతా నోరెత్తకుండా రెండో స్థాయి పౌరులుగా పడి ఉండాలి. అంతే! ఆ కుట్రలో భాగంగానే, మిగతావారిని హిందువుల నుండి విడగొట్టి - చూపడానికే వారసత్వ చట్టాలు తెచ్చారు. దేశవ్యాప్తంగా వందల షహీన్‌బాగ్‌లు వెలిసి కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిరసించాయి. రైతు వ్యతిరేక చట్టాల్ని రైతులు తిప్పికొట్టిన విషయం కూడా మనం మరవకూడదు. ఎన్ని పరాభవాలు, పరాజయాలు ఎదురైనా మూర్ఖులు తమ పట్టుదలను వదలరు. అందుకు తాజా ఉదాహరణ యూనిఫాం సివిల్‌కోడ్. మతము - సంస్కృతి- దేశభక్తి అన్నింటినీ కలిపి దేశాన్ని 'హిందూ రాష్ట్ర'గా మార్చేయాలని ప్రభుత్వానికి వెనక ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ పథకాలు రచిస్తోంది.

అరవై ఏళ్ళుగా గత ప్రభుత్వం చేసిందీ? అని మోడీ తరచూ తన ప్రసంగాల్లో ప్రశ్నిస్తుంటారు. గత ప్రభుత్వాలు అరవైయేళ్లుగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ వస్తున్నాయని చెప్పడానికి మోడీజీయే ఒక పెద్ద ఉదాహరణ! ఒక రుజువు!! చదువుకోకపోయినా, రైల్వే స్టేషన్‌లో చాయ్ అమ్ముకుని బతికినా, భిన్నమైన ఆలోచనా ధోరణి గలవాడైనా... ఈ దేశ ప్రజలు అతన్ని ప్రధానిని చేశారు కదా? ప్రజాస్వామ్యంటే అదే... గత పాలకులు నిరంకుశులైతే మోడీ ప్రధాని అయ్యేవాడే కాదు. ముందు ఆ విషయం గ్రహించుకుంటే బావుండేది. అయినా ఆ స్థానానికి ఉన్న విలువను కాపాడలేక, ప్రపంచ దేశాల ముందు నవ్వులపాలు కావడం ఆయన తప్పిదం!! అధికారంలో ఉన్నవారు ఎప్పుడైనా తామేం చేస్తున్నామని ఆత్మావలోకనం చేసుకోవడం మంచిది. ఏ ప్రభుత్వం ఏం చేసింది? ఏం చేయలేదూ? అన్నది ప్రజలు బేరీజు వేసుకుంటారు. అది వారి పని-నాయకులు తమ బాధ్యతల్ని తాము నిర్వహించుకుంటూ ఉంటే, ఇతరులను ప్రశ్నించొచ్చు. ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలు (జులై 2023) ఎగ్గొట్టి కేంద్ర సహాయమంత్రి వచ్చి హైదరాబాదులో రోడ్డుమీద భైఠాయిస్తాడు. తను వెంటనే బాటసింగారం డబుల్ బెడ్‌రూంలు చూడాలంటాడు. పార్లమెంట్ సమావేశాలు ఎగ్గొట్టి రావడం గొప్ప బాధ్యతగల పనా? ఎప్పుడు ఎక్కడ ఏ పని చేయాలో కనీస పరిజ్ఞానం కేంద్ర మంత్రులకే లేకపోతే ఎలా?

ఇది రాస్తున్న సమయానికి 2023 జులై 20న అన్ని టెలివిజన్ చానళ్ళలో ముగ్గురు మణిపూర్ కుకీ జాతి స్త్రీలను నగ్నంగా వీధుల్లో నడిపించిన వీడియో కనిపించింది. కలవరపడ్డ దేశ ప్రజలు తల దించుకున్నారు. మతోన్మాదం నీడన జరిగిన రాజకీయాన్ని ఈసడించుకున్నారు. జాతీయ పతాకం అవనతమైనట్లయ్యింది. దేశం ప్రాభవం కోల్పోయింది. అంతకు ముందు రెండున్నర నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండకు ఈ పరేడ్ ఒక కొనసాగింపు. నగ్నంగా నడిపించిన ఆ ముగ్గురు స్త్రీలలో ఒకరి భర్త సైనికుడు. దేశాన్ని రక్షించిన తను, తన భార్యను, తన గ్రామస్తుల్ని రక్షించుకోలేక పోయానని వాపోయాడు. భోరున విలపించాడు. ఆ ఏడుపు అతనొక్కడిదే కాదు, ఈ దేశంలో మనసున్న మనుషులందరిదీ... ఆ విషయాన్ని సుప్రీంకోర్టు వెంటనే సుమోటాగా స్వీకరించింది. మతాలవారీగా కులాలవారీగా ప్రజల్ని విభజించి, స్త్రీ శరీరాలను పావులుగా వాడుకునే దుష్ట రాజకీయాల్ని కేంద్ర ప్రభుత్వం అదుపులో పెట్టుకోలేకపో యింది. దేశ ప్రజల ముందు నిస్సిగ్గుగా బయటపడింది. 'ఇండియా'గా ఐక్యమైన విపక్షాలన్నీ మణిపూర్ వైఫల్యానికి దేశ ప్రధాని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి. పార్లమెంటు సమావేశాల తొలి రోజునే మణిపూర్ మారణహోమం గురించి చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి.

కుకీ మహిళల్ని నగ్నంగా ఊరేగించిన అమానుష సంఘటన 2023 మే 4న జరిగితే, జులై 20న 78 రోజుల తర్వాత ఒకరిని అరెస్టు చేశారు. దేశ పరిపాలనా వ్యవస్థ పని తీరును ఇది ప్రతిఫలిస్తుంది. నిజానికి సీన్‌లో కనిపించేవారు దోషులే అయినా, వారిని ఉసిగొల్పిన పెద్దదోషులు వేరే ఉన్నారు. నోర్లు విప్పకుండా, నిర్లిప్తంగా ఘోరాలు జరగడానికి సహకరించిన రాష్ట్ర - కేంద్ర నాయకులే అసలు దోషులు! స్వతంత్ర భారతదేశంలో తొలిసారి జరిగిన ఈ సంఘటన, కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని అంటే డబుల్ ఇంజన్ సర్కార్‌ని ప్రశ్నించింది. వారి మెదళ్ళ లోని అనాగరికతకు అద్దం పట్టింది. మణిపూర్ జనాభాలో 54 శాతానికి పైగా ఉన్న మైతీ కులస్థులకు కుకీ, నాగ గిరిజన తెగలకూ మధ్య బిజెపి తన రాజకీయ లబ్ధి కోసం చిచ్చుపెట్టింది. గిరిజన చట్టాలను అతిక్రమించి మైతీలను గిరిజనులుగా మార్చడానికి బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయి. కుకీ, నాగ తెగలు ప్రతిఘటించాయి. ఈ గిరిజన తెగల వారు క్రిస్టియన్లు. అందువల్ల మతోన్మాదులు ప్రభుత్వాల అండతో వారి ఇళ్లు, చర్చిలు ధ్వంసం చేశారు. వందల మందిని చంపేశారు. స్త్రీలపై అత్యాచారాలు చేశారు. రెండున్నర నెలలుగా అక్కడ మారణహోమం జరుగుతున్నా, రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి అందరికందరూ మౌనం వహించారు. అదుపు చేయడానికి ప్రయత్నించలేదు. అంతా అయిపోయాక దేశ ప్రధాని విభ్రాంతిని వ్యక్తం చేశారు. తన ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చి, ఒక రాజకీయ ప్రకటన చేశారు. దాన్ని మించిన అవివేకపు ప్రకటన మరొకటి ఉండదని దేశ ప్రజలు ఉడికిపోయారు. నిజాయితీగల మనుషులైతే నాయకులంతా రాజీనామాలివ్వాలి. మోడీజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ గాయమైంది. ప్రధానిగా ఉన్నప్పుడు మణిపూర్ మండిపోయింది. ఎన్ని తప్పులు క్షమించినా, దేశ ప్రజలు బిజెపి ప్రభుత్వం చేసిన ఈ రెండు తప్పుల్ని ఎప్పటికీ క్షమించరు. మణిపూర్‌లో మహిళల శరీరాలు రాజకీయ రణాలకు యుద్ధభూములయ్యాయి. అయినా అధికార పార్టీలో ఉన్న మహిళలు ఎవరూ గొంతెత్తలేదు. అన్యాయాన్ని నిరసించలేదు. మానవీయ విలువల్ని తొక్కిపెట్టే రాజకీయాలు ఇంత నీచంగా ఉంటాయా? చివరిగా : తమలో నుంచి మానవత్వం, నిజాయితీగల నాయకుల్ని ఈ దేశ ప్రజల ఎప్పుడు తయారు చేసుకుంటారూ? ఈ చీకటి పాలనను ఎప్పుడు అంతం చేసుకుంటారూ?

/ వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త/



జనవాక్యం

ప్రాజెక్టు టైగర్!

ధరణిపై నివసిస్తున్న వివిధ జంతు జాతుల మనుగడ తోనే మానవాళి భవిష్యత్తు ఆధారపడి ఉంటున్నది. అయితే అడవుల్లో మృగరాజులుగా పేరొందిన సింహాలు, పులులు రోజురోజుకు అంతరించే స్థాయికి చేరుకోవడం విచారకరం. దొంగ చాటుగా ఇతర జంతువులను వేటాడగల పులులు నేడు అడవుల్లో కన్న మానవ గుప్పిట్లోనే అధికంగా ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలుస్తున్నది. నేడు భారత దేశవ్యాప్తంగా 3000 వరకు పులులు ఉన్నట్లు అంచనా. పులుల సంరక్షణకు భారత ప్రభుత్వం 1973 లోనే 'ప్రాజెక్టు టైగర్' రూపంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీని ప్రవేశపెట్టింది. పులుల సంరక్షణలో భాగంగా నేడు భారత దేశవ్యాప్తంగా 54 టైగర్ రిజర్వ్లు ఏర్పాటు అయ్యాయి. జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి అన్ని రకాలైన జీవరాశులను అంతరించకుండా కాపాడుకో వలసిన బాధ్యత మనందరి మీద ఉన్నదని ప్రపంచ దేశాలు గమనించాలి. జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లి నపుడు మానవ మనుగడ, భూమి నివాస యోగ్యతలు కూడా సంక్షోభంలో పడతాయని తెలుసుకోవాలి.

(29న అంతర్జాతీయ పులుల దినం)

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్ : 9949700037



కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎం.హరిబాబు తదితరులు

ఎకరాకు రూ.పది వేలు పరిహారమివ్వాలి

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-కంకిపాడు (కృష్ణా జిల్లా)

భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.10 వేలు చొప్పున నష్ట పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం గొడవర్రు, ప్రొద్దుటూరు, నెప్పల్లి తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. అధిక వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కాల్వలు, డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూటుకాడ తొలగించి ఉంటే పొలాలు ముంపునకు గురయ్యేవికాదని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని గతంలోనే ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు హడావుడిగా అధికారులు వచ్చి కాలువల్లో తూడు తొలగించడం చూస్తే రైతుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉందో అర్ధమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నష్టాన్ని అంచనా వేసి తిరిగి నాట్లు వేసుకోవటానికి ఎకరాకు రూ.10 వేలు చొప్పున నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కౌలు రైతు సంఘం నేతలు వి.మరియుదాసు, వై.జోజి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. కలాం వర్ధంతి సందర్భంగా టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ ఛైర్మన్లు, ఎన్ఎండి ఫరూక్, షరీఫ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో..

అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఆయన చిత్రపటానికి కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగానే కాకుండా, రాష్ట్రపతి స్థాయికి ఎదగగలిగారని అన్నారు. కార్యక్రమంలో నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తో అవినాష్‌రెడ్డి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కడప ఎంపి అవినాష్‌రెడ్డి భేటీ అయ్యారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ భేటీ జరిగింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో భాగంగా కోర్టులో ఇటీవల సిబిఐ సప్లిమెంటరీ చార్జ్‌షీట్ పెట్టిన విషయం తెలిసిందే. ఈ చార్జ్‌షీట్‌లో పలువురు సాక్ష్యులు ఇచ్చిన వాంగ్మూలాలు సిబిఐ పొందుపర్చడంతోపాటు ఎంపి అవినాష్‌రెడ్డి ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి ఈ కేసులో నిందితులు అని పేర్కొంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సిఎం భార్య వైఎస్ భారతి పేర్లను చార్జ్‌షీట్‌లో ప్రస్తావించిన నేపథ్యంలో అవినాష్‌రెడ్డి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

39	13/5.	1.10	1.10	మెరక	మద్దిరాల శేషారావు, సుబ్బారావు, నరసింహారావు తండ్రి రత్తయ్య, ఆశక్తి గల వారు : మద్దిరాల గంగారత్నం భర్త శేషారవు	మద్దిరాల సత్యనారాయణ తండ్రి సుబ్బారావు (0.36) మద్దిరాల సత్యనారాయణ తండ్రి, శేషారవు (0.37) ఆశక్తి గల వారు : మద్దిరాల గంగారత్నం, భర్త శేషారవు మద్దిరాల రమణమ్మ భర్త (లేటు) నరసింహారావు (0.37)	13/4	13/6	13/3	13/3, 4	
40	13/6.	1.00	1.00	మెరక	మద్దిరాల శేషారావు, సుబ్బారావు, నరసింహారావు (లేటు) తండ్రి రత్తయ్య, ఆశక్తి గల వారు : మద్దిరాల గంగారత్నం భర్త శేషారవు	మద్దిరాల సత్యనారాయణ తండ్రి, నాగేశ్వరరావు (0.34) మద్దిరాల గంగారత్నం భర్త శేషారావు (0.33) మద్దిరాల రమణమ్మ భర్త (లేటు) నరసింహారావు (0.33)	13అఇట	13/7	13/3	13/5	
41	13/7	3.20	3.20	మెరక	భూరుగం సోమయ్య తండ్రి ముక్కయ్య, ఆశక్తి గల వారు : భందు సీతారత్నం భర్త సత్యనారాయణ	భందు సీతారత్నం భర్త సత్యనారాయణ	13/1.	14	22	13/4,6, భీమవరం	
42	14/2	2.68	2.68	మెరక	పునుగుపాటి వెంకటేశ్వర్లు తండ్రి కుమారస్వామి	వీరపురాళ్ల సత్యవతి భర్త సత్యనారాయణ, అన్నవరపు రాజేశ్వరి భర్త వెంకటేశ్వర్లు ఆశక్తి గల వారు : పునుగుపాటి వెంకటేశ్వర్లు తండ్రి కుమారస్వామి	14/1.	14/3	22	13	
43	14/3	5.00	5.00	మెరక	పునుగుపాటి సీతారామయ్య తండ్రి స్వామి, ఆశక్తి గల వారు : పునుగుపాటి కుమారస్వామి	పునుగుపాటి కుమారస్వామి తండ్రి సీతారామయ్య, ఆశక్తి గల వారు : పునుగుపాటి వెంక టేశ్వర్లు	14/1.	15	22	14/2	తాటి-6 వేప-7
44	15/2	0.87	0.87	మెరక	జల్లారపు పెద వెంకయ్య తండ్రి, పెద వీరయ్య, జల్లారపు ఆదినారాయణ తండ్రి, పెద వెంకయ్య	జల్లారపు నారాయణమ్మ భర్త పెద వీరయ్య, జల్లారపు ఆదినారాయణ తండ్రి పెదవెంకయ్య	15/1	15/6.	22	14	
45	15/3	0.15	0.15	మెరక	జల్లారపు చిన వెంకయ్య తండ్రి వీరన్న, ఆశక్తి గల వారు : జల్లారపు హుస్సేన్	జల్లారపు తులసమ్మ భర్త హుస్సేన్	15/2.	15/4	22	15/2	
46	15/4	0.13	0.13	మెరక	జల్లారపు వీరయ్య తండ్రి వెంకయ్య, ఆశక్తి గల వారు : జల్లారపు సత్యనారాయణ	జల్లారపు సత్యనారాయణ తండ్రి చిన వీరయ్య	15/6	15/5	22	15/3	
47	15/5	0.20	0.20	మెరక	మొగిలిచర్ల మాణిక్యాంబ భర్త నాగేశ్వరరావు, ఆశక్తి గల వారు : రాయవరపు సత్యవేణి	రాయవరపు వెంకటరామారావు, తండ్రి కుక్కుటేశ్వరరావు ఆశక్తి గల వారు : రాయవరపు సత్యవేణి	15/7	15/13,14	22	15/4	
48	15/6	0.38	0.38	మెరక	జల్లారపు చిన వెంకయ్య తండ్రి వీరన్న, ఆశక్తి గల వారు : జల్లారపు హుస్సేన్	జల్లారపు తులసమ్మ భర్త హుస్సేన్	15/1	15/7	15/4,5	15/2	
49	15/7	0.38	0.38	మెరక	జల్లారపు వీరయ్య తండ్రి వెంకయ్య, ఆశక్తి గల వారు : జల్లారపు సత్యనారాయణ	జల్లారపు సత్యనారాయణ తండ్రి చిన వీరయ్య	15/1	15/8	15/5	15/6	
50	15/8	0.15	0.15	మెరక	భూరుగం గంగమ్మ భర్త నాగయ్య	భూరుగం గంగమ్మ భర్త నాగయ్య	15/1	15/9	15/14	15/7	
51	15/9	0.47	0.47	మెరక	భూరుగం సోమయ్య తండ్రి ముక్కయ్య, ఆశక్తి గల వారు : చెన్నకేశవుల కుసుమ	చెన్నకేశవుల కుసుమ భర్త సూర్యనారాయణ	15/1	15/10	15/14	15/8	వేప - 2
52	15/10	0.67	0.67	మెరక	బెల్లం వెంకాయమ్మ భర్త వీర వెంకయ్య, ఆశక్తి గల వారు : ఎగ్గిన రామారావు	ఎగ్గిన సత్యనారాయణ తండ్రి రామారావు, ఆశక్తి గల వారు : బెల్లం వెంకాయమ్మ భర్త, వీర వెంకటయ్య	15/1	15/11	15/14	15/9	
53	16/2	6.67	6.67	మెరక	మొగిలిచర్ల మాణిక్యాంబ భర్త నాగేశ్వరరావు, ఆశక్తి గల వారు : రాయవరపు సత్యవేణి	రాయవరపు వెంకటరామారావు తండ్రి, కుక్కుటేశ్వరరావు, ఆశక్తి గల వారు : రాయవరపు సత్యవేణి	16/1	21	22	15	తాటి - 12, వేప - 3
54	17/2	4.45	4.45	మెరక	దారపు సావిత్రమ్మ, ఆశక్తి గల వారు: దారపు సత్యనారాయణ రెడ్డి	దారపు సత్యనారాయణ రెడ్డి తండ్రి సూర్యనారాయణ రెడ్డి	17/1	18	17/3	17/1	
55	17/3	2.63	2.63	మెరక	బెల్లం వెంకాయమ్మ భర్త వీర వెంకయ్య, ఆశక్తి గల వారు : ఎగ్గిన రామారావు	ఎగ్గిన సత్యనారాయణ తండ్రి రామారావు, ఆశక్తి గల వారు : బెల్లం వెంకాయమ్మ భర్త, వీర వెంకటయ్య	17/2	18	17/4	17/1	తాటి - 9
56	17/4	1.00	1.00	మెరక	మొగిలిచర్ల మాణిక్యాంబ భర్త నాగేశ్వరరావు, ఆశక్తి గల వారు : రాయవరపు సత్యవేణి	రాయవరపు వెంకటరామారావు, తండ్రి, కుక్కుటేశ్వరరావు ఆశక్తి గల వారు : రాయవరపు సత్యవేణి	17/3	18	16	17/1	
57	18/2.	2.40	2.40	మెరక	ముక్కపాటి సత్యనారాయణ తండ్రి వెంకటేశ్వర్లు, ఆశక్తి గల వారు : ముక్కపాటి లలితాకుమారి తండ్రి సత్యనారాయణ	ముక్కపాటి లలితాకుమారి తండ్రి సత్యనారాయణ	18/4	19	18/3	17	
58	19/2.	2.85	2.85	మెరక	గుదె వెంకటస్వామి తండ్రి ముసలయ్య, ఆశక్తి గల వారు : గుదే ఉమా మహేశ్వరరావు తండ్రి వెంకటస్వామి,గుదే శ్రీనాథ్‌బాబు తండ్రి వెంకటస్వామి	గుదే ఉమా మహేశ్వరరావు తండ్రి వెంకటస్వామి (2.43), గుదే శ్రీనాథ్‌బాబు తండ్రి వెంకటస్వామి (2.42)	19/1	19/3	20	18	
59	19/3.	2.50	2.50	మెరక	తనికొండ రాములు తండ్రి గున్నయ్య, యాలం వెంకటరమణ తండ్రి వెంకయ్య ఆశక్తి గల వారు : తనికొండ వెంకట నర్సయ్య, పునుగుపాటి సావిత్రి	తనికొండ సుగుణ భర్త, సత్యం (1.25), యాలం ముత్యాలమ్మ భర్త (లేటు) వెంకటరమణ (1.25) ఆశక్తి గల వారు : తనికొండ వెంకటనర్సయ్య, పునుగుపాటి సావిత్రి	19/1	19/4	20	19/2	
60	19/4	3.37	3.37	మెరక	పునుగుపాటి సీతారామయ్య తండ్రి స్వామి, ఆశక్తి గల వారు : పునుగుపాటి సావిత్రి భర్త రామారావు	పునుగుపాటి సావిత్రి భర్త రామారావు	19/1	కూనవరం	20	19/3	
61	20/1.	1.23	1.23	మెరక	తనికొండ రాములు తండ్రి గున్నయ్య, యాలం కృష్ణ, తండ్రి వెంకయ్య, ఆశక్తి గల వారు : యాలం వెంకట రమణ, యాలం అనసూయమ్మ భర్త లక్ష్మయ్య	యాలం ముత్యాలమ్మ భర్త (లేటు) వెంకటరమణ (0.61), యాలం అనసూయమ్మ భర్త లక్ష్మయ్య (0.62)	19	20/2	21	18	వేప - 1
62	20/2	0.65	0.65	మెరక	యలమల మల్లయ్య తండ్రి లక్ష్మయ్య	యాలమాల వెంకట సత్యనారాయణ తండ్రి మల్లయ్య	19	20/3	21	20/1	
63	20/3	0.53	0.53	మెరక	యలమల వెంకటేశ్వర్లు తండ్రి లక్ష్మయ్య	యలమల కుసుమమ్మ భర్త వెంకటేశ్వర్లు	19	20/4	21	20/2	
64	20/4	1.12	1.12	మెరక	బేతిన సత్యనారాయణ, హరినాధ్ తండ్రి వెంకయ్య	సోడె బుల్లెమ్మ భర్త జోగయ్య ఆశక్తి గల వారు : బేతిన సత్యనారాయణ, హరినాధ్, తండ్రి వెంకయ్య	19	20/5	21	20/3	తాటి - 2, వేప - 4, తురాయి - 1
65	20/5.	1.38	1.38	మెరక	సూరం చక్రపాణి తండ్రి సాయన్న, సూరం శ్రీనివాసరావు తండ్రి సాయన్న, సూరం సత్యనారాయణ తండ్రి సాయన్న	సూరం చుక్కమ్మ భర్త లేటు చకపాణి (0.46), సూరం శ్రీనివాసరావు తండ్రి సాయన్న (0.46), సూరం ఈశ్వరమ్మ భర్త, సత్యనారాయణ (0.46)	19	20/6,7	21	20/4	వేప - 5
66	20/7	0.43	0.43	మెరక	మొగిలిచర్ల మాణిక్యాంబ భర్త నాగేశ్వరరావు, ఆశక్తి గల వారు : రాయవరపు సత్యవేణి	రాయవరపు వెంకటరామారావు తండ్రి, కుక్కుటేశ్వర రావు, ఆశక్తి గల వారు : రాయవరపు సత్యవేణి	20/6	కూనవరం	21	20/5	వేప - 2
67	21/3	3.18	3.18	మెరక	దికొండ వెంకట సత్యనారాయణ తండ్రి యతిరాజన్, ఆశక్తి గల వారు : దికొండ లక్ష్మి ప్రసాద్ గంగాధర్.	దికొండ యతిరాజారావు తండ్రి వెంకట సత్యనారాయణ, డియలెపి. గంగాధరరావు తండ్రి వెంకట సత్యనారాయణ, ఆశక్తి గల వారు : దికొండ వెంకట సత్యనారాయణ తండ్రి యతిరాజన్	21/1	కూనవరం	21/4,5, 6,9	21/2	తాటి - 4, వేప - 10
		144.85	144.85								

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి.ఆర్.పురం యూనిట్, చింతూరు నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులయిన వారు ఎవ్వరును లేరు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

సం/- **ఎస్.సరళ వందనం,** స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఎల్‌ఐసి నుంచి కొత్త జీవన్ కిరణ్ ప్లాన్

- కనీసం రూ.15 లక్షల బీమా హామీ
- ప్రీమియం సొమ్ము మొత్తం వాపస్
- సింగిల్ ప్రీమియంను ఎంచుకోవచ్చు



హైదరాబాద్ : ప్రభుత్వ రంగ దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) కొత్తగా జీవన్ కిరణ్ పేరుతో టర్మ్ పాలసీని ఆవిష్కరించింది. ఇది నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ వ్యక్తిగత పొదుపు, జీవిత బీమా పాలసీ అని ఆ సంస్థ వెల్లడించింది. మెచ్యూరిటీ కాలం పూర్తయిన తర్వాత మొత్తం ప్రీమియం వెనక్కు ఇవ్వనున్నట్లు తెలిపింది. జీవన్ కిరణ్ (ప్లాన్ 870) ఇతర వివరాలు.. 18-65 ఏళ్ల లోపు వారు ఈ ప్లాన్ తీసుకోవడానికి అర్హులు. పాలసీ కాలంలో ఏం జరిగిన పాలసీదారు కుటుంబసభ్యులకు బీమా మొత్తాన్ని చెల్లిస్తుంది. సాధారణ టర్మ్ పాలసీల్లో ప్రీమియం మొత్తం వెనక్కు చెల్లించడం ఉండదు.. కానీ ఈ ప్లాన్ కింద పాలసీ కాలంలో బీమా హామీతో పాటు మెచ్యూరిటీ సమయంలో ప్రీమియం సొమ్ము వాపస్ చేస్తుంది. కనీస పాలసీ మెచ్యూరిటీ గడువు 28 ఏళ్లు కాగా, గరిష్ఠంగా 80 ఏళ్ల టెన్యూర్ ఉంటుంది. 10 ఏళ్ల నుంచి 40 ఏళ్ల టర్మ్‌తో ఈ ప్లాన్ లభిస్తుంది. కనీసం రూ.15 లక్షల బీమా హామీతో ఈ పాలసీ కొనవచ్చు. గరిష్ఠంగా ఎంత మొత్తం పాలసీ అయినా తీసుకోవచ్చు. కనీస ప్రీమియం రూ.3000 చెల్లించాల్సి ఉంటుంది. సింగిల్ ప్రీమియం రూ.30 వేలుగా నిర్ణయించింది. ఏడాదికోసారి గానీ, రెండు సార్లు గానీ ప్రీమియం మొత్తం చెల్లించవచ్చు. ఈ ప్లాన్‌లో పాలసీదారుడు జీవించి ఉంటే మెచ్యూరిటీ అనంతరం ప్రీమియం మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. అధిక ప్రీమియంలు, రైడర్లకు చెల్లించిన మొత్తాలు, పన్నులను ఇందులోంచి మినహాయిస్తారు. మెచ్యూరిటీ తేదీ తర్వాత బీమా కవరేజీ రద్దవుతుంది. ఒకవేళ పాలసీ టర్మ్ ప్రారంభమయ్యాక కవరేజీ సమయంలో పాలసీదారుడు మరణిస్తే.. హామీ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు చెల్లిస్తారు. ఇది ఒకేసారి గానీ, ఐదేళ్ల పాటు లేదా ఆరు నెలలకోసారి, మూడు నెలలకోసారి, నెలకోసారి గానీ విడతల వారీగా గానీ చెల్లిస్తుంది. ఈ విషయమై పాలసీదారు ప్రత్యేకంగా ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. రెగ్యులర్ ప్రీమియంపై ఏడు రెట్ల బెనిఫిట్ లభిస్తుంది. సింగిల్ ప్రీమియంపై 125 శాతం బెనిఫిట్ అందుతుంది. ఆత్మహత్య మినహా ప్రమాదవశాత్తు మరణంతోపాటు అన్ని రకాల మరణాలకూ ఈ ప్లాన్ కవరేజీ లభిస్తుంది. ఈ పాలసీని దగ్గరలోని ఏజెంట్‌ను లేదా ఎల్‌ఐసి వెబ్‌సైట్‌లోనూ కొనుగోలు చేయడానికి అవకాశం ఉంది.

అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు

వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోమారు కీలక వడ్డీ రేట్లను పెంచింది. వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచి గత 22 ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా 5.50 శాతానికి చేర్చుతూ.. జులై 26న నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణంపై పోరాటం సాగుతుందని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్‌పర్సన్ జెరోమ్ పావెల్ తెలిపారు.

వరుసగా వడ్డీ రేట్ల పెంచుతూ.. రెండు దశాబ్దాల గరిష్టానికి చేర్చడంతో అమెరికాలో ఆర్థిక సంక్షోభం ముదురుతుందనడానికి సంకేతాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పడిపోయిన కోరమండల్ లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఎరువుల ఉత్పత్తుల కంపెనీ కోరమండల్ ఇంటర్నేషనల్ లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో నికర లాభాలు ఒక్క శాతం తగ్గి రూ.494 కోట్లుగా చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 0.6 శాతం తగ్గి రూ.5,693 కోట్లుగా నమోదయ్యింది. కోరమండల్ ఇంటర్నేషనల్ దేశంలోనే అతిపెద్ద ఫాస్ఫేట్ ఫెర్టిలైజర్ కంపెనీగా ఉంది.

లారస్ ల్యాబ్స్‌కు రూ.28 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో లారస్ ల్యాబ్స్ లాభాలు 88.8 శాతం పతనమై రూ.28.40 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.252.5 కోట్ల లాభాలు నమోదయ్యాయి. ఇదే సమయంలో రూ.1,539 కోట్ల రెవెన్యూ ఆర్జించగా.. గడిచిన క్యూ1లో 23.2 శాతం తగ్గి రూ.1,181.8 కోట్లుగా చోటు చేసుకుంది.



సింగపూర్ ఎయిర్‌లైన్స్ సేవల విస్తరణ

- బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్ సర్వీసుల్లో సర్దుబాటు

బెంగళూరు : విమానయాన రంగంలో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని తమ పలు సేవల్లో సర్దుబాట్లు చేస్తున్నట్లు సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఎ) గ్రూప్ వెల్లడించింది. ఎస్ఐఎ, స్కూట్ తమ సామర్థ్యం, నెట్‌వర్క్ మార్పుల్లో భాగంగా బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్ సేవలను పునర్నిర్మిస్తున్నట్లు పేర్కొంది. పౌర విమానయాన నియంత్రణ సంస్థ ఆమోదాలకు లోబడి మార్పులు చేసినట్లు తెలిపింది. 2023 నవంబర్ 5 నుండి సింగపూర్ - చెన్నయ్ మధ్య రోజువారీ సేవలను స్కూట్ ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. ఫలితంగా సింగపూర్, చెన్నయ్ మధ్య ఎస్ఐఎ గ్రూప్ కార్యకలాపాలు వారానికి 17 సార్ల నుండి వారానికి 21 సార్ల వరకు పెరుగుతాయని తెలిపింది. 2023 అక్టోబర్ 29 నుండి సింగపూర్, హైదరాబాద్ మధ్య స్కూట్ రోజువారీ సేవలను అందుబాటులోకి తేనుందని.. రెండు నగరాల మధ్య రాకపోకలను వారానికి ఏడు సార్ల నుండి 12 సార్లకు క్రమంగా పెంచనుందని వెల్లడించింది.

Saving Lives 55 years WOCKHARDT | LIFE WINS

కార్యకలాపాల బలోపేతంపై వోకార్డ్ దృష్టి

హైదరాబాద్ : అంతర్జాతీయ ఔషధ, బయోటెక్నాలజీ కంపెనీ అయిన వోకార్డ్ లిమిటెడ్ తన వ్యాపార కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఇందుకోసం కీలక వ్యూహాత్మక చొరవలను తీసుకోనున్నట్లు పేర్కొంది.

అమెరికా వ్యాపార పునర్నిర్మాణం, బ్రిటన్‌లో వ్యాక్సిన్ తయారీ కోసం సీరంతో వ్యాక్సిన్ ఒప్పందం, వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు నోవెల్ యాంటీబయాటిక్స్ రీసెర్చ్ వంటి అంశాలపై కంపెనీ దష్టి సారించినట్లు వెల్లడించింది. 2023 నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయంలో 7 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు పేర్కొంది. తన అమెరికా కార్యకలాపాల పునర్నిర్మాణంలో, కంపెనీ మోర్టన్ గ్రోవ్‌లోని తన ఉత్పత్తి కేంద్రాన్ని మూసేసి, సైట్‌ను కాంట్రాక్ట్ తయారీ సంస్థలకు బదిలీ చేయడం ద్వారా ఏడాదికి 12 మిలియన్ డాలర్లు ఆదా చేయాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది.

గాల్లో దీపంలా మహిళలు, చిన్నారుల జీవితాలు

- తెలుగు మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ పాలనలో ఆడబిడ్డలు, చిన్నారుల జీవితాలు గాల్లో దీపంగా మారాయని తెలుగు మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో మహిళల, బాలికల అపహరణ పెరిగిందని ఎన్‌సిఆర్‌బి నివేదిక కేంద్ర హోంశాఖ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రోజుకు సగటున 24 మంది మహిళలు, 9 మంది బాలికలు అదృశ్యం అవుతున్నారన్న చేదునిజం మహిళా లోకాన్ని ఉలిక్కిపడేలా చేసిందన్నారు.

ఈ వివరాలపై ముఖ్యమంత్రి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 2019 నుంచి 2021 వరకు రాష్ట్రంలో బాలికల అపహరణ పెరుగుదల 53 శాతం, మహిళలపై నేరాల పెరుగుదల 43.45 శాతం పెరిగిందన్నారు. నాలుగేళ్లలో 1,22,000 మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగాయని, ఇది జగన్ సాధించిన ఘనత అని విమర్శించారు. మహిళలు, చిన్నారుల రక్షణ విషయంలో మహిళా కమిషన్ విభాగం ఛైర్‌పర్సన్ వ్యవహారశైలి అత్యంత హేయాతిహేయమని తెలిపారు. వినుకొండ ఘటనలో టిడిపి నాయకులను చంపడం కోసం ఎమ్మెల్యే కుట్ర పన్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు.

బాలికపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - ఆకివీడు (పశ్చిమగోదావరి)

బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం స్థానిక బైపాస్ రోడ్‌లో నివాసం ఉంటున్న దంపతులు మనస్పర్థలతో విడిపోయారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాలిక తన మేనత్త ఇంటి వద్ద ఉంటోంది. ఇటీవల చిన్నారిని తన తండ్రి తిరిగి ఇంటికి తీసుకెళ్లి స్థానిక జడ్‌పి బాలికల హైస్కూల్లో చేర్పించాడు. పాఠశాలకు వెళ్తున్న క్రమంలో బాలికకు మాయమాటలు చెప్పి రామకృష్ణ (23) లోబర్చుకున్నాడు. సుమారు మూడు నెలలుగా ఆమెపై అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఇటీవల బాలిక ఇంటికెళ్లి బలవంతం చేయబోవడంతో ఆమె కేకలు వేసింది. ఈ విషయం ఐద్వా నేతలకు తెలియడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

6 నుంచే నైపుణ్యతతో కూడిన విద్య

- కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ విద్యా విధానం ద్వారా ఆరో తరగతి నుంచే విద్యార్థులకు నైపుణ్యతతో కూడిన విద్యను అందిస్తామని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.ఎస్.శాస్త్రి అన్నారు. మాతృభాషలోనే ఐదో తరగతి వరకు తప్పనిసరిగా విద్యాబోధన జరిగేలా జాతీయ విద్యావిధానంలో మార్పులు చేశారని తెలిపారు. ఎన్ఇపి అమలుచేసి మూడేళ్ల పూర్తయిన సందర్భంగా నగరంలో సిబిఎస్ఇ విద్యావిధానం అమలు చేస్తున్న పాఠశాలల ప్రిన్సిపాల్‌లతో కలసి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోరుకొండ సైనిక స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ అధ్యాపకులు, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు మెరుగుపరచడం అత్యంత కీలకమైన అంశమని చెప్పారు. ఈ దిశగా దృష్టి సారించాలన్నారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలను దృష్టిలో వుంచుకొని కాకుండా ఆయా అంశాలపై పరిజ్ఞానం పెంపొందించా లన్నారు. ఈ సందర్భంగా బాలవాటిక-3 తరగతి గదిని, విద్యార్థులు రూపొందించిన వివిధ బోధన పరికరాల ప్రదర్శనను, బాలవాటిక-3 తరగతిని కోరుకొండ సైనిక స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్ఎన్ శాస్త్రి ప్రారంభించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పోర్టు సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రోజానాఖాన్, వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.లక్ష్మణమూర్తి, జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్జ్వల్, డిఐపిఆర్ఒ డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో సంగీత ప్రదర్శనలో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థినులకు కోరుకొండ సైనికస్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ శాస్త్రి చేతుల మీదుగా ట్రోఫీ బహూకరించారు.

వికలాంగులపై వివక్ష

- వారి జనాభా సమాచారాన్ని 'నీతి ఆయోగ్'లో చేర్చాలి
- వారిలో బహుమితీయ పేదరికం అధికం
- పలు అంశాల్లో వెనకబడి ఉన్న వైనం
- నిపుణులు, విశ్లేషకుల సూచన

న్యూఢిల్లీ : భారత్‌లోని వికలాంగులపై వివక్ష కొనసాగుతున్నదని, వారు ఇతర పేదవారి కంటే అధికంగా అనేక రంగాల్లో వెనకబడి ఉన్నారని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. భారతదేశ పేదరికాన్ని 24.9 శాతం నుంచి 15 శాతానికి తగ్గించినట్టు నీతి ఆయోగ్ ఇటీవల తన నివేదికలో పేర్కొన్నది. ఇది ద్రవ్యపరమైన అంశాలకు అతీతంగా పేదరికాన్ని అర్థం చేసుకునేందుకు సామూహిక దశను సూచిస్తుందని నిపుణులు తెలిపారు. అయితే, వికలాంగుల విషయంలో పైనా వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీతి ఆయోగ్ నివేదికలో వికలాంగుల జనాభాకు సంబంధించిన సమాచారాన్ని చేర్చలేదని సూచిస్తున్నారు. వైకల్యం లేనివారితో పోలిస్తే వికలాంగ సభ్యులు ఉన్న కుటుంబాలు బహుమితీయ పేదరికాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నాయని అనేక అధ్యయనాల సమాచారాన్ని, నివేదికలను వారు గుర్తు చేస్తున్నారు. వైకల్యాన్ని నిర్వచించడమంటే పేదరికాన్ని నిర్వచించినంత సవాలుగా ఉంటుందని, వికలాంగులు పేదరికానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని విశ్లేషకులు, నిపుణులు నమ్ముతున్నారు. అయితే, పేదరికాన్ని కొలిచే విధానం తరచుగా వారి ప్రత్యేక సవాళ్లు, అవసరాలను విస్మరిస్తుందని, పేదరిక సూచీలో వీరి అంశాలు కనబడకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారతదేశ జాతీయ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు అనే మూడు సమానమైన పరిమాణాలను కలిగి ఉంటుంది. వీటిని మొత్తం 12 సూచికలు సూచిస్తాయి. భారతదేశంలో పేదరికాన్ని చర్చించడానికి బహుమితీయ సూచికను ఉపయోగించడం ఒక విధానం. అయితే, నివేదిక పరిమిత ఆరోగ్య సూచికలు, పోషకాహారం, పిల్లలు, కౌమార మరణాలు, ప్రసూతి ఆరోగ్యం వంటివి పేదరికంపై వైకల్యం ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకపోవటం ఆందోళనకరమని నిపుణులు అంటున్నారు.

వికలాంగ వ్యక్తి కుటుంబం వారి జీవితకాలంలో పునరావృతమయ్యే వైద్య వ్యయాన్ని ఎదుర్కొంటుంది. మొత్తం 12 సూచికలను వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తుంది. అయినప్పటికీ, వైకల్యం అనే పదం మొత్తం నివేదికలో ప్రసూతి ఆరోగ్యం, పుట్టుకతో వచ్చే వైకల్యాలకు సంబంధించిన నివారణ సందర్భంలో మాత్రమే ఉపయోగించబడింది. వైకల్యం, ఆరోగ్య ఖర్చుల దీర్ఘకాలిక, పునరావృత ప్రభావం, ఇతర అంశాలను విస్మరించిన అనేది ఎంపీఐలోని అన్ని ఇతర సూచికల ప్రభావిత



చేస్తుందని నిపుణులు తెలిపారు.

ఉదాహరణకు, విద్యా కోణంలో చూస్తే.. వైకల్యం ఉన్న వ్యక్తికి అందుబాటులో ఉన్న పాఠశాలలు లేకపోవడంతో పాఠశాల హాజరు తక్కువగా ఉండవచ్చు లేదా పాఠశాల హాజరు ఉండకపోవచ్చు. ఇది 'పాఠశాల హాజరు' సూచికను ప్రభావితం చేస్తుంది. మరోవైపు, ఆటిజంతో బాధపడుతున్న పిల్లవాడు ప్రతిరోజూ పాఠశాలకు హాజరు కావచ్చు కానీ 'పాఠశాల సంవత్సరాల' సూచికలో 'కోల్పోయిన' అని వర్గీకరించబడదు. కానీ పిల్లవాడు అవసరమైన స్థాయి విద్యను విజయవంతంగా సాధించాడని దీని అర్థం కాదు అని నిపుణులు విశ్లేషకులు తెలిపారు. "పేదరికంపై వైకల్యం ప్రభావం అటువంటి సందర్భాల్లో కనిపించదు. స్థిరమైన జీవనోపాధి సూచిక చేర్చడం వికలాంగ సంఘం ఎదుర్కొంటున్న సవాళ్లను హైలెట్ చేస్తుంది" అని నిపుణులు చెప్పారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేమి

- శిక్షార్హమైన చర్యగా పరిగణించాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రోడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ పూర్తిగా ఆమోదయోగ్యం కాదని కేంద్ర గ్రామీణాభివృద్ధి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది. ఈ పథకం కింద నిర్మించిన అనేక రోడ్ల నాణ్యత తక్కువగా ఉందని ధ్రువీకరించింది. పథకం కింద ఉన్న రోడ్ల మందాన్ని ఇప్పటికే ఉన్న 20 ఎంఎం నుండి 30 ఎంఎం వరకు పెంచాలని సూచించింది. గురువారం లోక్‌సభలో సమర్పించిన నివేదికలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ సంబంధిత స్టాండింగ్ కమిటీ కూడా పథకాన్ని సక్రమంగా అమలు చేయడానికి మెరుగైన కేంద్ర, రాష్ట్ర సహకారం అవసరమని నొక్కి చెప్పింది. డిఎంకె ఎంపి కనిమొళి అధ్యక్షన కమిటీ 'రహదారి నిర్మాణ నాణ్యత మొత్తం దేశాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన సమస్య' అని పేర్కొంది. రోడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ పూర్తిగా ఆమోదయోగ్యం కాదని, శిక్షార్హమైన చర్యగా పరిగణించాలని కూడా తెలిపింది.

పిఎంజిఎస్‌వై కింద నిర్మించిన రోడ్ల నాణ్యత నాసిరకం ముడిసరుకుల వినియోగం, ఇతర సంబంధిత కారణాల వల్ల రాజీ పడకుండా ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖను కోరింది. తప్పు చేసిన కాంట్రాక్టర్లను షార్ట్-లిస్ట్ చేసి, వారిని బ్లాక్ లిస్ట్ చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ పేర్కొంది. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పథకం అమలు నెమ్మదిగా ఉందని, ఈ ఏడాది జనవరి చివరి నాటికి ఈ ప్రాంతాల్లో కేవలం 55.61 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది.

కేంద్ర ప్రభుత్వంలో 9,64,354 పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్లలో 9,64,354 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022 మార్చి 31 నాటికి మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్లో గ్రేడ్ ఎ పోస్టులు 30,606, గ్రేడ్ బి పోస్టులు 1,11,814, గ్రేడ్ సి పోస్టులు 8,21,934 ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టులు ఖాళీ

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 జూలై 20 నాటికి దేశంలోని కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సెంట్రల్ యూనివర్శిటీల్లో 21,215 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీ

సెంట్రల్ యూనివర్శిటీల్లో 21,215 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 ఏప్రిల్ 1 నాటికి సెంట్రల్ యూనివర్శిటీల్లో 5,825 టీచింగ్, 15,390 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

మేఘాలయ సీఎం కార్యాలయంపై దాడి కేసు
20 మంది అరెస్టు

- వీరిలో ఇద్దరు బిజెపి మహిళా మోర్చా కార్యకర్తలు

షిల్లాంగ్ : పశ్చిమ గారో హిల్స్ జిల్లాలోని తురా పట్టణంలో మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా కార్యాలయంపై సోమవారం రాత్రి జరిగిన దాడిలో ప్రమేయం ఉన్న 20 మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు ఉన్నారు. వారిని బెర్నీ ఎం మరక్, డిల్సీ చ్ మరక్ లుగా గుర్తించారు. ఈ విషయాన్ని అక్కడి పోలీసు అధికారులు తెలిపారు. తురాలోని మినీ సెక్రటేరియట్‌పై ఒక గుంపు రాళ్లు రువ్వి పోలీసు వాహనానికి నిప్పంటించింది. రెండు ఫైర్ టెండర్లను ధ్వంసం చేసింది. ఆ తర్వాత జరిగిన దాడిలో ఐదుగురు పోలీసు అధికారులు గాయపడ్డారు. దాడి జరిగిన సమయంలో తురాను రాష్ట్ర శీతాకాల రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరాహారదీక్ష చేస్తున్న గారో కమ్యూనిటీకి చెందిన పౌర సమాజ సంఘాలతో సంగ్మా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం, రాష్ట్ర రాజధాని షిల్లాంగ్ తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో ఉంది. కాగా, ఆందోళనకారుల దాడిలో కనీసం 21 వాహనాలు ధ్వంసమయ్యాయని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గుంపును ప్రేరేపించిన ఇద్దరు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతల కోసం కూడా పోలీసులు వెతుకుతున్నారని సదరు అధికారి చెప్పారు. గాయపడిన పోలీసులకు సీఎం రూ.50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.

గిరిజన విద్యార్థులను విస్మరించిన ప్రభుత్వాలు

- రెండో రోజుకు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, గిరిజన సంఘం బైక్‌యాత్ర

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా)

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ విమర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, గిరిజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొయ్యలగూడెం మండలంలో బుధవారం ప్రారంభమైన బైక్ యాత్ర రెండోరోజు గురువారం మండలంలోని బూసరాజుపల్లి ఏపి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల నుండి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని, గిరిజన హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. పులిరామడుగూడెం హాస్టల్లో ఒక విద్యార్థి హత్య జరిగిన తరువాత గానీ ఆ హాస్టలకు కనీస మౌలిక వసతులు కల్పించారన్నారు. అదేవిధంగా అన్ని గిరిజన సంక్షేమ హాస్టళ్లలో ఈ విధమైన వసతులు, సిసి కెమెరాలను అధికారులు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడ గదులు లేవని, డైనింగ్ హాళ్లు కూడా లేకపోవడం, ఉన్న డైనింగ్ హాళ్లు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గిరిజన హాస్టళ్లలో నిత్యావసర సరుకులు కాంట్రాక్ట్ పద్ధతిలో అందిస్తున్నారని, కాంట్రాక్టర్లు టెండర్ వేయడానికి వచ్చినప్పుడు ఒక క్వాలిటీ ఒకటేట విద్యార్థులకు సరఫరా చేసే సమయంలో నాసిరకం కనిపిస్తున్నాయన్నారు. ఈ విధంగా విద్యార్థులకు నాశిరకమైన సరుకులు సరఫరా చేస్తున్నారన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిఒ3ను రద్దు చేయడంతో, దీనివల్ల స్థానిక గిరిజన యువకులకు ఉద్యోగాలు లేకుండా పోయాయని విమర్శించారు. గిరిజనేతులకు ఉద్యోగాలు ఎక్కువ కల్పిస్తున్నారని, జిఒ3ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గురుకుల పాఠశాలలో స్పెషల్ డిఎస్‌సి తీసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన విద్యాలయంవైపు రాష్ట్ర ప్రభుత్వం కన్నెత్తి కూడా చూడటం లేదని, గిరిజన సంక్షేమ ఖాతాలోని నిధులను నాడు-నేడు పథకానికి మళ్లించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు జి.మణి, రాజేష్, దుర్గారావు పాల్గొన్నారు.

'ప్లాట్‌ఫారం' కార్మికులకు సంక్షేమ పథకాలు

కార్మిక శాఖకు పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ : 'ప్లాట్‌ఫారాల'పై ఉపాధి పొందుతున్న కార్మికులు, యాప్‌ల ఆధారంగా పనిచేస్తున్న ఉద్యోగుల కోసం సంక్షేమ పథకాలను రూపొందించి, తక్షణమే అమలు చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖకు సూచించింది. దేశంలో పనిచేస్తున్న కార్మికులలో 90% మంది అసంఘటిత రంగంలోని వారేనని గుర్తు చేస్తూ వారికి పెన్షన్, ఆరోగ్య బీమా, సిక్ లీవులు వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలేవీ ఉండవని తెలిపింది. 2022లో నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో 2020-21లో 77 లక్షల మంది 'ప్లాట్‌ఫారం' కార్మికులు ఉన్నారని, 2029-30 నాటికి ఈ సంఖ్య 2.35 కోట్లకు చేరవచ్చునని వివరించింది. యాప్ ఆధారిత ఉద్యోగులు, ప్లాట్‌ఫారం కార్మికులు ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్, ఇతర నిబంధనల చట్టం పరిధిలోకి రారని కమిటీ తన నివేదికనలో తెలియజేసింది. అందువల్ల వీరి కోసం ప్రత్యేకించి సంక్షేమ పథకాన్ని రూపొందించాలని సిఫార్సు చేసింది.

'ప్లాట్‌ఫారం కార్మికులను సామాజిక భద్రతా పథకాల పరిధిలోకి తేవాలని నిబంధనలు చెబుతున్నప్పటికీ చట్టప్రకారం వాటిని నోటిపై చేయకపోవడంతో నేటి వరకూ అమలు సాధ్యం కాలేదు. కార్మిక నిబంధనల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది' అని మార్చిలో సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభిప్రాయపడింది. కాగా ఈ నెల 21న సమర్పించిన తాజా నివేదికలో...పథకాన్ని రూపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్మిక శాఖ నుండి ఎలాంటి స్పందన లేదని తెలిపింది. తీసుకున్న చర్యలు, ఆ దిశగా జరిగిన పురోగతిని గురించి తెలుసుకోవాలని కమిటీ భావిస్తోందని నివేదిక తెలియజేసింది.

స్టాండింగ్ కమిటీ భేటీ నుంచి వాకౌట్

- సమాచార రక్షణ బిల్లుపై ప్రతిపక్షాల అభ్యంతరం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వ్యక్తిగత డేటా రక్షణ బిల్లుకు మద్దతుగా నివేదికను ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ ఏడుగురు ప్రతిపక్ష ఎంపిలు గురువారం జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం నుండి వాకౌట్ చేశారు. బిల్లుపై నివేదికను ఆమోదించడానికి ముందు ఆ బిల్లు కాపీని చూడాలని వారు డిమాండ్ చేశారు. సమావేశం నుండి వాకౌట్ చేసిన వారిలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, టిఎంసి ఎంపిలు మహువా మొయిత్రా, జవహర్ సిర్కార్, డిఎంకె ఎంపి టి సుమతి, కాంగ్రెస్ ఎంపి కార్తీ చిదంబరం, టిడిపి ఎంపి జయదేవ్ గల్లా ఉన్నారు. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన నివేదికను ప్యానెల్‌లోని బిజెపి ఎంపిలు బిల్లును సరిగ్గా పరిశీలించకుండానే ఆమోదించారని ప్రతిపక్ష ఎంపిలు విమర్శించారు. సమావేశానికి ముందురోజు ముసాయిదా నివేదికను అందజేశారని, బిల్లును అధ్యయనం చేయడానికి చాలా తక్కువ సమయం ఇచ్చారని తెలిపారు. జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ప్రతిపక్షాల ఆందోళన రాజకీయపరమైనది కాదని అన్నారు. "మేము చేసిన వాదనల మెరిట్‌ల జోలికి వెళ్లకుండా అధికార పార్టీ సభ్యులు ఓటింగ్ కోసం ఎందుకు పట్టుబడుతున్నారో అర్థం కావటం లేదు" అని బ్రిట్టాస్ అన్నారు. ఆయన నివేదికలో భాగమని చెప్పబడిన అసమ్మతి నోట్‌ను కూడా సమర్పించారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుకు ఇటీవలే క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో దీనిని ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

గీతం 'బిజినెస్' కోర్సుల్లో ప్రవేశాలు

- 28లోగా అడ్మిషన్ టెస్ట్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి- మధురవాడ

గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబిఎ, బిబిఎ, బికాం కోర్సులలో ప్రవేశాలకు విశాఖ ప్రాంగణంలో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర తెలిపారు. ఎంబిఎలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్ సప్లైచైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రీసోర్సెస్, బిజినెస్ ఎనలటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్ స్పెషలైజేషన్లను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు. డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. దీంతోపాటు బిబిఎ, బికామ్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా గీతం అడ్మిషన్ టెస్ట్-2023 కు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అంద జేస్తామన్నారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వైద్య సాంకేతికతలో రోబోటిక్స్ గొప్ప ముందడుగు

- గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్
- మణిపాల్‌లో రోబోటిక్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య, ఆరోగ్య సంరక్షణ సేవల్లో రోబోటిక్ సాంకేతికతను వినియోగించడం సమాజ పురోగతిలో గొప్ప ముందడుగు అని రాష్ట్ర గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉన్న మణిపాల్ ఆస్పత్రిలో గురువారం నాడు 'రోబోటిక్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్' ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శస్త్రచికిత్స విధానంలో రోబోటిక్స్ వినియోగం విప్లవాత్మకమైన మార్పు తీసుకొస్తుందని గవర్నర్ తెలిపారు. రోగులకు మరింత సానుకుల ఫలితాల్ని, భరోసాను ఇవ్వడం ద్వారా దేశ పురోభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మణిపాల్ ఆస్పత్రి డైరెక్టరు డాక్టర్ హెచ్ సుదర్శన్ బల్లాల్, రోబోటిక్ నిపుణులు సురేంద్ర జాస్తి, వి ధర్మేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల్ని ఇడి జప్తుపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం

ప్రజాశక్తి-అమరావతి

జప్తు చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులపై రాష్ట్ర సర్కారుకే తొలి హక్కులు ఉంటాయని, రాష్ట్రం జప్తు చేసిన ఆస్తులను మనీలాండరింగ్ యాక్ట్ కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కూడా జప్తు చేయడాన్ని రాష్ట్రం తీవ్ర అభ్యంతరం చెప్పింది. డిపాజిటర్ల హక్కుల పరిరక్షణకు రాష్ట్రం పాటుపడుతోందని చెప్పింది. ప్రభుత్వం జప్తు చేసిన ఆస్తులను ఇడి జప్తు చేయడాన్ని ప్రభుత్వం తరపున ఎజి ఎస్ శ్రీరామ్ తప్పుపట్టారు. రూ.20 వేలు, అంతకన్నా తక్కువ డిపాజిట్లు చేసిన డిపాజిటర్లకు ఇప్పటికే రూ.900 కోట్ల మేర డిపాజిట్లను తిరిగి చెల్లించామన్నారు. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద వారిని పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇడి గానీ, బ్యాంకులు గానీ నీరుగార్చలేవన్నారు.

అగ్రిగోల్డ్ యాజమాన్యం నుంచి కొనుగోలు చేసిన తమ ఆస్తులను జప్తు చేస్తూ ఇడి జారీ చేసిన తాత్కాలిక జప్తు ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆల్ ఇండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది. బ్యాంక్ వేలం ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను ఇడి జప్తు చేయడాన్ని తప్పుపడుతూ పలు కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. వీటిపై జస్టిస్ చీమలపాటి రవి ఇటీవల విచారణ జరిపారు. ఎజి వాదనల తర్వాత విచారణ ఈ నెల 31కి వాయిదా పడింది.

ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్టేటస్ కో

ప్రజాశక్తి-అమరావతి

అటవీ ప్రాంత పరిధిలోని 40 ఎకరాల్లో నవరత్నాలు పథకం కింద పేదలకు ఇళ్ల నిర్మాణం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు యథాతథ పరిస్థితి ఉత్తర్వుల జారీ చేసింది. నెల్లూరు జిల్లా, దగదర్తి తహశీల్దారు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేసిన కేసులో యథాతథ స్థితి (స్టేటస్ కో) ఆదేశాలిచ్చింది. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, నెల్లూరు జిల్లా కలెక్టరు, కావలి ఆర్‌డివి, దగదర్తి మండల తహశీల్దార్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్‌లకు నోటీసులిచ్చింది. విచారణను ఆగస్టు రెండుకు వాయిదా వేస్తూ తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దగదర్తి, కొత్తపల్లి కౌరుగుంట గ్రామాల పరిధిలో ఉన్న 40 ఎకరాల అటవీ భూమిలో పేదలకు ఇళ్లు నిర్మించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దగదర్తి గ్రామానికి చెందిన ఎం రవీంద్రబాబు వేసిన పిల్‌పై విచారణ వాయిదా పడింది.

కొటియా గ్రామాల్లో ఇంటింటికీ రేషన్

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. గురువారం కొటియా పంచాయతీ పరిధిలో ఉన్న ఎగువ శెంబిలో ప్రత్యేక వాహనం ద్వారా రేషన్ సరుకులను ఇంటింటికీ తిరిగి అందజేశారు. కొటియా గ్రామాల ప్రజలను మచ్చిక చేసుకోవడానికి ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాల్లో ఇది కీలకమైనది. ఆంధ్రాలో ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకుల పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ అది మైదాన ప్రాంతవాసులకే పరిమితమైంది. గిరిశిఖర గ్రామాల్లో ఎపి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేయలేకపోతోంది. ముందుగా ఆంధ్రాలోనే ఇంటింటికీ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే గిరిజన ప్రాంతాల్లో మాత్రం ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. ఇప్పటికీ కొంత దూరం నడిచి వెళ్లి రేషన్ సరుకులను గిరిజన లబ్ధిదారులు తీసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. కానీ ఒడిశా అధికారులు కొటియా గ్రామాల్లో ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేపట్టి విజయవంతమైనట్లు తెలుస్తోంది. ఒడిశాలోని తాలూకా కేంద్రం పొట్టంగి నుంచి కొటియా గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడడంతో ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేయడానికి మార్గం సుగమమైంది. సాలూరు నుంచి కొటియా గ్రామాల రహదారి సౌకర్యం ఉన్నా రేషన్ లబ్ధిదారులు బయోమెట్రిక్ వేయడానికి సెల్ ఫోన్ సిగ్నల్స్ సమస్యగా కనిపిస్తోంది. దీంతో పూర్తి స్థాయిలో కొటియా గ్రామాల్లో ఎపి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ బియ్యం పథకాన్ని అమలు చేయలేకపోతోంది.

వైద్య విద్యను పేదలకు దూరం చేయొద్దు

• మెడికల్ సీట్ల అమ్మకం దుర్మార్గం • నిరసనలో ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య విద్యను పేదలకు దూరం చేయొద్దని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ డిమాండ్ చేశారు. మెడికల్ సీట్లను అమ్మడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాలల్లో సీట్లు అమ్మకంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108 జిఓలను నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విజయవాడలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాధనం ఖర్చుచేసి వైద్య కళాశాలలను నిర్మిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలల్లో సీట్లు అమ్ముకునేందుకు 107,108 ఉత్తర్వులు తీసుకురావడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీట్ల అమ్మకం భవిష్యత్తులో అన్ని కళాశాలల్లో అమలు చేస్తారని, ఇది వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే అని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు కేటగిరీలుగా సీట్లను భర్తీచేసి వాటిలో 50 శాతం సీట్లను సెల్ఫ్‌ఫైనాన్స్, ఎన్‌ఆర్‌ఐ భర్తీ ద్వారా కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా తయారు చేస్తున్నారని విమర్శించారు. కేవలం 25 శాతం మాత్రమే రిజర్వ్ సీట్లుగా కేటాయించడమంటే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు ద్రోహం చేసినట్లే అని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో కొత్త కళాశాలల్లో కన్వీనర్ కోటాలోనే సీట్లు భర్తీచేస్తున్నారని తెలిపారు. విద్యలో విప్లవాత్మక మార్పులు అంటే బలహీనవర్గాల ప్రజలకు విద్యను దూరం చేయడమేనా? అని ప్రశ్నించారు. సీట్ల అమ్మకాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 31న అన్ని జిల్లాల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచన చేసి వెంటనే ఉత్తర్వులను వెనక్కి తీసుకుని పేద విద్యార్థులకు వైద్య విద్య కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు పావని, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, రామ్మోహన్, కిరణ్, పరమేష్, వినోద్, రాష్ట్ర కమిటీ సభ్యులు సోమేశ్వరరావు, నావిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని లెనిన్ సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వచ్చే ఏడాది సొంత ప్రాంగణంలోకి..

- కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎస్.ఎ.కోరి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వచ్చే ఏడాది సొంత ప్రాంగణంలోకి క్యాంపస్ మారుస్తామని కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎస్.ఎ.కోరి పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాంపస్ ప్రస్తుతం జెఎన్‌టియు ఇంక్యుబేషన్ కేంద్రంలో నడుస్తున్నట్టు తెలిపారు. దీన్ని జంతలూరులో వద్దనున్న సొంత ప్రాంగణంలోకి వచ్చే ఏడాది మారే అవకాశమున్నట్టు తెలిపారు. ఇప్పటికే నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. దశల వారీగా పరిపాలనా భవనం, హాస్టళ్లు, లైబ్రరీ వంటివన్నీ వచ్చేస్తాయని చెప్పారు. దీంతోపాటు యుజి, పీజీ కోర్సుల సంఖ్య కూడా క్రమంగా పెంచుతూపోతామన్నారు. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి ఇస్రోతోనూ అనుసంధానం చేయబడి ఉన్నట్టు తెలిపారు. యూనివర్శిటీలో ఈ ఏడాది యూజి, పీజీ కోర్సుల్లో 385 సీట్లకుగానూ 2.20 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే 21 రాష్ట్రాల నుంచి 600 మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం అనుగుణంగా విద్యాబోధనను తీసుకొస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కరీంఖాన్ మాట్లాడుతూ 1997లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 25 సంవత్సరాలు పూర్తవుతోందన్నారు. ఎన్ఇపి విధానంలో ఇక్కడ కూడా విద్యా బోధన కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య రామిరెడ్డి, కేంద్రీయ విద్యాలయం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులు

- రిటైర్డు బెనిఫిట్స్ కోసం ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులు రోడ్డెక్కారు. ఆర్‌టిసి యజమాన్యం, ప్రభుత్వం రిటైర్మెంటు బెనిఫిట్స్ ఇవ్వకుండా వేధిస్తున్నారని గురువారం రిటైర్డు ఉద్యోగులు ఆర్‌టిసి హౌస్ వద్ద ఆందోళనకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి వచ్చిన రిటైర్డు ఉద్యోగులు ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన మొదట విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్సు కాంప్లెక్సు అరైవల్ పాయింట్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆర్‌టిసి ఎమ్‌డి కార్యాలయానికి వెళ్తామని పట్టుబట్టడంతో పోలీసులు అసోసియేషన్ ప్రతినిధులు నలుగురిని వినతిపత్రం అందజేసేందుకు అనుమతిచ్చారు. ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగుల ఆందోళనకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మద్దతు ప్రకటించి మాట్లాడారు. రిటైర్డు ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి సరైంది కాదన్నారు. రిటైర్డు అయ్యాక బెనిఫిట్స్ ఇవ్వకపోవడం తగదన్నారు. తక్షణం రిటైర్డు ఉద్యోగులందరికీ అన్ని రకాల బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె గంగాధరరావు, అధ్యక్షులు గద్దె రవీంద్రరావు మాట్లాడుతూ.. ఆర్‌టిసిలో 2020 నుంచి 2023 వరకు రిటైర్డు అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. తక్షణం రిటైర్డు ఉద్యోగులకు ఇవ్వాల్సిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పిఎఫ్ వంటి బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. రిటైర్డు అయ్యాక అనారోగ్య సమస్యలు పెరుగుతాయని తెలిసినా బెనిఫిట్స్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. చాలా మంది రిటైర్డు ఉద్యోగులు తమ బెనిఫిట్స్‌ను తీసుకోకుండా మృతి చెందుతున్నా.. ప్రభుత్వం కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసిలో రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణానికి పాస్‌లు ఇవ్వాలని కోరారు. మృతిచెందిన రిటైర్డు ఉద్యోగులకు మట్టి ఖర్చుల కోసం రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు విపి నరసింహారెడ్డి, కె కోటేశ్వరరావు, ఎస్ సుబ్రమణ్యం, బి దశరథ రామిరెడ్డి, సత్యవతి, సుగుణమ్మ, ఆనందరావు, కెవి రావు, రామస్వామి, మస్తాన్‌రావు, ఎన్‌వి నారాయణ, ఎల్‌సిహెచ్ రావు తదితరులు పాల్గొన్నారు. ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగుల ఆందోళనకు ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా హాజరై సంఘీభావం తెలిపారు.

సొసైటీలో రుణాల అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్, కిర్లంపూడి (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బినామీల పేరుతో రూ.కోట్ల రుణాలు గోల్ మాల్ చేసిన విషయమై అధికారులు వచారణ చేపట్టారు. ఈ పిఎసిఎస్ పరిధిలో 2012 నుంచి 2022 మధ్య కాలంలో రూ.85 కోట్ల కుంభకోణం జరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ సొసైటీలో వేలంక, సింహాద్రిపురం, కిర్లంపూడి, సిరిపురం, తదితర గ్రామాల పరిధిలోని 4 వేల మంది రైతులు ఉన్నారు. ఈ పదేళ్లలో రూ.200 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. 2006లో అప్పటి ప్రభుత్వ నిర్ణయంతో రూ.150 కోట్లకు పైగా రుణాలు మాఫీ అయ్యాయి. ఆ తర్వాత పునరుద్ధరించిన రుణాలు రూ.కోట్లలో ఉన్నాయి. వీటిలో సరైన పత్రాలు లేకుండా రుణాలు పొందడం వెనుక కొందరు నాయకులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొసైటీ రుణాల్లో వసూలు చేసిన కొంత మొత్తం కూడా నగదు పుస్తకాల్లో నమోదు చేయలేదనే అనుమానంతో ఆరా తీస్తే తీగలాగితే డొంక కదిలినట్లుగా అంతా బయటకు వచ్చింది. సరైన పత్రాలు, సెక్యూరిటీ లేకుండా రుణాలు మంజూరుచే శారని అధికారులు తేల్చారు. అలాగే రూ.85 లక్షల నిధులు సైతం గోల్ మాల్ అయినట్లు ప్రత్తిపాడు బ్రాంచ్ సూపర్‌వైజర్ ఎ.కొండ బాబు గుర్తించి ఉన్నతాధికారులకు తెలిపారు. దీనిపై డిసిసిబి సిఇఒ నరసింహారావు కలెక్టర్ కృతికాశుక్లాకు నివేదించడంతో కలెక్టర్ విచారణకు ఆదేశాలు ఇచ్చారు. డివిజనల్ కోఆపరేటివ్ అధికారి పద్మ గురువారం కిర్లంపూడి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రత్తిపాడు బ్రాంచ్‌ను సందర్శించి వివరాలను, ఆ రుణాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇంకా విచారణ చేపట్టాల్సి ఉందని ఆమె తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి : జెఎసి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట గురువారం మధ్యాహ్నం విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారాన్ని కోసం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి. దేవేంద్ర రెడ్డి, కార్యదర్శి పి. రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, జేఏఎం గ్రేడ్ 2 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని, పెండింగ్లో ఉన్న డిఏలను బకాయిలతో చెల్లించాలని, పిఆర్ సిని వెంటనే అమలు చేయాలని అపరిమితమైన వైద్య సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు తరలిరండి

- ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విజయవాడలో జరగనున్న ఆగస్టు 21, 22తేదీల్లో ఎపి ఎన్‌జిఒ 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు పెద్దఎత్తున ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక పార్వతీపురం మన్యం జిల్లాలోని ఎన్‌జిఒ భవనంలో పార్వతీపురం, కురుపాం తాలూకా యూనిట్ల ఎన్‌జిఒ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు జరుగనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలని కోరారు. దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగ్మోహన్‌రెడ్డి మొదటి రోజు విచ్చేస్తారని తెలిపారు. పండుగ వాతావరణంలో జరిగే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హాజరు కావాలని తెలిపారు. దీనికి సంబంధించి సావనీర్ విడుదల, ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రసంఘం ఇచ్చిన ఆదేశాలు మేరకు రెండు తాలూకా యూనిట్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు మిగిలిన కార్యవర్గసభ్యులు దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఎక్కువ మంది ఉద్యోగులను కౌన్సిల్ సమావేశాలకు హాజరైనట్టు తగుచర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. సభను విజయవంతం చేసి ఎపి ఎన్జీఓ ఐక్యతను, బలాన్ని తెలియపరచేలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా కార్యదర్శి ఆవు సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు కెబి శ్రీను, పార్వతీపురం అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్, అసోసియేట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కురుపాం తాలూకా యూనిట్ అధ్యక్షులు ప్రకాశరావు, కార్యదర్శి రామకృష్ణ, రెండు యూనిట్ల కార్యవర్గ సభ్యులు, ఎపి ఎన్జీఓ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాబ్బాబు మీకేం కావాలి!

- ఎన్నికలు సమీస్తున్న వేళ కార్యకర్తలకు తాయిలాలు
- స్థలాలు చూసుకోండి.. భూ పంపిణీలో మీకూ ఇస్తాం..!
- మద్దతుదారులను ప్రసన్నం చేసుకునే పనిలో అధికార నేతలు

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ వేడి మొదలైంది. 2024 ఎన్నికలకు సన్నద్ధం అయ్యేలా అన్ని రాజకీయ పార్టీలూ ఇప్పటి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నాయి. గెలుపే లక్ష్యంగా అందరినీ ప్రసన్నం చేసుకునే పనిలో నాయకులు పడ్డారు. అధికార పార్టీలో ఈ ప్రక్రియ ఎక్కువగా కన్పిస్తోంది. ఎందుకంటే అధికారం ఉండి కూడా ఈ నాలుగేళ్లలో తామేమీ లబ్ధిపొందలేదనే భావన ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి ఎన్నికల్లో అభ్యర్థులకు వీరు సహకరించే విషయంలో కూడా సందిగ్ధం నెలకొంది. దీంతో అధికార పార్టీ నేతలు ఆయా గ్రామాల వారీగా ద్వితీయ శ్రేణి నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 రెండు పార్లమెంటు స్థానాల్లోనూ వైసిపి గెలుపొందింది. మొదటిసారి ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ద్వితీయశ్రేణి నాయకులు వారి భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్నారు. అయితే వైసిపి అధికారం చేపట్టినా ద్వితీయ శ్రేణి, కార్యకర్తలను ముఖ్య నేతలెవరూ పట్టించుకోలేదన్న భావన కింద స్థాయి నేతల్లో ఉంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలోనూ పలుమార్లు నాయకులు, ముఖ్య నేతల తీరును కార్యకర్తలు ఎత్తిచూపారు. వారు ఏ రకంగా సంపాదించుకుంటున్నారో కూడా తెలియజేశారు. ఈ సమీక్షలు తరచూ జరుగుతుండటంతో కొంతమంది ఎమ్మెల్యే, ముఖ్య నాయకుల పట్ల అధిష్టానం కూడా సీరియస్‌గానే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏదో రకంగా అసంతృప్తితోనున్న వారిని తమ దారికి తెచ్చుకునేందుకు ముఖ్య నేతలు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. అందరినీ పిలిచి ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. ఏమి కావాలో అడిగి తెలుసుకుని వాటిని చేసే పెట్టే పనుల్లో కొంత మంది నేతలు నిమగ్నమయ్యారు. ఇందులో అనంతపురం, సత్యసాయి జిల్లా పరిధిలోనున్న ఒక నియోజకవర్గ నాయకులు ఆయనకు సమయం దొరికనప్పుడల్లా పంచాయతీల వారీగా నేతలను పిలిపించి వారి సమస్యలు వినడం, ఏమి చేయాలని అడగటం జరుగుతోంది. వాటిని పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటున్నట్టు కూడా హామీలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో మకాం వేసి ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి అసంతృప్తులను తిరిగి బుజ్జగించే పనిని చేపట్టారు. ఇంకో నియోజక వర్గంలో ప్రభుత్వం పంపిణీ చేయనున్న భూ పంపిణీలో వారికి కేటాయించాలని అధికారులకు ఆదేశాలిస్తున్నారు. అదే విధంగా విలువైన చోట ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ఒక్కొక్కరి రెండు నుంచి మూడు సెంట్ల వరకైనా ఇంటి స్థలాన్ని కేటాయించాలని అధికారులకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు అన్ని నియోజక వర్గాల్లోనూ భూ పంపిణీలోనే అసంతృప్తులను సంతృప్తి పరిచే చర్యలు చేపట్టారు.

అభివృద్ధి పనులు తీసుకునేందుకు వెనుకడుగు..!

వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు చేసుకోమంటే చేసుకోవడానికి కార్యకర్తలే వెనుకడుగువేస్తున్నారు. బిల్లులు సకాలంలో రాకపోతే ఇబ్బందులు పడుతామన్న ఉద్దేశంతో పనులు తీసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అది కూడా గతంలో 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ రకంగా పనులు చేసి బిల్లులు రాక ఇప్పటికీ ఇబ్బందులు పడుతుండటం చూసి వీరు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా భూములు అవి కాకుండా ఇసుక, మట్టిని విక్రయించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రకంగా ఎన్నికలకు ముందు కార్యకర్తలకు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉన్న అసంతృప్తిని చల్లార్చి తిరిగి ఎన్నికల్లో పనిచేయించుకునే ఆలోచన ముఖ్య నేతలు చేస్తున్నారు. దీంతో ఆ నేతల ఇళ్ల వద్ద ఇటీవల నిత్యం రద్దీ కన్పిస్తుండడం గమనార్హం.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు ఐక్యవేదిక వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సహకార రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగ యూనియన్ల ఐక్యవేదిక కోరింది. ఈ మేరకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యాన మూడు ఉద్యోగ సంఘాల నాయకులు గురువారం వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, కార్యదర్శి చిరంజీవి చౌదరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతినిధి వర్గంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్, అధ్యక్షులు టి వెంకట్రామయ్య, కోశాధికారి సత్యనారాయణ, ఎఐబిఇఎ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్ నాగేశ్వరరావు, నాయకులు రామాంజనేయులు, వైఎస్‌ఆర్‌టియు ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, నాయకులు రమేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతనెల 17న ఆప్కాబ్ ఎమ్‌డిని కలిసిన సమయంలో ఉద్యోగుల ప్రతిపాదనలను వ్యవసాయశాఖ కమిషనర్‌కు పంపామని తెలిపారని, ఇంతవరకు పరిష్కారం కాలేదని తెలిపారు. పిఎసిఎస్‌లలో వాటాదారులుగా రైతులు మాత్రమే ఉండాలని, ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణలు రద్దు చేయాలని కోరారు. సహకార సంఘాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చూడాలన్నారు. జిఓ నెంబర్లు 36, 90 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, 2016 ఏప్రిల్ నుండి మొనిటరీ బెనిఫిట్స్ చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ చట్ట ప్రకారం అమలు చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా బ్యాంకులు కలిపి డిస్ట్రిక్ట్ లెవల్ సపోర్టు ఫండ్, క్యాడర్ ఫండ్ ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఆర్థిక ప్రయోజనాలను పూర్తి చేసిన తరువాతే బదిలీలు చేయాలని, అప్పటి వరకూ నిపేయాలని విజ్ఞప్తి చేశారు. ఆప్కాబ్ మార్గదర్శకాలలో ఇచ్చిన 24.90 శాతాన్ని వెంటనే సవరించాలన్నారు. 2019 ఏప్రిల్ ఒకటి నాటికి వేతన సవరణ చేయాల్సి ఉందని, అంతవరకూ ఐఆర్ మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల జీతాలను ఆడిట్లో పెట్టడాన్ని నిలిపేయాలని అన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని, 2019 తరువాత చేరిన సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనరు చిరంజీవి చౌదరి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్వపార్టీలో... రోజాకు' సినిమా'..!

- ఏకాకిగా మిగిలిన నగరి ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఆర్‌కె రోజా అందరికీ సినిమా చూపిస్తుంది.. అయితే ఆమె నియోజకవర్గంలో సొంత పార్టీలోని వారు ఆమెకు 'రాజకీయ' సినిమా చూపిస్తున్నారు. జిల్లాను శాసిస్తున్న ఓ మంత్రి ఆమెను రాజకీయంగా ఎదగనీకుండా మొదటినుంచి అణచివేస్తూనే వచ్చారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఆ మంత్రి తన అనుచరగణాన్ని తయారు చేసుకుంటూ, నగరిలోనూ ఆర్‌కె రోజాకు వ్యతిరేకంగా ఓ గ్రూపును సిద్ధం చేశారు. వారికి పదవులు, కాంట్రాక్టు పనులు, గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇస్తూ రాజకీయంగానే కాదు, ఆర్థికంగానూ అనుచరగణానికి 'అండగా' ఉంటూ 'గ్రూపులను' ప్రోత్సహిస్తున్నారు. ఈ కోవలోనే రెడ్డివారి చక్రపాణిరెడ్డికి శ్రీశైలం ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. అలానే నగరి మాజీ ఛైర్మన్ శాంతమ్మ భర్త కెజె కుమార్‌కు మంత్రికి తెలియకుండానే 17 హెక్టార్లలో మైనింగ్ అనుమతులు దక్కాయి. వైసిపిలోనే ఉంటూ తనకు వ్యతిరేకంగా రాజకీయాలు చేస్తున్న చక్రపాణిరెడ్డి, కెజెకుమార్ తదితరులపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని సిఎం దృష్టికి పదేపదే తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. దీంతో రోజా చేసేదేమీ లేక నియోజకవర్గంలో నిస్సహాయంగా ఏకాకిగా ఉన్నానని తన సొంత అనుచరగణం ముందు వాపోవడం గమనార్హం. కొన్ని విషయాల్లో చక్రపాణిరెడ్డి, కెజెకుమార్‌లు ఫోన్ చేసి చెబుతుంటే సులభంగా జరుగుతున్నాయని, మంత్రిగా ఉండి సైతం మీ ద్వారా ఏ పనీ కావడం లేదని అనుచరులు ఆమె ముందు వాపోతున్నారు. దీంతో స్పందించిన ఆర్‌కె రోజా తాడోపేడో తేల్చుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దగ్గరగా భారీగా అనుచరగణంతో వెళ్లనున్నట్లు సమాచారం. ఏదిఏమైనా 'ఆ పెద్దాయన'ను కాదని మంత్రి ఆర్‌కె రోజా ఫిర్యాదులపై ముఖ్యమంత్రి స్పందిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

స్లిప్‌లు ఇచ్చి రేషన్ ఎగ్గొట్టారు..!

- మూడు నెలలుగా ఇదే తంతు
- రేషన్ ఇవ్వలేదంటూ కార్డుదారుల ఆందోళన

ప్రజాశక్తి-చిలమత్తూరు (సత్యసాయి జిల్లా)

గత మూడు నెలలుగా తమ వద్ద వేలి ముద్ర వేయించుకుని ఎండియు ఆపరేటర్ రేషన్ సరుకులు ఇవ్వలేదంటూ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం గొల్లపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో దాదాపు 120 రేషన్ కార్డులు ఉన్నాయని అయితే ప్రతి నెలా ఇదే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల నుంచి తమ గ్రామంలో నెట్‌వర్క్ రాదంటూ ఊరిబయటకు పిలిపించి బరువు పెట్టి వేలిముద్ర వేయించుకుని స్లిప్‌లు ఇచ్చి రేషన్ ఇవ్వకుండా ఎగ్గొడుతున్నాడని తెలిపారు. ప్రతి నెలా ఇదే పరిపాటిగా మారిందని అన్నారు. తమకు రేషన్ ఎందుకు ఇవ్వడం లేదని నిలదీస్తే నేను ఇచ్చేదే లేదు ఎవరికైనా చెప్పుకోండి అని బెదిరించినట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీఆర్వోకి చెప్పినా ప్రయోజనం లేదు

రేషన్ ఇవ్వని విషయంపై గత మూడు నెలల నుంచి వీఆర్వో శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తునే ఉన్నామని గొల్లపల్లి గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ ఏ మాత్రం స్పందించలేదన్నారు. బియ్యం అందక తాము ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వీఆర్వో తానేంచేయలేనని విధంగా మాట్లాడుతున్నాన్నారు. తహశీల్దార్ వద్దకు వెళ్తే తాను మాట్లాడతానని చెప్పడం తప్పా, సమస్యను పరష్కరించింది లేదన్నారు.

డీలర్ వద్ద లేని స్టాక్

ఎండియు ఆపరేటర్ శబరీని వివరణ కోరగా తాను వేలిముద్ర చేయించుకుని స్లిప్‌లు ఇచ్చిన మాట వాస్తవమేనని అయితే ఉన్న స్టాక్‌ను వారికి అందజేస్తానని వివరణ ఇచ్చాడు. వై.గొల్లపల్లికి సంబంధించిన యగ్నిశెట్టిపల్లి గ్రామంలోని డీలర్ షాప్‌ను పరిశీలించగా అక్కడ స్టాక్ లేకపోవడం కొసమెరుపు బియ్యంకు డిమాండ్ పెరగడం, కర్నాటకకు దగ్గరలో ఉండటంతో ఈ రేషన్ బియ్యం కర్నాటక రాష్ట్రానికి తరలిపోతున్నాయ అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జీడి 'మద్దతు'కు మరో పోరు

- కాశీబుగ్గలో నేడు 24 గంటల సత్యాగ్రహ దీక్ష
- గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టిన జీడిరైతు సంఘం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జీడిపిక్కల మద్దతు ధర కోసం రైతులు పట్టు వదలకుండా పోరాడుతున్నారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్న డిమాండ్లతో మూడు నెలలుగా పలురూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈనెల 18వ తేదీన కాశీబుగ్గలో మహాధర్నా నిర్వహించి ప్రభుత్వంలో కదలిక తెప్పించడంలో కొంత విజయం సాధించగలిగారు. రైతులు, వ్యాపారులతో మంత్రి సీదిరి అప్పలరాజు సమావేశం నిర్వహించినా, రైతులకు మేలు కలిగే అంశమేదీ లేకపోవడంతో వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉదాసీనం, వ్యాపారుల మోసం, మంత్రి అప్పలరాజు వంచనతో న్యాయం జరగని రైతులు కాశీబుగ్గ సంత మైదానంలో 24 గంటల సత్యాగ్రహ దీక్షకు సమాయత్తమవుతున్నారు.

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 70 వేల ఎకరాలకు పైగా జీడి సాగు ఉందని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు. సాధారణంగా ఎకరాకు ఐదు బస్తాల దిగుబడి వస్తుందని అధికారుల అంచనాగా ఉంది. ఉద్దానం ప్రాంతంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వ్యాపారులు జీడి పంట కొనుగోళ్లు ప్రారంభించారు. ఏప్రిల్ రెండో వారం వరకు 80 కేజీల బస్తాకు రూ.10,500 వరకు చెల్లించారు. పంట చేతికి రావడం, రైతుల వద్ద పుష్కలంగా పిక్కలు ఉండడంతో క్రమేణా ధర తగ్గిస్తూ రూ.8 వేలు వరకు ఇచ్చారు.

పప్పుకు రేటు... రైతులకు పోటు

పలాస జీడిపప్పుకు మంచి రేటు ఉన్నా, ముడి సరుకుకు ధర రాకపోవడంపై రైతులకు అంతుచిక్కడం లేదు. 80 కేజీల జీడి పిక్కలను ప్రాసెస్ చేయిస్తే 25 కేజీల పప్పు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ పప్పు రూ.700 పలుకుతోంది. ఈలెక్కన 25 కేజీలకు రూ.17,500 వస్తుంది. దీంతోపాటు 65 కేజీల జీడి తొక్కు వస్తుంది. కేజీ రూ.15కు అమ్మినా రూ.975 వస్తుంది. మొత్తం కలిపి రూ.18,475 వరకు వస్తోంది. ప్రాసెసింగ్, కూలీల ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు, వ్యాపార లాభం అన్నీ కలిపి రూ.రెండు వేలు మినహాయిస్తే రూ.16,475 మిగులుతోంది. రైతులు ప్రస్తుతం రూ.16 వేలు అడగడం సమంజసమే అన్న అభిప్రాయం అంతటా వినిపిస్తోంది.

విదేశీ జైళ్లలో 8,300 మంది భారత ఖైదీలు

న్యూఢిల్లీ : విదేశీ జైళ్లలో 8,300 మంది భారత ఖైదీలు మగ్గుతున్నారని విదేశాంగశాఖ వెల్లడించింది. ఇందులో యుఎఇ, సౌదీ అరేబియా, కువైట్ తదితర గల్ఫ్ దేశాల్లోనే ఎక్కువ మంది ఉన్నారని తెలిపింది. విదేశాల్లోని భారత ఖైదీల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని విదేశాంగశాఖ సహాయ మంత్రి వి మురళీధరన్ చెప్పారు. ఈ ఖైదీలను విడుదల చేసి, స్వదేశానికి రప్పించేందుకు అక్కడి ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ, యుఎఇలోని జైళ్లలో 4,630 మంది భారత ఖైదీలు శిక్ష అనుభవిస్తున్నట్టు కేంద్రం తెలిపింది. ఇందులో అత్యధికంగా యుఎఇలో 1,611 మంది, సౌదీలో 1,461, ఖతార్‌లో 690 మంది ఖైదీలు ఉన్నట్టు పేర్కొన్నది.

ఐఫోన్ కోసం కన్నకొడుకునే అమ్మేశారు !

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌కు చెందిన దంపతులు ఐఫోన్ కొనేందుకు కన్నకొడుకునే అమ్మేశారు. రీల్స్ చేసేందుకు ఎనిమిది నెలల పసికందును విక్రయించారు. నిందితులను కోల్‌కతాకు చెందిన జయదేవ్, సతిగా పోలీసులు గుర్తించారు. వీరికి ఏడేళ్ల కూతురు కూడా ఉంది. గత శనివారం కుమారుడిని విక్రయించిన ఆ దంపతులు.. అనంతరం ఖరీదైన ఐఫోన్‌ను కొనుగోలు చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి రీల్స్ చేశారు. అయితే రోజు గడవడమే కష్టంగా ఉండే ఆ దంపతుల చేతుల్లో ఖరీదైన ఐఫోన్ ఉండటం, కుమారుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానమొచ్చింది. దీంతో వారు భార్యాభర్తలను నిలదీయగా, డబ్బు కోసం కుమారుడిని విక్రయించినట్టు అంగీకరించారు. జయదేవ్‌తోపాటు బిడ్డను కొనుగోలు చేసిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు.

రూ. ఏడు లక్షల కోట్లు అప్పు చేసిన ఎపి ప్రభుత్వం

- కేంద్రానికి పురందేశ్వరి ఫిర్యాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి విమర్శించారు. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కేంద్ర మంత్రి మురళీధరన్‌తో కలిసి పురందేశ్వరి భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల మళ్లింపు వంటి రాష్ట్ర ఆర్థిక సమస్యలపై ఫిర్యాదు చేశారు. అలాగే సంస్థాగత మార్పులపై బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, సంస్థాగత కార్యదర్శి బిఎల్ సంతోష్‌ను కలిశారు. సంస్థాగతం గా చేయాల్సిన మార్పులపై అధిష్టానానికి నివేదిక అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2023 జులై నాటికి రూ.10,77,006 కోట్ల అప్పు ఏపికి ఉందని తెలిపారు.

సరిహద్దు ప్రతిష్టంభనపై బాలిలో చర్చించిన మోడీ, జిన్‌పింగ్

వెల్లడించిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ : గతేడాది బాలిలో జరిగిన జి 20 సమావేశాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు సరిహద్దుల్లో నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలియచేసింది. ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారని తెలిపింది. చైనా అధ్యక్షుడు ఈ విషయాన్ని వెల్లడించిన కొద్ది రోజుల తర్వాత భారత విదేశాంగ శాఖ ఈ ప్రకటన చేసింది. విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా ఆనాడు బాలిలో మీడియాతో మాట్లాడుతూ, ఇరువురు నేతలు కేవలం మర్యాదపూర్వకంగా మాట్లాడుకున్నారని మాత్రమే చెప్పారు. అయితే ఇటీవల జోహాన్నెస్‌బర్గ్‌లో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం నేపథ్యంలో భారత్ జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ డోవల్, చైనా విదేశాంగ వ్యవహారాల కమిషన్ డైరెక్టర్ వాంగ్ యి మధ్య సమావేశం జరిగింది. ఆ సమావేశంపై ప్రకటన చేస్తూ చైనా విదేశాంగ శాఖ పై విషయాన్ని వెల్లడించింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా దీనిపై ప్రకటన చేసింది.

కంపెనీలకు ఓకే.... రాష్ట్రాలకు నో !

- ఇథనాల్ తయారీ కోసం ఎఫ్‌సిఐ బియ్యం
- రాష్ట్రాలకు బియ్యం అమ్మకాలపై నిషేధం




న్యూఢిల్లీ : బహిరంగ మార్కెట్‌లో ఎఫ్‌సిఐ నుంచి రాష్ట్రాలకు బియ్యం అమ్మకాలపై నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం, ఇథనాల్‌ను ఉత్పత్తి చేసే డిస్టిలరీలకు మాత్రం సరఫరాలు పెంచింది. జూన్‌లో ఇథనాల్ తయారీ కోసం 2.77 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసింది. మూడేండ్ల కంటే తక్కువ వ్యవధిలోనే డిస్టిలరీలకు మొత్తం 24 లక్షల టన్నుల బియ్యాన్ని విక్రయించారు. ఎఫ్‌సిఐ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం జూన్‌లో డిస్టిలరీలకు 2,77,419.98 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయగా గత సంవత్సరం అదే నెలలో సరఫరా చేసింది కేవలం 87,778.81 మెట్రిక్ టన్నులు మాత్రమే. అంటే గత సంవత్సరంతో పోలిస్తే ఏకంగా 216% వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మేలో ఇథనాల్ ఉత్పత్తి కోసం 2.95 లక్షల టన్నుల బియ్యం విక్రయించారు.

2020-21 నుండి ఎఫ్‌సిఐ తన వద్ద ఉన్న బియ్యం మిగులు నిల్వలను ఇథనాల్ ఉత్పత్తి కోసం డిస్టిలరీలకు విక్రయిస్తోంది. ఇటీవలి కాలంలో సరఫరాలు గణనీయంగా పెరిగాయి. 2022-23 ఇథనాల్ సంవత్సరంలో 32 లక్షల టన్నుల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని విక్రయించాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకోవడంతో రాబోయే కాలంలో సరఫరాలు మరింత పెరిగే అవకాశం ఉంది. డిసెంబర్ 1 - తదుపరి సంవత్సరం నవంబర్ 31 మధ్య ఉన్న కాలాన్ని ఇథనాల్ సంవత్సరంగా వ్యవహరిస్తారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం బహిరంగ మార్కెట్ అమ్మకాల పథకం కింద ఎఫ్‌సిఐ బియ్యాన్ని క్వింటాలుకు రూ.2,250 చొప్పున డిస్టిలరీలకు విక్రయించాలని 2020 మార్చిలో కేంద్రం నిర్ణయించింది. అదే సంవత్సరం డిసెంబర్‌లో రేటును రూ.2,000కు తగ్గించింది. అప్పటి నుండీ అదే ధరకు సరఫరా చేస్తోంది.

సేకరణ, నిల్వ ఖర్చులతో పోలిస్తే ఇథనాల్ కోసం అమ్మే బియ్యం ధర చాలా తక్కువగానే ఉంటోంది. 2020 నుండి బియ్యం విక్రయాల ద్వారా ఎఫ్‌సిఐకి రూ.4,844 కోట్ల ఆదాయం లభించింది. బహిరంగ మార్కెట్‌లో తమకు బియ్యాన్ని విక్రయించాలని కర్నాటక, పశ్చిమబెంగాల్, తమిళనాడు సహా పలు రాష్ట్రాలు కోరినప్పటికీ కేంద్రం అంగీకరించలేదు. జూన్ 13 నుండి బహిరంగ మార్కెట్‌లో రాష్ట్రాలకు బియ్యం, గోధుమల విక్రయాలను నిలిపివేసింది.

ఉన్నత విద్యా సంస్థల్లో పెరుగుతున్న డ్రాపవుట్లు

- సగానికి పైగా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి విద్యార్థులే



న్యూఢిల్లీ : 2019-2023 మధ్యకాలంలో ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఐఐఎంలు, కేంద్ర యూనివర్శిటీలు సహా ఉన్నత విద్యా సంస్థలలో చదువుతున్న 32 వేల మందికి పైగా విద్యార్థులు మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పారు. రాజ్యసభకు అందజేసిన సమాచారంలో కేంద్ర విద్యా శాఖ ఈ విషయాన్ని తెలియజేసింది. చదువులను మధ్యలోనే వదిలేస్తున్న వారిలో ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఇతర వెనుకబడిన తరగతుల వారు సగానికి పైగా ఉన్నారని వివరించింది. ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ సమాధానమిస్తూ కేంద్ర యూనివర్శిటీలలోనే అత్యధిక డ్రాపవుట్లు (17,454) చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఐఐటీల నుంచి 8,139, ఎన్‌ఐటీల నుండి 5,623, ఐఐఎస్‌ఈఆర్ నుండి 1,046, ఐఐఎంల నుంచి 858, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి 803, స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుంచి 112 మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేసి వెళ్లిపోయారని ఆయన వివరించారు. డ్రాపవుట్లలో 52 శాతం మంది ఎస్‌సిలు (4,423), ఎస్‌టిలు (3,774), ఒబిసిలు (8,602) ఉన్నారని అన్నారు.

కోర్సులను ఎంచుకోవడంలో తప్పిదాలు, పనితీరు సరిగా లేకపోవడం, వ్యక్తిగత-ఆరోగ్య కారణాల వల్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో డ్రాపవుట్లు అధికంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు లభించడం, మెరుగైన అవకాశాల కోసం వేరే కోర్సులు ఎంచుకోవడం కూడా డ్రాపవుట్లకు కారణమవుతున్నాయని వివరించారు. డ్రాపవుట్ల సంఖ్యను తగ్గించేందుకు ఉన్నత విద్యా సంస్థలు దిద్దుబాటు చర్యలు చేపట్టాయని సుభాష్ సర్కార్ చెప్పారు.

జమిలి ఎన్నికల నిర్వహణ సులభం కాదు

- ఐదు రాజ్యాంగ సవరణలు చేయాలి
- వేల కోట్లు ఖర్చు చేయాలి
- భారీగా ఈవిఎం, వివిప్యాట్‌లు అవసరం
- రాజ్యసభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొద్ది కాలంగా జమిలి ఎన్నికలపై దేశ వ్యాప్తంగా రకరకాలైన చర్చలు, ఊహాగానాలు నడుస్తున్న నేపథ్యంలో రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జమిలి ఎన్నికలు ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహించడం కష్టమని అన్నారు. "ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అంత ఈజీ కాదు. ఒకేసారి ఎన్నికల నిర్వహణ వల్ల అనేక లాభాలు ఉన్నప్పటికీ అందుకు అనేక కీలక అవరోధాలు, అడ్డంకులు కూడా ఉన్నాయి. కనీసం ఐదు కీలక రాజ్యాంగ సవరణలు చేయాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగంలో పార్లమెంట్ ఉభయ సభల వ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 83, లోక్‌సభ రద్దు చేయడానికి రాష్ట్రపతికి ఉన్న అధికారాలకు సంబంధించిన ఆర్టికల్ 85, రాష్ట్ర శాసన సభల కాల వ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 172, రాష్ట్రాల శాసన సభలు రద్దు సంబంధించిన ఆర్టికల్ 174, రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి సంబంధించిన ఆర్టికల్ 356ను సవరించాల్సి ఉంది. అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయాన్ని పొందడం. పాలనా వ్యవస్థలో ముఖ్యమైన సమాఖ్య నిర్మాణానికి సంబంధించి, అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఏకాభిప్రాయం కూడా పొందడం అత్యవసరం. పెద్ద ఎత్తున అదనపు ఈవిఎంలు, వివిప్యాట్ యంత్రాలు అవసరం. అందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. అయితే ఆ ఈవిఎంలు, వివిప్యాట్ యంత్రాలు 15 ఏళ్ల కంటే ఎక్కువ పనిచేయవు. ప్రతి 15 ఏళ్లకు ఒకసారి అంత పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేయాలి. అంతా భారీ స్థాయిలో ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఈవిఎం, వివిప్యాట్ యంత్రాలను కేవలం మూడు, నాలుగు సార్లు మాత్రమే ఉపయోగించగలం. అదనంగా పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు అవసరం" అని తెలిపారు. "ఒకేసారి ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే కేంద్ర సిబ్బంది, న్యాయ శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలన చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం సహా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపింది. తదుపరి రోడ్ మ్యాప్ రూపకల్పనకై ప్రస్తుతం లా కమిషన్ పరిశీలనలో ఉంది" అని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పేర్కొన్నారు.

సుభాష్ ముండా హంతకులను తక్షణమే అరెస్టు చేయండి

పొలిట్ బ్యూరో డిమాండ్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ (ఐఎన్‌ఎన్)-న్యూఢిల్లీ : జార్ఖండ్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రముఖ గిరిజన నాయకులు సుభాష్ ముండా దారుణ హత్యను సిపిఎం పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. హంతకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో రాంచీ జిల్లాలోని దళదల్లిలోని అతని కార్యాలయంలోనే కొందరు దుండగులు దారుణంగా కాల్చి చంపారు. రాంచీ జిల్లాలోని నగ్రి ప్రాంతంలో 34 ఏళ్ల సుభాష్ ముండా ఒక ప్రముఖ నాయకుడని, గిరిజన, పేద, అట్టడుగు వర్గాల ప్రజల హక్కులను పరిరక్షించే పోరాటాల్లో కీలకంగా ఉన్నారని పొలిట బ్యూరో తెలిపింది. సామాన్య ప్రజల్లో ముండాకు ఉన్న ఆదరణ, ఆకర్షణ కారంగానే హతియా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు సార్లు, మందార్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో సిపిఎం తన అభ్యర్థిగా నిలబెట్టిందని గుర్తు చేసింది. ముండా హత్య కేసుపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేయాలని, హంతకులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

మణిపూర్‌కు ప్రతిపక్ష ఎంపిలు

29,30 తేదీల్లో పర్యటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో 85 రోజులు దాటినా హింసాకాండ మాత్రం ఆగడంలేదు. అయినా కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాత్రం స్పందించటం లేదు. మణిపూర్‌లో పర్యటించలేదు. దీంతో ప్రతిపక్షాల (ఇండియా) కూటమి ఎంపిలు మణిపూర్‌కు వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఈ నెల 29, 30 తేదీల్లో (శని, ఆదివారం) మణిపూర్‌లో ప్రతిపక్ష ఎంపిలు పర్యటించనున్నారు.

సిబిఐకి ఊరేగింపు కేసు

దేశవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించిన మహిళలను నగ్నంగా ఊరేగించిన కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను తేల్చాలని ఆదేశించింది. నిందితులకు శిక్ష పడేలా చూడాలని కోరింది. అంతేకాకుండా.. ఈ కేసుకు సంబంధించిన ముఖ్యమైన విచారణను మణిపూర్ వెలుపల నిర్వహించాలని ఆదేశించింది. మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్న నేపథ్యంలో విచారణకు అంతరాయం కలగొచ్చన్న ఉద్దేశంతో కేంద్రం ఈ మేరకు సూచనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన అఫిడవిట్ దాఖలు చేయనున్నట్టు సమాచారం.

ఆగని హింసాకాండ

మణిపూర్‌లో హింసాకాండ ఆగడం లేదు. తాజాగా బుధవారం రాత్రి, గురువారం ఉదయం బిష్ణుపూర్ సమీపంలోని మొయిరంగ్ గ్రామంపై కొంత మంది దుండగులు తుపాకులతో కాల్పులకు పాల్పడ్డారు. గ్రామంలో సుమారు 30 ఇళ్లను తగులబెట్టారని స్థానికులు తెలిపారు.

మూడేళ్లలో 20 సార్లు పెరిగిన గ్యాస్ ధర

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మూడేళ్లలో వంట గ్యాస్ ధర 20 సార్లు పెరిగింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 14.2 కేజీల వంట గ్యాస్ సిలిండర్ ధర 2020 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 1 వరకు మొత్తం 20 సార్లు పెరిగిందని తెలిపారు. 2020 ఏప్రిల్ 1న వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.714.5 ఉండగా, 2023 మార్చి 1 నాటికి రూ.1,102.50కి పెరిగిందని తెలిపారు.

రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గురువారం రాజ్యసభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడేందుకు ప్రయత్నిస్తే, అధికార పక్ష ఎంపిలు అడ్డుకున్నారు. దీన్ని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేపట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే నాలుగు నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ సినిమాటోగ్రఫీ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంలో ప్రతిపక్షాలను గురించి కేంద్రం మంత్రి వ్యాఖ్యలు చేయగా, దాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. సినిమాటోగ్రాఫ్ బిల్లుపై బిజెడి ఎంపి ప్రశాంత్ నందా, బిజెపి ఎంపిలు అశోక్ బాజపేయ్, రాదా మోహన్ దాస్ అగర్వాల్, సోనల్ మన్‌సింగ్, పబిత్రా, ధనంజయ, కవితా పటిదార్, గీతా చంద్రప్రభ, బిప్లవ్ దేవ్, అజయ్ ప్రతాప్ సింగ్, బాబురామ్ నిషాద్, జివిఎల్ నరసింహారావు, భువనేశ్వర్ కలిట, అన్నాడిఎంకె ఎంపి తంబిదొరై, వైసిపి ఎంపిలు నిరంజన్ రెడ్డి, వి.విజయసాయి రెడ్డి, టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్, టిఎంసి(ఎం) ఎంపి జికె వాసన్, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథ్వాలే మాట్లాడారు. అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఇండియా వర్సెస్ మోడీ స్లోగన్ వార్

మణిపూర్ అంశంపై ప్రకటన చేయాలని కోరుతూ ప్రతిపక్ష ఎంపిలు ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో రాజ్యసభలో గురువారం 'స్లోగన్ వార్' జరిగింది. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ విదేశీ వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై సభలో ప్రసంగిస్తున్న సమయంలో గందరగోళం చోటుచేసుకుంది. ప్రతిపక్షాలు 'ఇండియా, ఇండియా' అంటూ నినాదాలు చేస్తూ, ప్రధానిని విమర్శిస్తూ పలు రకాల నినాదాలు చేస్తుండగా, అధికారపక్షం 'మోడీ, మోడీ' అంటూ నినాదాలు ఇచ్చింది.

నైజర్‌లో కుట్ర ప్రయత్నాన్ని ఖండించిన యుఎన్ చీఫ్

ఐక్యరాజ్య సమితి : నైజర్‌లో కుట్ర ప్రయత్నాన్ని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. "నైజర్‌లో పరిస్థితులను గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రజాస్వామ్య పాలనకు, శాంతి సుస్థిరతలకు విఘాతం కలిగించేందుకు బలప్రయోగంతో అధికారాన్ని హస్తగతం చేసుకునే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు." అని ఆ ప్రకటన పేర్కొంది. సంయమనం పాటించాల్సిందిగా ఆయన సంబంధిత పక్షాలకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థకు రక్షణ కల్పించాల్సి వుందన్నారు. నైజర్ ప్రభుత్వానికి, ప్రజలకు ఐక్యరాజ్య సమితి బాసటగా వుంటుందన్నారు. పశ్చిమాఫ్రికా దేశమైన నైజర్‌లో అధ్యక్ష గార్డు విభాగానికి చెందిన సైనికులు అధ్యక్షుడిని బుధవారం ఆయన ప్యాలెస్‌లో చుట్టుముట్టి దిగ్బంధించారు. దేశాధ్యక్షుడు మహ్మద్ బజూమ్ ప్రస్తుతం తన భార్యతో కలిసి రాజధాని నియామీలో తన నివాస భవనంలోనే బందీగా వున్నారని ఆ ప్రకటన పేర్కొంది. అధ్యక్ష గార్డు విభాగం అధిపతితో జరిగిన చర్చలు విఫలమవడంతో ఆయనను బందీ చేశారు.

సైనిక సహకారంపై రష్యా, ఉత్తర కొరియా చర్చలు

- రష్యా రక్షణ మంత్రి షోయిగుతో కిమ్ భేటీ



సియోల్ : సైనిక సహకారం, ప్రాంతీయ భద్రతా వాతావరణం అంశాలపై చర్చించేందుకు రష్యా రక్షణ మంత్రి సెర్గి షోయిగుతో ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ సమావేశమయ్యారు. కొరియా యుద్ధం ముగియడానికి దారి తీసిన యుద్ధ విరమణ సంధి 70వ వార్షికోత్సవాన్ని ఉత్తర కొరియా జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. రాజధాని ప్యాంగాంగ్‌లో బుధవారం కిమ్, షోయిగు చర్చలు జరిపారని ఉత్తర కొరియా అధికార వార్తా సంస్థ కెసిఎన్‌ఎ తెలిపింది. జాతీయ రక్షణ, భద్రతా రంగాల్లో పరస్పర ఆందోళన కలిగించే అంశాలపై, అలాగే ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా వాతావరణానికి సంబంధించిన అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిపింది. అయితే ఆ అంశాలు ఏమిటనేది నిర్దిష్టంగా వెల్లడించలేదు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంతకం చేసిన సుహృద్భావ లేఖను కిమ్‌కు షోయిగు అందచేశారు. చర్చించిన మిలటరీ అంశాలు కూడా ఏమిటనేది తెలియరాలేదు. 1953 జులై 27న ఉభయ కొరియాల మధ్య సాంకేతికంగా యుద్ధం ముగిసింది. ఉత్తర కొరియా దీన్ని విజయంగా భావిస్తుంది. ఉత్తర కొరియా సముపార్జించి కొత్త ఆయుధాలను చూపించేందుకు ఆయుధ ఎగ్జిబిషన్‌కు షోయిగును కిమ్ తీసుకెళ్ళారు. ఉత్తర కొరియా సైనిక పాటవాన్ని విస్తరించేందుకు రూపొందిస్తున్న జాతీయ ప్రణాళికల గురించి ఆయనకు తెలియచేశారు. లాంచర్ ట్రక్కులపై పెట్టిన పెద్ద క్షిపణుల వరుసకు సమీపంలో ఇద్దరు నడుస్తున్న ఫోటోలు బయటకు వచ్చాయి. ఉత్తర కొరియా ఇప్పటివరకు బహిరంగంగా ప్రకటించని కొత్త నిఘా డ్రోన్‌లు, దాడి జరిపే డ్రోన్‌ల ముందు నుండి ఇరువురు నేతలు నడిచారు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంలో రష్యా వైపే ఉత్తర కొరియా వుంది. ఉక్రెయిన్‌లో యుద్ధం కోసం ఉత్తర కొరియా ఆయుధాలను సమకూరుస్తోందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆరోపించారు.

పాలస్తీనియన్ల ప్రయోజనాలకు మద్దతు

- అబ్బాస్, హనియేలతో ఎర్డోగన్ భేటీ



అంకారా : టర్కీ అధ్యక్షుడు రెసెస్ తైయిప్ ఎర్డోగన్ బుధవారం పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్, హమస్ నేత ఇస్మాయిల్ హనియేలతో సమావేశమయ్యారు. మంగళవారం అబ్బాస్‌తో విడిగా ఎర్డోగన్ చర్చలు జరిపారు. పాలస్తీనా ప్రయోజనాలకు టర్కీ మద్దతునిస్తుందని ఎర్డోగన్ చెప్పారు. పాలస్తీనియన్ల సంక్షేమానికి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. సమావేశం అనంతరం ఇక్కడ జరిగిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, పాలస్తీనా వర్గాలన్నీ ఒక్క తాటిపైకి రావాలని, అప్పుడే వారి ప్రయోజనాలు నెరవేరుతాయని అన్నారు. ఈ క్రమంలో పాలస్తీనియన్ల ఐక్యత, సామరస్య ధోరణి చాలా కీలకమైనవని అన్నారు. పాలస్తీనియన్ల సమస్య పరిష్కారంలో అంతర్జాతీయ సమాజం ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి భాగస్వామ్యం కావాలని ఎర్డోగన్ నొక్కి చెప్పారు. 2007లో గాజా శ్రేణిని హమస్ స్వాధీనం చేసుకున్న తర్వాత పాలస్తీనియన్లలో అంతర్గత విభేదాలు నెలకొన్నాయి. అప్పటి నుండి రెండు వర్గాల మధ్య ఇంకా సామరస్యత నెలకొనాల్సి వుంది.

గోదావరి ఉగ్రరూపం



(మొదటి పేజీ తరువాయి)

వెళ్లే బస్సులు కుక్కునూరు నుంచి వెనక్కి తిరుగుముఖం పడుతున్నాయి. తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద నీరు భారీగా చేరడంతో ప్రాజెక్టు దిగువన ఉన్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తమ్మిలేరు రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 355 అడుగులు కాగా ప్రస్తుతం 345 అడుగులకు వరద నీరు చేరింది. ఏజెన్సీలోని జల్లేరు రిజర్వాయర్‌కు, ఎర్రకాల్వ ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వస్తోంది. దిగువకు నీరు విడుదలచేస్తే జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండలాలతోపాటు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, భీమవరం, తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు ప్రాంతాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి వరదనీరు దిగువకు విడుదల చేస్తే జిల్లా కేంద్రం ఏలూరును సైతం వరద నీరు చుట్టుముట్టనుంది.

ఆంధ్ర- ఒడిశా మధ్య నిలిచిన రాకపోకలు

అల్లూరు సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద శబరి నది 41.6 మీటర్ల నీటిమట్టం నమోదైంది. కొయుగురు వాగు పొంగి ప్రవహించటంతో రెండు రోజులుగా ఆంధ్ర - ఒడిశా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చట్టి వద్ద జాతీయ రహదారి - 30 పైకి వరద నీరు చేరడంతో భద్రాచలం - చింతూరు మధ్య రవాణా సౌకర్యం నిలిచిపోయింది. సోకులేరు వాగు పొంగి ప్రవహించడంతో చింతూరు - విఆర్.పురం మండలాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. విఆర్.పురం మండలంలోని ఒడ్డిగూడెం, అడవి వెంకన్నగూడెం, రామవరం, సోంపల్లి, సుష్టివారిగూడెం, చింతరేగు పల్లి, గుర్రంపేట, విఆర్.పురం గ్రామాల చుట్టూ నీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శ్రీరామగిరి, కొల్లూరు, కోటార్ గొమ్ము, ములకలపల్లి జలదిగ్బంధనంలో ఉండటంతో అధికారులు అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అలాగే భద్రాచలం నుంచి కూనవరం వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న మురుమూరు వద్ద నీళ్ల చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎటపాక మండలంలోని పలు గ్రామాల సమీపంలోకి వరద నీరు వచ్చి చేరింది. విఆర్.పురంలోని వరద బాధిత గ్రామాలైన ఒడ్డుగూడెం, అడవి వెంకన్నగూడెం, శ్రీరామగిరిల్లో సిపిఎం నాయకులు పర్యటించి బాధితులను పరామర్శించారు.

శ్రీశైలానికి వరద నీరు

శ్రీశైలం జలాశయ గరిష్ట నీటి మట్టం 885 అడుగులు ప్రస్తుత నీటి మట్టం 817.70 అడుగులుగా ఉంది. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 215.807 టిఎంసిలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 39.2025 టిఎంసిలుగా ఉంది. తుంగభద్ర డ్యాం నీటినిలువ సామర్థ్యం 105.78 టిఎంసిలకు గాను ప్రస్తుతం 49.76 టిఎంసిలుగా నమోదయింది. ఇన్‌ఫ్లో 1,11566 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి1,37,294 క్యూసెక్కుల నీరు వస్తుండగా 1,36,850 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

వరదల్లో మమ్మల్ని వదిలేశారు

గోదావరి వరదల్లో ఇల్లు మునిగిపోయి సర్వం కోల్పోతున్న మమ్మల్ని ప్రభుత్వం, అధికారులు వదిలేశారు. తాజా వరదల్లో మా ఇల్లు మునిగిపోయింది. గ్రామాన్ని వదలి గుట్టపైకి వచ్చి గుడారం వేసుకున్నాం. ప్రభుత్వం నుంచి సాయం కరువైంది. పునరావాస కేంద్రాలకు సైతం తీసుకెళ్లలేదు. కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి వెళ్లిపోయారు. ఎలా వండుకోవాలి.. ఏం తినాలి. పైన వర్షం, కింద వరద. ఇటువంటి సమయంలో ఉప్పు, పప్పు, కారం, కొవ్వొత్తులు వంటివి కూడా ఇవ్వకపోవడం చాలా దారుణం.

బొగ్గ రామమ్మ, కుమ్మూరు గ్రామం, చింతూరు మండలం

మాపై ఇంత చిన్నచూపా..

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మాపై చిన్నచూపు తగదు. గుడారం వేసుకుందామంటే బరకాలు కూడా ఇవ్వలేదు. బుధవారం నుంచి తిండి లేక అలాగే ఉన్నాం. పాల ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు కూడా అందించలేదు. ఏ అధికారీ మమ్మల్ని పట్టించుకోవడం లేదు.

పోర్తుల సాయి, ఒడ్డుగూడెం, విఆర్.పురం మండలం

వరదలపై అధికారుల అప్రమత్తం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



కోనసీమ జిల్లా అయినవిల్లి కాజ్‌వేపైకి చేరిన వరద నీటిలోనే ప్రయాణిస్తున్న బస్సు

వరదలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. గోదావరికి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో గురువారం ఉన్నతాధికారులతో సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షం సహా గోదావరి ఉప నదులు కిన్నెరసాని, శబరి పొంగి ప్రవహిస్తుండటంతో గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాలోని పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక చర్యల్లో భాగంగా 3 ఎన్‌డిఆర్‌ఎఫ్, 4 ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని సిఎంకు అధికారులు వివరించారు. వరద ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాల కోసం సిఎం ఆదేశాల మేరకు ముందుస్తుగా ఆయా జిల్లాల కలెక్టర్లకు నిధులు విడుదల చేశామన్నారు. వరద ప్రభావిత జిల్లాల్లో ఇప్పటికే కంట్రోల్ రూమ్స్ పని చేస్తున్నాయని, ముంపునకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో బోట్లు సహా సహాయక సిబ్బందిని సిద్ధం చేశామని అధికారులు పేర్కొన్నారు. సహాయక శిబిరాల్లో ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని, తాగునీటితో సహా సదుపాయాల విషయంలో ఎక్కడా లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. సహాయక చర్యల్లో అవసరమైతే సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు.



మీకోసం
పగిలిన గుడ్డును కొద్దిగా వెనిగర్ కలిపిన నీటిలో ఉడికిస్తే లోపలి ద్రవం బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం
ఉన్నతంగా ఆలోచించడం అలవాటు చేసుకున్నప్పుడే మనకు మనమే మార్గదర్శకులుగా మారుతాం.

కోకిలమ్మ పిల్లలు



ఒక అడవిలో ఒక చెట్టు పైన కాకి, కోకిల తమ పిల్లలతో నివసించేవి. కాకి తన గూటిలోని పిల్లలకు ఆహారం తెచ్చేటప్పుడు, కోకిల పిల్లలకు కూడా పెట్టబోయేది. కానీ, కోకిల పిల్లలు తినేవికావు. కాకమ్మ పిల్లలతో ఆడుకునేవి కూడా కాదు. ఇదంతా గమనించిన కోకిల ఒక రోజు పిల్లలతో, 'మీరు కాకమ్మ తెచ్చే ఆహారం ఎందుకు తీసుకోవడం లేదు. తీసుకోవాలి కదా! అలాగే కాకమ్మ పిల్లలతో ఆడుకోవాలి కదా!' అంది.

అప్పుడు కోకిల పిల్లలు, 'కాకి అరుపులు వింటేనే మాకు చిరాగ్గా ఉంటుంది. అటువంటిది తాను తెచ్చిన ఆహారం ఎలా తింటాం? ఆ పిల్లలతో ఎలా ఆడుకుంటాం?' అన్నాయి.

'అలా అనకూడద'ని కోకిల ఎన్ని సార్లు చెప్పినా పిల్లలు తమ పద్ధతి మార్చుకోలేదు.

ఒకరోజు కోకిలమ్మ ఆహార సేకరణకి వెళ్లి పిల్లల దగ్గరకు వచ్చేటప్పటికి అవి కాకమ్మ తెచ్చిన ఆహారం తింటూ కనిపించాయి. కోకిలమ్మ ఆశ్చర్యపోయింది. సంతోషంతో పిల్లలను దగ్గరకు తీసుకుని, 'ఏంటి ఈ రోజు కాకమ్మ తెచ్చిన ఆహారం చాలా ఇష్టంగా తింటున్నారు. ఏమిటి సంగతి' అని అడిగింది.

అప్పుడు కోకిలమ్మ పిల్లలు, కోతి మామ చెప్పిన సంగతులు చెప్పాయి. 'కాకమ్మ గూడులో నువ్వు గుడ్లు పెట్టడం, ఆ గుడ్లను కాకమ్మ తన గుడ్లతో పాటు పొదగడం' వంటి విషయాలన్నీ కోతి మామ చెప్పింది. ఇన్నాళ్లు కాకమ్మను చాలా బాధ పెట్టాం. ఇకపై అలా ఉండం. కాకమ్మ పిల్లలతో కూడా ఆడుకుంటాం' అన్నాయి. ఆ మాటలు విన్న కోకిల చాలా సంతోషపడింది. పిల్లల్లో మార్పు తెచ్చిన కోతి మామకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది.

- మొర్రి గోపి,
88978 82202

పిల్లి 

ఆకు 

సూర్యుడు 

ఆవు 


జత చేయండి

పిల్లలూ కింద ఇచ్చిన బొమ్మలకు ఎదరుగా ఇచ్చిన వాటిల్లో సరైన పదాలను జత చేయండి.

నేను గీసిన బొమ్మ



తెన్నేరు నీలిమ,
8వ తరగతి,
వినయ్ ఇంగ్లీషు మీడియం స్కూల్,
ఎస్ రాయవరం,
అనకాపల్లి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లల చదువుపై మీరు శ్రద్ధ పెడుతున్నారా?



లత.. సేల్స్ గాళ్‌గా పనిచేస్తోంది. ఉదయం వెళ్తే.. సాయంత్రం దాటాకే ఇంటికి చేరేది. తనకు తీరిక ఉండదని పిల్లలిద్దరికీ స్కూల్లోనే ట్యూషన్లు పెట్టించింది. తను ఇంటికి వెళ్లిన కాసేపటికి పిల్లలు వస్తారు. రోజూ ఇదే దినచర్య. పిల్లలు ఏం చదువుతున్నారో, స్కూల్లో ఏం చెబుతున్నారో పట్టించుకోవాలని ఉన్నా సమయం ఉండడం లేదని బాధపడుతుంది.

దేవి.. విద్యావంతురాలు. ఇంట్లో పిల్లలు తన మాట వినరని, స్కూలు ముగిసిన తరువాత ప్రత్యేకంగా ట్యూషనుకు పంపుతోంది. 'స్కూల్లో ఏం హోం వర్క్ ఇచ్చారో.. ట్యూషన్లో ఏం చదువుతున్నారో' పిల్లలని ఎప్పుడూ అడిగేది కాదు. స్కూల్లో.. ట్యూషన్లో పిల్లలు కష్టపడిపోతున్నారని, ఇంట్లో కూడా చదువంటే ఒత్తిడికి గురవుతారని భావిస్తోంది.

తల్లిదండ్రుల్లో చాలామంది పిల్లల చదువుపట్ల ఇదే ధోరణిలో ఉంటారు. అయితే పిల్లల చదువు పట్ల చిన్న తరగతుల నుండే ప్రత్యేక శ్రద్ధ వహించాలి. స్కూలు టీచర్లు, ట్యూషను టీచర్లతో తరచూ మాట్లాడుతూ చదువు పట్ల పిల్లల ఆసక్తి, అనాసక్తులను గమనించాలి. ఏ రోజు పని ఆరోజే పూర్తి చేస్తున్నారో లేదో అడిగి తెలుసుకోవాలి. పిల్లలు, చదువు పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని తెలిసినప్పుడు కూడా వారితో చాలా నెమ్మదిగా మాట్లాడాలి. బలవంతంగా చదివించినా ఏదో మొక్కుబడిగా చదువుతారే గాని, ఇష్టంగా చదవరు. ఈ ప్రవర్తన వారి భవిష్యత్తు ప్రణాళికలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఏయే క్లాసు పిల్లలతో ఎలా మెలగాలో.. నిపుణులు ఏమంటున్నారో ఒకసారి చూద్దాం..

మీ పిల్లలు ఇప్పుడే స్కూలుకు వెళుతుంటే క్లాసు రూంలో ఏం జరిగింది? ఏం చెప్పారు? ఏయే ఆటలు ఆడుకున్నారు? స్నేహితుల వివరాలు వంటి ప్రశ్నలు వేయాలి. తీరిక లేని తల్లిదండ్రులైనా సరే, ఏదో ఒక సమయంలో పిల్లల స్కూలు సంగతులు పట్టించుకోవాలి. అది వారిపై మీరెంత శ్రద్ధ పెడుతున్నారో అర్థమయ్యేలా చేస్తుంది. అలాగే ఆ రోజు స్కూల్లో జరిగిన విషయాలు మీతో పంచుకోవడం వల్ల చిన్నప్పటి నుండే స్కూలు వాతావరణం పట్ల, చదువు పట్ల సానుకూల దృక్పథం అలవడుతుంది. అలాగే స్కూలుకు సకాలంలో వెళ్లడాన్ని కూడా చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలి. అది వారి క్రమశిక్షణకు మొదటి అడుగులా ఉపయోగపడుతుంది.

కొంచెం పెద్ద పిల్లలైతే ...

సాంకేతికతను ఉపయోగించుకుని ఎలా చదవాలో నేర్పండి. ఫోన్లో ఎప్పుడూ గేమ్స్ ఆడుతూ కూర్చొనే పిల్లలతో వివిధ యాప్‌ల్లో ఉండే విజ్ఞాన విషయాలపై శ్రద్ధ పెట్టేలా చేయండి. అప్పుడు పిల్లల్లో విజ్ఞాన అంశాలపై ఆసక్తి పెరిగి పై తరగతుల్లో మంచి ప్రతిభతో రాణిస్తారు.

ప్రవర్తన గురించి చెప్పండి..

పెద్దవారిని గౌరవించాలని ప్రతి తల్లిదండ్రీ చెబుతారు. కానీ పిల్లలకు అర్థం కాదు. అర్థమవ్వాలంటే తమ చుట్టూ వున్న వారితో సానుకూలంగా ప్రవర్తించాలని, అడిగిన విషయాలకు సమాధానం చెప్పాలని చెప్పండి. ఏదైనా సాయమడిగితే చేయాలని, చిన్న పిల్లలతో ప్రేమగా మాట్లాడాలని చెప్పండి. స్నేహితులతో గొడవలు పడొద్దనీ చెప్పండి.

చదువు విషయంలో టీచర్లతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. పిల్లలు ఏ సబ్జెక్టుల్లో ఇబ్బంది పడుతున్నారో తెలుసుకుని ఆ విషయాలపై పట్టు సాధించేలా సిద్ధం చేయాలి. స్కూలు యాజమాన్యాన్ని కూడా సంప్రదిస్తూ ఉండాలి. క్లాసు రూంలో పిల్లల ప్రవర్తనపై ఆరా తీయాలి. సబ్జెక్టు వారీగా వారి లోటుపాట్లు తెలుసుకోవాలి. పిల్లల పట్ల తల్లిదండ్రులుగా మీరేం చేయాలో అడగండి. ఇలా చేయడం వల్ల టీచర్లు, పిల్లలు కూడా మీకు సహకరిస్తారు. స్కూల్లోనూ, ఇంట్లోనూ సానుకూల వాతావరణం ఉంటేనే పిల్లలు, విద్యావంతులుగానే కాక, ఉన్నత వ్యక్తిత్వం గలవారిగా కూడా ఎదగగలుగుతారు.

ఈ పండ్లు ఎంతో మేలు

వర్షాకాలంలో చిటపట చినుకుల మధ్య వేడివేడిగా ఏమైనా చిరుతిళ్లు తినాలనిపిస్తుంది. కానీ, శరీరానికి పోషకాలు అందించే, రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం, పండ్లు తినడం ఉత్తమం. ఈ సీజన్‌లో దొరికే పండ్లు, వాటి ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



పనస : పనస పండులోని తొనలతోపాటుగా పచ్చిది కూడా మనం తినొచ్చు. రోజు వారి ఆహారంలో ఎన్నో రకాలుగా తయారు చేసుకొని తినొచ్చు. పనసలో ఫైబర్, విటమిన్స్, మినరల్స్ అధికంగా ఉంటాయి. శరీరానికి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. గింజలను కూడా తినొచ్చు. చాలా రుచికరంగా ఉంటాయి. ఎన్నో పోషక విలువలను కలిగి ఉంటాయి.

సీతాఫలం : సీతాఫలం వర్షాకాలంలోనే లభిస్తుంది. ఎన్నో అద్భుతమైన పోషక విలువలు ఉన్నాయి. ఫైబర్, పొటాషియం, విటమిన్ బి 6 అధికంగా ఉంటాయి. అనేక అనారోగ్య సమస్యలని నయం చేయడానికి సీతాఫలం చాలా బాగా ఉపయోగపడుతుంది. ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించుకోవడానికి కెరోటినాయిడ్లు ఎంతో అవసరం.

నేరేడు : నేరేడు పండ్లలో కేలరీలు తక్కువ. ఇనుము, ఫోలేట్, పొటాషియం, విటమిన్లు ఎక్కువగా ఉండటంతో బరువు తగ్గాలనుకునే వారికి ఇవి మంచి చాయిస్. అజీర్తిని తగ్గిస్తాయి కూడా.

చెర్రీస్ : వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే పండ్లలో చెర్రీస్ ఒకటి. యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే పండ్లు ఇవి. మెదడుపై ఒత్తిడి తగ్గించి ప్రశాంతత కలిగేలా చేస్తాయి. ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది.

అరటిపండ్లు : విటమిన్లు ఎక్కువగా ఉండే అరటిపండు ఎంతో ఆరోగ్యం. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్తి సమస్యలను పోగొడుతుంది. పిల్లలకు అరటిపండ్లు చాలా మంచివి. రోజుకో పండైనా తినిపించాలి. దీంతో శరీరానికి శక్తి లభిస్తుంది.

యాపిల్ : వర్షాకాలంలో శరీరంలో చురుకుదనం కాస్త నెమ్మదిస్తుంది. జీవప్రక్రియ వేగం కూడా తక్కువగా ఉంటుంది. వీటిని అధిగమించేందుకు యాపిల్ పండు ఉత్తమం.

ప్లమ్స్ : ఇవి వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. ఫ్లూ, జలుబు వంటి ఇన్ ఫెక్షన్ల నుంచి కాపాడతాయి.

దానిమ్మ : ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. రక్తం పడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకూ రోజకొక పండైనా తింటే ఆరోగ్యంగా ఉంటారు.

బొప్పాయి : విటమిన్ 'సి' అధికంగా లభించే పండు బొప్పాయి. ఆరోగ్యానికి ఎంతో మంచిది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వర్షాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. ఇందులో పీచు పదార్థం ఎక్కువ. కాస్త మితంగా తీసుకోవడం ఉత్తమం.



'భోళా శంకర్' ట్రైలర్ వచ్చేసింది


చిరంజీవి నటిస్తున్న 'భోళా శంకర్' చిత్రం నుండి శుక్రవారం రామ్‌చరణ్ ట్రైలర్ విడుదల చేశారు. 'హౌరా బ్రిడ్జి దగ్గర ఇంకో అమ్మాయి మిస్సింగ్ అంట సార్.. అంటున్న డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. పబ్లిక్‌కు ప్రాబ్లమ్ వస్తే పోలీసుల దగ్గరకు పోతారు. కానీ పోలీసులకు ప్రాబ్లమ్ వస్తే భోళాభాయ్ దగ్గరకు వస్తారు. 'నీ వెనక మాఫియా ఉంటే.. నా వెనుక దునియా ఉంది ...' అంటూ చిరంజీవి తనదైన స్టైల్‌లో చెబుతున్న డైలాగ్స్‌ను ఈ ట్రైలర్‌లో చూపించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, క్రియేటివ్ కమర్షియల్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి మహతి స్వరసాగర్ సంగీతం అందిస్తున్నారు. ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదలకానుంది.

ఆ వార్తల్లో నిజం లేదు..



'తమిళ సినిమాల్లో తమిళ నటులే నటించాలని, ఇతరులకు అవకాశం లేదని వస్తున్న వార్తల్లో నిజం లేదు. ఒకవేళ కోలీవుడ్‌లో అలాంటి ప్రతిపాదన వస్తే మొదట ప్రశ్నించే వ్యక్తిని నేనే. ఇప్పుడు మనమంతా పాన్ ఇండియా, గ్లోబల్‌స్థాయి చిత్రాలు చేస్తున్నాం. ఏ సినిమా పరిశ్రమకైనా ఇతర భాషల ఆర్టిస్ట్‌ల అవసరం ఉంటుంది. ఇలాంటి తరుణంలో ఎవరూ ఈ తరహా నిర్ణయాలు తీసుకోరు. అయితే తమిళ చిత్ర పరిశ్రమ కార్మికుల కష్టాలు తీర్చేందుకు సెల్వమణి ఓ బలమైన నిర్ణయం తీసుకున్నారు. అందులో పర భాషా ఆర్టిస్ట్‌లు ఉండకూడదు అన్న ప్రస్తావనే లేదు. తమిళ చిత్ర పరిశ్రమకు ఓ ట్రెడిషన్ ఉంది. ఎస్వీ రంగారావు, సావిత్రమ్మ, వాణిశ్రీలాంటి ఎందరో అగ్రతారలు తమిళ సినిమాలో భాగమై ఉన్నారు. ఆ ట్రెడిషన్ ఇప్పటికీ అలాగే ఉంటుంది. దయచేసి అపోహలను నమ్మవద్దు. భాషా బేధాలు లేకుండా అందరం కలిసి పని చేద్దాం. ఇండియన్ సినిమాను ఉన్నత స్థాయికి తీసుకెళ్దాం' అని నాజర్ ఓ వీడియో విడుదల చేశారు. తాజాగా నిర్వహించిన 'బ్రో' సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో తమిళ ఇండస్ట్రీపై పవన్ చేసిన వ్యాఖ్యలకు సమాధానంగా నాజర్ ఈ వీడియో విడుదల చేసినట్లు తెలుస్తోంది. నాజర్ తమిళ సినిమా నటీనటుల సంఘం 'నడిగర్ సంఘం' అధ్యక్షుడుగా ఉన్నారు.

వరుణ్ తేజ్ కొత్త సినిమా 'మట్కా'



హీరో వరుణ్‌తేజ్ మరో కొత్త చిత్రాన్ని ప్రకటించారు. ఇటీవలే 'గాండీవధారి అర్జున' షూటింగ్ పూర్తి చేసిన ఈ హీరో తన తర్వాత సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ను కూడా షేర్ చేశారు. కొత్త సినిమా టైటిల్‌ను 'మట్కా'గా వెల్లడించారు. ఈ మేరకు టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'పలాస' దర్శకుడు కరుణకుమార్ వైరా ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'సరికొత్త ప్రపంచానికి ఉషస్సు' అంటూ విడుదల చేసిన ఈ కొత్త సినిమా పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. ఇందులో వరుణ్‌తేజ్ సరసన మీనాక్షి చౌదరి నటిస్తోంది. నోరా ఫతేహి ఓ కీలకపాత్రలో కనిపించనుంది. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్‌తేజ్ నటిస్తోన్న 'గాండీవధారి అర్జున' ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో సాక్షి వైద్య కథానాయిక.



28న కెప్టెన్ మిల్లర్ టీజర్

ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం కెప్టెన్ మిల్లర్. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. సత్యజ్యోతి ఫిలింస్ పతాకంపై టి జి త్యాగరాజన్ సమర్పణలో సెంధిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. 1930-40 మధ్య కాలంలో దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లుగా సమాచారం. టీజర్ ఈనెల 28న విడుదల కానుంది. ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, సందీప్ కిషన్, ప్రియాంక అరుళ్ మోహన్, నివేదితా సతీశ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జివి ప్రకాష్ కుమార్ సంగీతం. శ్రేయాస్ కృష్ణ డీవోపీనూ, నాగూరన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

చిక్కుల్లో జాన్వీకపూర్ కొత్త చిత్రం



'బవాల్'కు కొత్త ఇబ్బందులు వచ్చి పడ్డాయి. జాన్వీకపూర్, వరుణ్ ధవన్ నటించిన ఈ చిత్రాన్ని వెంటనే ప్రైమ్ నుంచి తొలగించాలంటూ యూదుల మానవ హక్కుల సంస్థ సైమన్ వైసెంతల్ సెంటర్ డిమాండ్ చేసింది. యూదుల మారణకాండను ఉద్దేశించేలా ఈ సినిమాలో చిత్రీకరించిన సన్నివేశాలు, సంభాషణలపై అంతర్జాతీయ స్థాయిలో నెటిజన్ల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలోనే యూదుల మానవ హక్కుల సంస్థ సైమన్ వైసెంతల్ సెంటర్ రంగంలోకి దిగింది. ఈ చిత్రాన్ని వెంటనే అమెజాన్ ప్రైమ్ వీడియో నుంచి తొలగించాలంటూ సదరు ఓటీటీ సంస్థను డిమాండ్ చేసింది. నెట్టింట జరుగుతోన్న వివాదంపై నితీశ్ తివారీ ఇటీవల స్పందించారు. "వివరణాత్మక విమర్శలు తీసుకోవడానికి నేనెప్పుడూ ముందుంటా. గతంలో నేను తెరకెక్కించిన సినిమాలకూ ఇలాంటి విమర్శలే వచ్చాయి. 'బవాల్‌'లో మంచి సందేశాలు ఉన్నాయి. వాటిని వదిలేసి.. రెండు, మూడు విషయాలను తెరపైకి తీసుకొచ్చి సినిమా మొత్తాన్ని తక్కువగా చేసి మాట్లాడుతున్నారు. ఆష్విట్జ్‌లో ఎదురైన పరిస్థితులు చూసి అజ్జూ, నిషా చలించి పోయినట్టు చూపించాను కదా. విమర్శలు చేసేవాళ్లు ఆ సన్నివేశాలను గుర్తించలేదా?" అని నితీశ్ ప్రశ్నించారు.

స్పిన్నర్ల దెబ్బకు
విండీస్ విల విల



కుల్దీప్ (4/6)

తొలి వన్డేలో భారత్ ఐదు వికెట్ల తేడాతో గెలుపు



జడేజా(3/37)

బార్బడోస్: వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో భారతజట్టు ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ జట్టు భారత స్పిన్నర్లు దెబ్బకు కేవలం 114పరుగులకే కుప్పకూలింది. అనంతరం టీమిండియా 22.5ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 118పరుగులు చేసి గెలిచింది. తొలుత రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ దెబ్బకు విండీస్ బ్యాటర్లు క్రీజ్‌లో నిలదొక్కుకోలేకపోయారు. కెప్టెన్ రోహిత్ శర్మ తమపై ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయక విండీస్ బ్యాటర్లను కట్టడి చేశారు. ముఖ్యంగా స్పిన్నర్లు కుల్దీప్(4/6), జడేజా(3/37) స్పిన్ మాయాజాలానికి తోడు ముఖేశ్, శార్దూల్, హార్దిక్ ఒక్కో వికెట్ పడగొట్టారు. వన్డేల్లో భారత్ చేతిలో విండీస్ జట్టుకు ఇది రెండో అత్యల్ప స్కోర్. అంతకుముందు 2018లో తిరువనంతపురంలో విండీస్ జట్టు 104పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్, వికెట్ కీపర్ షాయ్ హోప్(43) టాప్ స్కోరర్, అథంజే(22), కింగ్(17), హెట్‌మెయిర్(11) రెండంకెల స్కోర్ చేశారు. ఛేదనలో టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్(52) అర్ధసెంచరీతో రాణించినా.. శుభ్‌మన్(7) నిరాశపరిచాడు. ఆ తర్వాత మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్(19), హార్దిక్ పాండ్యా(5), జడేజా (16నాటౌట్), శార్దూల్ (1) తక్కువ స్కోర్‌కే పెవీలియన్‌కు చేరారు. ఆ తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మ(12నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించాడు. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలవగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్దీప్‌కు లభించింది.

వన్డే ప్రపంచకప్ సన్నద్ధతలో భాగంగానే..: రోహిత్ శర్మ

ఐసిసి వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఆటగాళ్ల సత్తాను పరీక్షిస్తున్నామని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడించాడు. ఓవైపు ప్రయోగాలు చేస్తూనే మరోవైపు విజయాల కోసం కృషి చేస్తామని, ఈ క్రమంలోనే విండీస్‌తో తొలి వన్డేకు నలుగురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నామని తెలిపాడు. లెఫ్ట్ అండ్ రైట్ కాంబినేషన్ కోసం సంజూ శాంసన్‌ను పక్కన పెట్టాల్సి వచ్చిందన్నాడు. అక్షర్ పటేల్‌కు బదులు శార్దూల్ ఠాకూర్ జట్టులోకి వచ్చాడు. గాయంతో జట్టుకు దూరమైన మహమ్మద్ సిరాజ్ స్థానంలో ముకేష్ కుమార్ అరంగేట్రం చేయనున్నాడని, వన్డే ప్రపంచకప్‌కు ముందు ప్రతి సిరీస్ ముఖ్యమైనదని అన్నాడు.

క్వార్టర్స్‌కు ప్రణయ్, లక్ష్యసేన్

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్, లక్ష్యసేన్ దూసుకెళ్లారు. గురువారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో 8వ సీడ్ ప్రణయ్ రాయ్ 19-21, 21-9, 21-9తో సహచర ఆటగాడు కిదాంబి శ్రీకాంత్‌పై పోరాడి నెగ్గాడు. హోరాహోరీగా జరిగిన పోరులో తొలి సెట్ కోల్పోయినప్పటికీ వెనుకడుగు వేయకుండా అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. వరుసగా రెండు గేమ్‌లు సొంతం చేసుకొని క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. శ్రీకాంత్‌పై ప్రణయ్‌కు నాలుగేళ్ల తర్వాత ఇదే తొలి విజయం. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో ప్రణయ్ రాయ్ టాప్‌సీడ్, డెన్మార్క్‌కు చెందిన విక్టర్ అక్సెల్సన్‌తో తలపడనున్నాడు. మరో పోటీలో లక్ష్యసేన్ 21-14, 21-16తో సునేయ మా(జపాన్)పై వరుస సెట్లలో నెగ్గాడు. క్వార్టర్స్‌లో కోకీ వటనబే(జపాన్)తో తలపడనున్నాడు.

సాత్విక్-చిరాగ్ ముందంజ

డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సత్తా చాటుతోంది. గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో 3వ సీడ్ సాత్విక్-చిరాగ్ 21-17, 21-11తో డెన్మార్క్‌కు చెందిన జెప్పె బే, లస్సె మొల్మోడేపై గెలుపొందారు. క్వార్టర్స్‌లో చైనీస్ తైపీ జోడీతో పోటీపడనున్నారు.

ఇంగ్లండ్ 283ఆలౌట్

లండన్: యాషెస్ సిరీస్ ఐదో, చివరి టెస్ట్ తొలిరోజునుంచే హోరాహోరీగా మొదలైంది. టాస్ గెలిచిన ఆసీస్ కెప్టెన్ కమిన్స్ బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు 54.4ఓవర్లలో 283పరుగులకు ఆలౌటైంది. హేరీ బ్రూక్స్(85) అర్ధసెంచరీతో రాణించగా.. డకెకట్(41), వోక్స్(36), మొయిన్ అలీ(34) టాప్ స్కోరర్స్. స్టార్క్‌కు నాలుగు, హేజిల్‌వుడ్, మర్ఫీకి రెండేసి, కమిన్స్, మిఛెల్ మార్ష్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం ఆస్ట్రేలియా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 61 పరుగులు చేసింది.

పాకిస్తాన్ క్లీన్‌స్వీప్

కొలంబో: శ్రీలంకతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను పాకిస్తాన్ జట్టు 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక జట్టు 188పరుగులకు ఆలౌట్ కావడంతో పాకిస్తాన్ జట్టు ఇన్నింగ్స్ 222 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. గురువారం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టును పాకిస్థాన్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నోమన్ అలీ(7/70) ఏడు వికెట్లతో సత్తా చాటాడు. నసీమ్ షా(3/44) నిప్పులు చెరిగే బౌలింగ్ చేశాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అబ్దుల్లా షఫీక్‌కు, సిరీస్ అఘా సల్మాన్‌కు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68